

అధికారులు, మహిళలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్

జిల్లాలో బాల్య వివాహాలపై యంత్రాంగం సమరభేరి మోగించింది. నియంత్రణకు అందరినీ చైతన్యవంతం చేస్తోంది. ఆ మేరకు కలెక్టర్ తమీమ్ అన్సారియా చొరవతో 'బంగారు బాల్యం' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. అధికారులంతా కదిలారు. క్షేత్రస్థాయిలోని వివిధ విభాగాల ఉద్యోగులు ప్రజా చైతన్య కార్యక్రమాలను చేపడుతున్నారు. ఈనెల 14 నుంచి 20 వరకూ ఇందుకోసం జిల్లావ్యాప్తంగా వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బాల్యవివాహాల నిర్మూలన కోసం సోమవారం ఒకే రోజున జిల్లాలోని అన్ని గ్రామాల్లోనూ ప్రత్యేకంగా ప్రజలకు అవగాహన సదస్సులతోపాటు విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించారు.

- బంగారు బాల్యం పేరుతో జిల్లావ్యాప్తంగా ప్రజా చైతన్య కార్యక్రమాలు
- ఉత్సాహంగా వారోత్సవాలు
- ఒకే రోజు అన్ని గ్రామాల్లో అవగాహన సదస్సులు
- రేపు ఒంగోలులో ముగింపు సభ
- అనంతరం మరిన్ని కార్యక్రమాలపై కలెక్టర్ దృష్టి
- బాలికల విద్య, ఆరోగ్యం పెంపు, హక్కుల రక్షణ లక్ష్యం



బాల్య వివాహాలపై కంభంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

బాల్య వివాహాలపై సమరం

నినదించిన ప్రభుత్వ యంత్రాంగం

ఒంగోలు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల రహిత జిల్లా సాధనే లక్ష్యంగా ప్రభుత్వ యంత్రాంగం కార్యాచరణ చేపట్టింది. అందులో భాగంగా సోమవారం గ్రామాల్లో భారీఎత్తున అవగాహన కార్యక్రమాలను అధికారులు చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. దేశంలో బాల్య వివాహాలు అధికంగా ఉన్న రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ద్వితీయ స్థానంలో ఉండగా రాష్ట్రంలో రెండో స్థానంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా ఉంది. ఏటా 37శాతం బాలికలకు 18 ఏళ్లు నిండకముందే వివాహాలు చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు బాల్య

జిల్లాలో ఏటా పెద్దసంఖ్యలో బాల్య వివాహాలు జరుగుతున్నాయి. గత ఐదేళ్లలో ఐసీడీఎస్, ఇతర శాఖలు, పోలీసులు కేవలం 347 వివాహాలను మాత్రమే అడ్డుకోగలిగారు. ఇటీవల దేశంలో బాల్యవివాహాల నిర్మూలనకు చర్యలు చేపట్టాలని సుప్రీంకోర్టు కూడా మార్గదర్శకాలు ఇచ్చింది. అదేసమయంలో జిల్లాలో బాల్య వివాహాల సమస్యపై కలెక్టర్ తమీమ్ అన్సారియా ఇక్కడ బాధ్యతలు చేపట్టిన కొద్దిరోజులకే అవగాహనకు వచ్చారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ వైద్యశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన సమయంలో వీటిని ప్రధానంగా గుర్తించారు. సంబంధిత అధికారులతో సమీక్షల సమయంలో బాల్య వివాహాలు, వాటి వల్ల అనర్థాల తీవ్రతను గుర్తించి మొత్తం యంత్రాంగాన్ని సమాయత్తం చేసి ఈ దురాచారంపై సమరం చేయాలన్న నిర్ణయానికి వచ్చారు.

కలెక్టర్ అన్సారియా ప్రత్యేక దృష్టి

వివాహాలను దురాచారంగా ప్రకటించి యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో అడ్డుకట్ట వేసేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ పెద్దగా మార్పు ఉండటం లేదు. ప్రజల్లో అవగాహనా రాహిత్యం, ఆర్థిక పరిస్థితులు అంతంతమాత్రం, చదువు భారం అన్న భావన తల్లిదండ్రులలో ఉండటం వంటి కారణాలతో ఈ వివాహాలు అధికంగా సాగుతున్నాయి. దీంతో చదువుతో బంగారు భవిష్యత్‌కు బాటలు పడాల్సిన వయస్సులో బాలికల మెడల్లో పుస్తెల తాడులు పడుతూ కుటుంబ వ్యవస్థలోకి రావాల్సి వస్తోంది. అలాంటి వారిలో 19 ఏళ్లలోపే ఎక్కువ మంది గర్భం దాల్చుతున్నారు. దీంతో అనేక శారీరక, మానసిక సమస్యలు వస్తున్నాయి. పౌష్టికాహార లోపం, రక్తహీనత చోటుచేసుకొని తక్కువ వయస్సులోనే మరణాలు, దీర్ఘకాలం అనారోగ్య సమస్యలతో అల్లాడటం సర్వసాధారణమైంది. బాల్య వివాహాల నిరోధానికి ప్రభుత్వం చట్టాలు చేసినా పెద్దగా అరికట్టలేకపోతున్నారు. అడపాదడపా నిలువరిస్తున్నా అధికశాతం పెళ్లిళ్లు జరుగుతూనే ఉన్నాయి.

బంగారు బాల్యం పేరుతో..

ప్రధానంగా బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలతోపాటు బాలికల విద్య, ఆరోగ్యంతోపాటు హక్కులపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని భావించిన కలెక్టర్ బంగారు బాల్యం పేరుతో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తొలుత జిల్లా నుంచి మండల స్థాయి అధికారుల వరకూ అందరూ దీనిపై దృష్టిసారించేలా రెండునెలల క్రితం ఒంగోలులో భారీ సదస్సు నిర్వహించారు. ప్రముఖ బాలల హక్కుల ఉద్యమకారుడు కైలాస్ సత్యర్థి, జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ స్వామిలు అందులో పాల్గొన్నారు. అనంతరం కనీసం ఏడాదిపాటు

మిగతా 6వ పేజీలో

108 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

- స్పందించకపోతే 26 నుంచి సమ్మె
- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సుబ్బారావు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం 108 సర్వీస్ కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను ఈనెల 25వతేదీలోపు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో 26వ తేదీ నుంచి చేపడుతున్న సమ్మెకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే దీక్షను ఆయన ప్రారంభించి మాట్లాడారు. 108 నిర్వహణను ప్రభుత్వమే చేపట్టాలని డిమాండ్ చేశారు. అరబిందో యాజమాన్యం నాలుగు సంవత్సరాల నుంచి కాంట్రాక్టు ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నదన్నారు. కార్మిక చట్టాల ప్రకారం రోజుకు ఎనిమిది గంటలు పనిచేయాల్సి ఉండగా.. 12గంటలు చేయించుకుంటున్నదన్నారు. ఎలాంటి అదనపు వేతనం ఇవ్వడం లేదని విమర్శించారు. కార్మికుల దగ్గర నుంచి పీఎఫ్, ఈఎస్ఐ డబ్బులను యాజమాన్యం మినహాయించుకుంటూ తమ వాటాను చెల్లించకుండా దోచుకుందని మండిపడ్డారు. అరబిందో యాజమాన్యం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నదని, ఆ విధానాలను ఉపసంహరించుకోకపోతే తగిన మూల్యం తప్పదని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్ నుంచి నెల్లూరు బస్టాండు వరకు, అక్కడి నుంచి తిరిగి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు. 108 కాంట్రాక్టు ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు దర్గామస్తాన్‌వలి అధ్యక్షతన నిర్వహించిన దీక్షలకు సీఐటీయూ నాయకులు చీకటి శ్రీనివాసరావు, టి.మహేష్ మద్దతు తెలిపారు. దీక్షలో మస్తాన్ వలి, భాస్కర్, సిహెచ్.స్వర్ణ, రత్నకుమారి, బి.భాస్కరనాగరాజు, గంగాధర్, చెన్నకేశవులు, మస్తాన్‌బాషా, గురవయ్య, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.



ఒంగోలులో ర్యాలీ చేస్తున్న 108 కాంట్రాక్టు ఉద్యోగులు



మార్కెట్‌కు తరలించేందుకు లోడింగ్ చేస్తున్న అరటి గెలలు

అరటి అధరహో..!

- గతేడాది గెల రూ.100.. ప్రస్తుతం రూ.300
- కంభం చెరువు కింద 500 ఎకరాల్లో సాగు
- ఇతర ప్రాంతాలకు ఎగుమతి

7



మృతదేహాలతో ఒంగోలులో ధర్నా చేస్తున్న దళిత సంఘాలు

చిన్నారులకు కన్నీటి వీడ్కోలు

- కొప్పోలు ప్రమాద మృతులకు ముగిసిన అంత్యక్రియలు
- కుటుంబాలకు న్యాయం చేయాలని కలెక్టరేట్ వద్ద దళిత సంఘాల ఆందోళన
- రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్

7

వైద్య పరీక్షల కోసం నిరీక్షణ

- జీజీహెచ్‌లో గంటలతరబడి ఎదురుచూపులు
- సిబ్బంది కొరతతో రోగుల అవస్థలు

7

ప్రచార పిచ్చికి తగిన శాస్తి!

- సర్వే రాళ్లపై జగన్ బొమ్మ తొలగింపు ప్రారంభం
- వచ్చేనెల 31లోపు ప్రక్రియ పూర్తి

చీమకుర్తి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పొలాల హద్దురాళ్లపై జగన్ బొమ్మ తొలగింపు మొదలైంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రచార పిచ్చి పరాకాష్ఠకు చేరిన విషయం విదితమే. రీసర్వే చేసిన గ్రామాల్లో భూముల సరిహద్దులకు ఉపయోగించిన సర్వే రాళ్లపై వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బొమ్మతోపాటు పేర్లను చెక్కించారు. ఈ రాళ్లను గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులపై ఒత్తిడి తీసుకొచ్చి మరీ సేకరించారు. దీనిపై రైతుల నుంచి పెద్దఎత్తున వ్యతిరేకత వ్యక్తమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ సర్వే రాళ్లపై బొమ్మలను, పేర్లను తొలగించాలని నిర్ణయించింది. ఈ బాధ్యతలను జిల్లాస్థాయిలో సర్వే, ల్యాండ్ రికార్డు అధికారులకు అప్పజెప్పింది. అందులోభాగంగా జిల్లాలోని 38 మండలాల పరిధిలో 298 గ్రామాల్లో 2.6 లక్షల రాళ్లపై జగన్ బొమ్మలు, పేర్లను తొలగించడంలో అధికారులు తలమునకలయ్యారు.

ఒక్కో రాయికి రూ.15

సర్వేరాళ్లపై జగన్ బొమ్మలు, పేర్ల తొలగింపును డిసెంబర్ 31లోపు పూర్తిచేయాలని ప్రభుత్వం నిర్దేశించడంతో అధికారులు ఉరుకులు పరుగులు తీస్తున్నారు. బొమ్మ తొలగించడానికి ఒక్కో రాయికి రూ.15 చెల్లించనున్నారు. అందుకోసం జిల్లాస్థాయిలో బిడ్లను ఆహ్వానించగా ఒక్కరే

మిగతా 6వ పేజీలో



సర్వే రాళ్లపై జగన్ బొమ్మ, పేర్లను తొలగిస్తున్న కార్మికుడు

రక్తమోడిన రోడ్లు

రెండుచోట్ల ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం

- వ్యక్తిని తప్పించబోయి టిప్పర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు
- డ్రైవర్‌తోపాటు యాత్రికుడు మృతి
- మరోచోట బైక్‌ను ఢీకొన్న లారీ
- రెండేళ్ల చిన్నారి, ఆశావర్కర్ మృతి
- తండ్రికి తీవ్రగాయాలు
- పుట్టిన కొడుకును చూసేందుకు వెళ్తుండగా ప్రమాదం

త్రిపురాంతకం/పెదదోర్నాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని రహదారులు సోమవారం రక్తమోడాయి. వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు మృతిచెందారు. పలువురికి గాయాలయ్యాయి. త్రిపురాంతకం మండలం కేశినేనిపల్లి సమీపంలో హైవేపై యాత్రికుడిని తప్పించబోయి టిప్పర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఇద్దరు మృతిచెందారు. ముగ్గురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. పెద్దదోర్నాల మండలంలోని కొత్తూరు వద్ద హైవేపై బైక్‌ను లారీ ఢీకొనడంతో చిన్నారితోపాటు ఆమె బంధువైన ఆశావర్కర్ మృతిచెందారు. చిన్నారి తండ్రికి తీవ్రగాయాలయ్యాయి. పొదిలి మండలం తలమళ్ల సమీపంలో ఆగి ఉన్న టిప్పర్‌ను వేగంగా వస్తున్న మరో టిప్పర్ వెనుక నుంచి వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి.

వ్యక్తిని తప్పించబోయి..

వేగంగా వస్తున్న ఆర్టీసీ బస్సు రోడ్డు దాటుతున్న వ్యక్తిని తప్పించబోయి ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్‌తోపాటు, రోడ్డు దాటుతున్న వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని కేశినేనిపల్లి వద్ద ఎన్‌హెచ్ 544డీపై సోమవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకొంది. పోలీసుల కథనం ప్రకారం.. పల్నాడు జిల్లాలోని కండ్లకుంటకు చెందిన కొందరు తీర్థయాత్రకు వెళ్లి తిరిగి వస్తూ కేశినేనిపల్లి వద్ద బస్సు ఆపారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు బస్సు దిగిన గాలి వెంకటేశ్వర్లు (72) రోడ్డు దాటే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో విజయవాడ నుంచి కర్నూలు వెళుతున్న సూపర్ లగ్జరీ బస్సు వేగంగా వచ్చి ఆయన్ను ఢీకొట్టింది. కంగారు పడిన డ్రైవర్ స్టీరింగ్‌ను పక్కకు తిప్పడంతో ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవరు తిరుపతిరావు క్యాబిన్‌లో ఇరుక్కుని అక్కడికక్కడే మృతిచెందాడు. గాలి వెంకటేశ్వర్లుకు తీవ్రగాయాలడంతో నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. చికిత్సపొందుతూ ఆయన మృతిచెందాడు. బస్సులో ప్రయాణిస్తున్న ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ఎక్స్‌కవేటర్ సహాయంతో వాహనాలను తొలగించారు. క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవరు మృతదేహాన్ని బయటకు తీశారు. ఎస్ఐ శివబసవరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఎర్రగొండపాలెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కొడుకు పుట్టాడన్న ఆనందం.. అంతలోనే విషాదం

కొడుకు పుట్టాడన్న ఆనందం ఆ భార్యాభర్తలకు 24 గంటలు కూడా నిలవలేదు. పొత్తిళ్లలో ఉన్న బిడ్డను చూసేందుకు కుమార్తె, బంధువుతో బయల్దేరిన తండ్రి ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టింది. దీంతో రెండేళ్ల కుమార్తెతోపాటు, బంధువైన ఆశాకార్యకర్త మృతి చెందారు. ఈ ఘటన దోర్నాల మండలం

మిగతా 6వ పేజీలో



ప్రమాదంలో గాయపడిన గురవయ్య



బస్సు డ్రైవరు మృతదేహాన్ని బయటకు తీస్తున్న పోలీసు సిబ్బంది

అసెంబ్లీలో గళంవిప్పిన ఇద్దరు ఎమ్మెల్యేలు



కందుల నారాయణరెడ్డి



ముత్తుముల అశోక్‌రెడ్డి

- మార్కాపురం పలకల పరిశ్రమను ఆదుకోవాలి
- డిజైన్ స్లేట్‌పై జీఎస్టీని తగ్గించాలి : కందుల
- గిద్దలూరు వైద్యశాలను 100 పడకలకు పెంచాలి : ముత్తుముల

7

సాగు సందడి

జిల్లావ్యాప్తంగా వ్యవసాయ పనులు ముమ్మరమయ్యాయి. ఇటీవల వర్షాలు కురవడంతో పొగాకు నాట్లు ఊపందుకున్నాయి. ఇతరత్రా రబీ పంటల సాగు జోరందుకుంది. సేద్యపు పనుల్లో రైతులు, కూలీలు బిజీ అయ్యారు. పొలాల్లో సందడి వాతావరణం నెలకొంది.

- ఆంధ్రజ్యోతి, ఒంగోలు



నాగులుప్పలపాడు వద్ద పొగాకు నాట్లు వేస్తున్న కూలీలు

దోమల పొగ పీల్చి అస్వస్థత

చికిత్స పొందుతూ యువకుడు మృతి

అద్దంకి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఫాగింగ్ పొగను పీల్చిన యువకుడు గండి చినబాబు(18) అస్వస్థకు గురై చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు అద్దంకి పట్టణంలోని గరటయ్యకాలనీకి చెందిన చినబాబు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నెల 10వ తేదీన మున్సిపల్ సిబ్బంది గరటయ్య కాలనీలో ఫాగింగ్ చేయగా ఆ పొగను పీల్చుకున్న చినబాబు అనారోగ్యానికి గురయ్యాడు. అద్దంకి, ఒంగోలు వైద్యశాలలో చికిత్స చేయించి గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. అక్కడ నుంచి వచ్చిన సమాచారం మేరకు అద్దంకి పోలీసులు కేసు నమోదు చేశారు.

బాల్య వివాహాలపై సమరం

(5వ పేజీ తరువాయి)

ప్రజా చైతన్య కార్యక్రమాలు వివిధ రూపాలలో నిర్వహించాలని భావించిన కలెక్టర్ బాలల దినోత్సవం సందర్భంగా బంగారు బాల్యం పేరుతో ఈనెల 14 నుంచి 20 వరకు వారోత్సవాలకు శ్రీకారం చుట్టారు. తొలిరోజు జిల్లావ్యాప్తంగా ర్యాలీలు చేపట్టారు. అనంతరం రోజుకు ఒకరకమైన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వారంపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నారు. జిల్లాస్థాయిలో వారోత్సవాల ముగింపు సభను ఒంగోలు మినీ స్టేడియంలో భారీగా ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులు ఇవ్వనున్నారు.

చదలవాడలో పాల్గొన్న కలెక్టర్

వారోత్సవాల నిర్వహణలో భాగంగా సోమవారం జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాల్లో వివిధ వర్గాల ప్రజలతో అవగాహన సదస్సులు నిర్వహించారు. నాగులుప్పలపాడు మండలం చదలవాడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ అన్సారియా పాల్గొన్నారు. మొత్తం 38 మండలాల్లో ఆయా మండలాలకు స్పెషల్ ఆఫీసర్లు అయిన జిల్లా అధికారులు, గ్రామాల్లో పలువురు మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు. వారోత్సవాల అనంతరం నిరంతర పర్యవేక్షణ కార్యక్రమాలు కొనసాగించేలా వివిధ స్థాయిల్లోని అధికారులతో గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీలను కలెక్టర్ ఏర్పాటు చేశారు. ప్రతినెలా ఒక్కో స్థాయిలోని కమిటీ ఒక శుక్రవారం ఈ అంశంపై సమావేశం నిర్వహించేలా ఆదేశించారు. అలాగే ఒక్కో డివిజన్‌కు ఒక మండలాన్ని ఎంపిక చేసి అందులోని అన్ని గ్రామాలు చైల్డ్‌ఫ్రెండ్లీ గ్రామాలుగా మార్పు చెందేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు.

రక్తమోడిన రోడ్లు

(5వ పేజీ తరువాయి)

కొత్తూరు వద్ద సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని నందిగూడేనికి చెందిన దాసరి గురవయ్య భార్య వీరమ్మల రెండేళ్ల కుమార్తె పల్లవి ఉంది. వీరమ్మ దోర్నాల ప్రభుత్వ వైద్యశాలలో సోమవారం పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. విషయం తెలుసుకున్న గురవయ్య కుమారుడిని చూసేందుకు తన రెండేళ్ల కూతురు పల్లవి, వరుసకు చిన్నమ్మ, ఆ గ్రామానికి ఆశావర్కరు అయిన దాసరి నాగమ్మను బైక్‌పై ఎక్కించుకుని దోర్నాలకు బయల్దేరారు. కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై కొత్తూరు సమీపంలో వెనుకగా వస్తున్న లారీ వీరి మోటారుసైకిల్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో అదుపు తప్పి ముగ్గురూ రోడ్డుపై పడిపోయారు. దాసరి నాగమ్మ (36), ఆమె ఒళ్లో కూర్చున్న చిన్నారి పల్లవిపై నుంచి లారీ టైరు వెళ్లిపోయింది. దీంతో వారిద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. బైకు నడుపుతున్న గురవయ్య పక్కన పడటంతో కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ మహేష్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు. చిన్నారిని కోల్పోయిన దుఃఖం ఈ కుటుంబంలో ఉండగా, దాసరి నాగమ్మ కుటుంబం పరిస్థితి మరో రకంగా ఉంది. ఆమెకు భర్త, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. తల్లి ఆలనాపాలన అవసరమైన సమయంలో రోడ్డు ప్రమాదం రూపంలో ఆమె దూరమైంది. ఈ దుర్ఘటనతో నందిగూడెంలో విషాదఛాయలు అలముకున్నాయి.

ప్రచార పిచ్చికి తగిన శాస్తి

(5వ పేజీ తరువాయి)

ముందుకొచ్చారు. ఈ ఒక్కరే జిల్లా మొత్తం డిసెంబరు 31లోపు పూర్తిచేయలేరని భావించిన అధికారులు మండల, సచివాలయ సర్వేయర్ల సహాయంతో స్థానిక వర్కర్లను వినియోగించి తొలగింపును పూర్తిచేయాలని భావిస్తున్నారు. అందుకోసం సర్వేశాఖ బొమ్మలను తొలగించే మిషన్లను సైతం సరఫరా చేయనుంది. ఇప్పటికే జిల్లాలో ఈ ప్రక్రియ కొండపి తదితర మండలాల్లో ప్రారంభించారు. సోమవారం నుంచి మిషన్లు అందగానే ప్రక్రియను గడువులోపు పూర్తిచేయాలనే తలంపులో సర్వే అధికారులు ఉన్నారు.

డిసెంబరు 31లోపు తొలగింపు పూర్తిచేస్తాం

గౌస్‌బాష, జిల్లా సర్వే, ల్యాండ్ రికార్డ్స్ అధికారి

సర్వే హద్దురాళ్లపై బొమ్మలు, పేర్లను తొలగించాలని ప్రభుత్వం నుంచి అందిన ఆదేశాల మేరకు చర్యలను చేపట్టాం. తొలగింపునకు ఒక్కో రాయికి రూ.15 చెల్లిస్తాం. స్థానికంగా ముందుకు వచ్చిన వారికి అవకాశం ఇస్తాం. మండల సర్వేయర్లు, సచివాలయ సర్వేయర్ల సహాయంతో డిసెంబర్ 31లోపు తొలగింపును పూర్తిచేస్తాం.

పంచాయతీ కార్యదర్శి చేతివాటంపై కలెక్టర్‌కు ఫిర్యాదు



అర్జీదారుల నుంచి వినతిపత్రం తీసుకుంటున్న కలెక్టర్

లీవ్‌లో ఉన్న కార్యదర్శితో ఓటీపీ చెప్పించుకుని నిధులు డ్రా

సంతనూతలపాడు, నవంబరు18(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శి చేతివాటంపై రుద్రవరం గ్రామస్థులు సోమవారం ఒంగోలు కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే మండలంలోని రుద్రవరం గ్రామంలో గతనెల అక్టోబరు 16న సీసీరోడ్డుకు శంకుస్థాపన కార్యక్రమాన్ని ఎంపీడీవో, అక్కడ పనిచేసే కార్యదర్శికి బాధ్యతలు అప్పగించారు. రుద్రవరం గ్రామంలో పనిచేసే కార్యదర్శి మెటర్నిటీ లీవ్‌లో ఉండటంతో మంగమూరు గ్రామపంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న ప్రతాప్‌కు రెండురోజులు రుద్రవరం గ్రామ బాధ్యతలు అప్పగించారు. ఎమ్మెల్యే కార్యక్రమం కోసం ముందుగానే గ్రామంలో బ్లీచింగ్ చల్లి, పారిశుధ్య చర్యలు చేపడతారు. ఈక్రమంలో పంచాయతీస్టోర్‌లో బ్లీచింగ్ బస్తాలు ఉండగానే సర్పంచ్ ,ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు తీసుకున్న పంచాయతీ కార్యదర్శి ప్రతాప్ కలిసి బ్లీచింగ్ అవసరం లేకున్నా రూ.14వేల విలువ చేసే 20 బస్తాల బ్లీచింగ్, 40 బస్తాల సున్నం తెప్పించారు. నవంబరు 2న 14వేల విలువచేసే వాటికి మెటర్నిటీ లీవ్‌లో ఉన్న పంచాయతీ కార్యదర్శితో ఓటీపీ చెప్పించుకుని రూ.49వేలు డ్రాచేశారు. ఎమ్మెల్యే ప్రోగ్రాం సమయంలో వర్షం పడుతుంటే బ్లీచింగ్ ఎక్కడ చల్లారో కూడా గ్రామ ప్రజలకు తెలియని పరిస్థితి. నిధులు గోల్‌మాల్‌పై చేతివాటం చూపిన పంచాయతీ కార్యదర్శి ప్రతాప్, సర్పంచ్‌పై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నిధుల డ్రా పై ఫిర్యాదు

మండలంలోని రుద్రవరం గ్రామంలో నేలటూరు డొంకకు రోడ్డు వేయకుండానే వేసినట్లు 2023 ఆగస్టు 4న ఎంబుక్‌లో రికార్డు చేసి రూ.లక్షా19వేల720ల నిధులను అక్రమంగా డ్రాచేయడంపై గ్రామస్థులు, కూకట్ల కాలనీవాసులు సోమవారం ఒంగోలు కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌లో ఫిర్యాదుచేశారు. అదేవిధంగా గ్రావెల్ రోడ్డును ఆనుకుని ఉన్న కూకట్ల కోటయ్య కాలనీలో అవసరం లేకపోయినా మట్టితోలి వాటికి 2000వేల ట్రిప్పులు తోలినట్లు రికార్డు చేశారని ఆఫిర్యాదు పేర్కొన్నారు. అలాగే జగనన్న కాలనీల్లో సైతం ఇవే అక్రమాలు జరిగాయని వీటిపై విచారణ జరిపి ప్రజలసొమ్మును అక్రమంగా దోచుకున్నవారిపై తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు ఆ ఫిర్యాదులో కోరారు.

జ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు



మాట్లాడుతున్న టూరిజం అధికారి బెన్హర్

ఒంగోలు(కల్చరల్),నవంబరు18(ఆంధ్రజ్యోతి): విజ్ఞానాన్ని సముపార్జించుకోవటానికి గ్రంథాలయాలు మంచి మార్గమని జిల్లా టూరిజం అధికారి కె.బెన్హర్ అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా సోమవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు గ్రంథాలయ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి అధ్యక్షత వహించారు. అనంతరం బెన్హర్ ప్రసంగిస్తూ గ్రంథాలయంలో లభ్యమయ్యే పుస్తకాలను చదవటం ద్వారా విద్యార్థులు మంచి భవిష్యత్ ఏర్పరుచుకోవచ్చన్నారు. వయోజన విద్య డీడీ పి.వెంకటేశ్వర రావు మాట్లాడుతూ పుస్తకాలు చదవటం వల్ల పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చవచ్చని అన్నారు. విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య మాట్లాడుతూ పేద విద్యార్థులకు తన సొంత నిధులతో గ్రంథాలయ సభ్యత్వాన్ని సమకూరుస్తానని, ప్రతి విద్యార్థి ఇష్టంగా చదువుకుని ఉన్నత స్థానానికి ఎదగాలని అన్నారు. సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి మాట్లాడుతూ గ్రంథాలయ పురోభివృద్ధికి ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యాలు, తల్లిదండ్రులు, దాతల సహకారాన్ని అందజేయాలని అన్నారు. డిప్యూటీ లైబ్రేరియన్ సంపూర్ణ కాళహస్తి మాట్లాడుతూ విద్యార్థులలో వివిధ అంశాలపట్ల అవగాహన, పోటీతత్వం పెంపొందించి వారిని గ్రంథాలయాల పట్ల ఆకర్షితులను చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డ్రామా, స్కిట్స్ పోటీలు నిర్వహించగా పీవీఆర్ బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయినులు పి.కుసుమ, పార్వతి బాయి పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. పెద్దసంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కిడ్నాప్‌నకు పాల్పడిన వ్యక్తులు అరెస్ట్



వివరాలను వెల్లడిస్తున్న చీరాల డీఎస్పీ మహమ్మద్ మొయిన్

చినగంజాం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కిడ్నాప్‌నకు పాల్పడిన వ్యక్తులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు చీరాల డీఎస్పీ మహ్మద్ మొయిన్ తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని మున్నంవారిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని బేతాళవారిపాలెం గ్రామానికి పిల్లి వెంకట కృష్ణారావు, హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ రియాజ్ ఫేస్‌బుక్ ద్వారా పరిచయం ఏర్పడి ఇద్దరూ ఫారెక్స్ నందు ఆన్‌లైన్ ట్రేడింగ్ చేస్తుంటారని తెలిపారు. ఇద్దరు అకౌంట్‌లోని లావాదేవీలను ఒకరినొకరు చూసుకుంటూ మార్కెట్ ఒడిదొడుకులు గురించి మట్లాడుకుంటూ ఉంటారని తెలిపారు. రియాజ్ తన అకౌంట్‌లోని సుమారు రూ.30లక్షల విలువల గల డాలర్ల లావాదేవీలను వెంకటకృష్ణారావు అకౌంట్‌లోనికి మార్చుకున్నారని, ఈ విషయం గురించి రియాజ్ వెంకటకృష్ణారావుని పలుమార్లు అడిగినా ఎలాంటి సమాధానం ఇవ్వకపోవడంతో, తన స్నేహితుడు ఆనందకుమార్‌కు చెప్పగా అతను తన స్నేహితులతో కలిసి వెంకటకృష్ణారావు గ్రామానికి వెళ్లి మాట్లాడి వస్తానని చెప్పి ఈ నెల 16వ తేదీ రాత్రి 11గంటల సమయంలో రెండు కార్లలో హైదరాబాద్ నుంచి బయలుదేరినట్లు తెలిపారు. ఈ నెల 17న ఉదయం 6గంటలకు రెండు కార్లలో వారు బేతాళవారిపాలెం గ్రామంలోని వెంకటకృష్ణారావు ఇంటికి వచ్చి రియాజ్ పంపించాడని, అతనికి రావాలసిన డబ్బులు ఇవ్వమని భయపెట్టి, బలవంతంగా అతని ల్యాప్‌టాప్, సెల్‌ఫోను తీసుకొని, వారి కారులో ఎక్కించుకొని జాతీయరహదారి వైపు వెళ్లినట్లు తెలిపారు. కృష్ణారావు వరసకు బావమరిది అయిన బెజ్జం హరికృష్ణ చినగంజాం పోలీసుస్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి చీరాల డీఎస్పీ పర్యవేక్షణలో ఇంకొల్లు సీఐ వైవీ రమణయ్య, ఎస్ఐ శీలం రమేష్, ఏఎస్ఐ జి.శ్రీనివాసరావు, కానిస్టేబుల్ డి.శ్రీనివాసరావు టీమ్‌గా ఏర్పడి చినగంజాం టోల్‌ప్లాజ్ వద్ద కార్ల వివరాలను తెలుసుకున్నట్లు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానంతో కేసు దర్యాప్తు ప్రారంభించిన కొద్ది గంటలకే నిందితులు తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా బోడుప్పల్‌కు చెందిన గుర్రంఆనందకుమార్, కరణ్కోటి కల్కి, నాగం నరేందర్, శ్రీపాద కిరణ్‌కుమార్, రంగారెడ్డి జిల్లా ఉప్పల్‌కు చెందిన బొల్లారం ఉమేష్‌రెడ్డి, జేడ్డీజీ సాయికుమార్‌ను చినగంజాం టోల్‌ప్లాజా వద్ద ఆదివారం అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారి నుంచి రెండు కార్లను సీజ్ చేసి ల్యాప్‌టాప్, స్మార్ట్ ఫోనును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రియాజ్‌ను కూడా అదుపులోనికి తీసుకొని విచారించనున్నట్లు తెలిపారు. వెంకటకృష్ణారావు కార్యకలాపాలను పరిశీలిస్తామని, పెట్టుబడులు ఉద్దేశపూర్వకంగా పెట్టిస్తున్నాడా, ఎవరినైనా మోసం చేస్తున్నాడా విషయాలపై ఆరా తీస్తామని తెలిపారు. చీరాల డీఎస్పీ మహమ్మద్ మొయిన్, ఇంకొల్లు సీఐ రమణయ్య, చినగంజాం ఎస్ఐ రమేష్, ఏఎస్ఐ జి.శ్రీనివాసరావు కానిస్టేబుల్ శ్రీనివాసరావు, హోం గార్డు నాగరాజును ఎస్పీ తుషార్ డూడీ అభినందించారు.

వైభవంగా కార్తీక సోమవారం పూజలు

పెద్ద సంఖ్యలో సముద్రస్నానాలు

చీరాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వాడరేవు, రామాపురం, పొట్టిసుబ్బయ్యపాలెం సముద్రతీరంలో కార్తీక సోమవారం సందర్భంగా భక్తులు పెద్దసంఖ్యలో సముద్ర స్నానాలు ఆచరించారు. ఆయా ప్రాంతాల్లో భక్తులకు, పర్యాటకులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తగిన ఏర్పాట్లు చేశారు.



సముద్రస్నానాలు చేస్తున్నభక్తులు

అద్దంకి : కార్తీక 3వ సోమవారం సందర్భంగా శివాలయాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పూజలు నిర్వహించారు. మండలంలోని మణికేశ్వరంలో మల్లేశ్వరస్వామి దేవాలయంలో భక్తులు గుండ్లకమ్మ నదిలో కార్తీక స్నానాలు ఆచరించి కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం స్వామిని దర్శించుకున్నారు. పట్టణంలోని పాత శివాలయం, వేయి స్తంభాల గుడి, కమలేశ్వరాలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో పూజలు నిర్వహించారు.



మణికేశ్వరం మల్లేశ్వరస్వామి దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఆఫీస్‌లో అంతర్యుద్ధం

అద్దంకి మండల అభివృద్ధి అధికారి ఆదేశాలను డోంట్ కేర్ అంటున్న అవుట్‌సోర్సింగ్ సిబ్బంది

- వారికి ఒత్తాసుగా నిలుస్తున్న పంచాయతీ కార్యదర్శులు
- అభివృద్ధి పనుల విషయంలో ఎంపీడీవో ముక్కుసూటితనమే కారణమా?



అద్దంకి ఎంపీడీవో కార్యాలయం

అద్దంకి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి ఎంపీడీవో కార్యాలయంలో వార్ నడుస్తోంది. మండల అధికారి ఆదేశాలను డోంట్ కేర్ అన్న విధంగా అవుట్ సోర్సింగ్ సిబ్బంది వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తుండగా, కార్యాలయ పనివేళలలోనే కాకుండా అదనపు సమయంలో కూడా విధులు నిర్వహించాలని ఎంపీడీవో ఒత్తిడి తెస్తున్నారని అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఆరోపిస్తూ అధికారపార్టీ నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అద్దంకి ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న సింగయ్యకు కార్యాలయంలో పనిచేసే అవుట్ సోర్సింగ్ సిబ్బంది(కంప్యూటర్ ఆపరేటర్లు)కి మధ్య పొసగడంలేదు. విధులకు సకాలంలో హాజరుకావాలని, అత్యవసరమైన పనులను వెంటనే పూర్తి చేయాలని ఆపరేటర్లను ఆదేశిస్తుంటే విధులు సక్రమంగా నిర్వహించకుండా జాగు చేస్తున్నారని ఎంపీడీవో వ్యాఖ్యానిస్తున్నారు. అధికారుల ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరించాల్సిన అవుట్ సోర్సింగ్ సిబ్బంది తమ కనుసన్నల్లోనే అధికారులు నడవాలి అన్న విధంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. తాము లోకల్ కాబట్టి తాము చెప్పిందే వేదమన్నట్లుగా సిబ్బంది వ్యవహార తీరు సాగుతోందని వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి.



రెండు వర్గాలుగా విడిపోయిన సిబ్బంది

ఎంపీడీవో సింగయ్య ముక్కుసూటితత్వంగా ఉండడం, పంచాయతీ నిధులు వినియోగానికి సంబంధించి బిల్లులు చూసేది అవుట్ సోర్సింగ్ సిబ్బందే కావడంతో పంచాయతీల కార్యదర్శులు పలువురు అవుట్ సోర్సింగ్ సిబ్బందికి ఒత్తాసుగా నిలుస్తుండడంతో వ్యవహారం ముదురుపాకాన పడినట్లు తెలుస్తోంది. దీంతో కార్యాలయ సిబ్బంది కూడా రెండు వర్గాలుగా విడిపోయి మరింత ఆద్యం పోస్తున్నట్లు సమాచారం. ఈ విషయాలను ఎవరికి వారే టీడీపీ నేతల ద్వారా మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకుపోయేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితి కొనసాగితే మండలంలో జరిగే అభివృద్ధి పనులకు ఆటంకం కలగడంతో పాటు పరువు బజారున పడే అవకాశం లేకపోలేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చొరవతీసుకొని సమస్యకు ఫుల్‌స్టాప్ పెట్టాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో సింగయ్యను వివరణ కోరగా కంప్యూటర్ ఆపరేటర్లుగా ఉన్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది విధులకు సక్రమంగా రాకపోతుండడంతో ఇప్పటికే పలుమార్లు చెప్పానన్నారు.

అవీఇవీ

26లోపు పది పరీక్ష ఫీజు చెల్లించాలి

ఒంగోలు విద్య, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వచ్చే ఏడాది మార్చి, ఏప్రిల్ నెలలో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫీజును ఈనెల 26వతేదీలోపు ఎలాటి అపరాధరుసుం లేకుండా చెల్లించవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 50 అపరాధ రుసుంతో వచ్చేనెల 2వతేదీ వరకు, రూ. 200 అపరాధ రుసుంతో వచ్చేనెల 9వతేదీ వరకు,రూ. 500 అపరాధరుసుంతో వచ్చే నెల 16వతేదీలోపుచెల్లించాలన్నారు. రెగ్యులర్ విద్యార్థులు రూ. 125, మూడు సబ్జెక్టులకు పైగా ఉంటే రూ. 125, మూడు సబ్జెక్టుల లోపు ఉంటే రూ.110, ఒకేషనల్ విద్యార్థులు అదనంగా రూ. 60, వయస్సు మినహాయింపు కోసం రూ. 300 చెల్లించాలన్నారు. మైగ్రేషన్ సర్టిఫికెట్ అవసరమైన విద్యార్థులు రూ. 80 సీఎఫ్ఎంఎస్ చలానా ద్వారా మాత్రమే చెల్లించాలని ఆయన కోరారు.

నేడు, రేపు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

ఒంగోలు విద్య, నవంబరు 18 : జిల్లాలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి నవంబరు నెల స్కూలు కాంప్లెక్స్ సమావేశాలు మంగళ, బుధవారాల్లో నిర్దేశించిన స్కూలు కాంప్లెక్స్ కేంద్రాల్లో జరుగుతాయని జిల్లా విద్యాశాఖాధికారి ఎ. కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం కాంప్లెక్స్ పరిధిలోని 50 శాతం మంది ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, తెలుగు, మ్యాథ్స్, బయాలజీ టీచర్లు, నియోజకవర్గ స్థాయిలో పీఈటీ/పీడీలకు స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరుగుతుందన్నారు. బుధవారం మిగిలిన 50శాతం ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, హిందీ,ఇంగ్లీషు, పీఎస్, సోషల్ సబ్జెక్టు వారు హాజరు కావాలన్నారు. ఉదయం 9నుంచి సాయంత్రం 4.20 వరకు ఈ సమావేశాలు జరుగుతాయన్నారు. అజెండా ప్రకారం సమావేశాలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

విద్యార్థులను మలిచే బాధ్యత గురువులదే

ఒంగోలు విద్య నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థిలో కొంత ప్రతిభ దాగి ఉంటుందని, దానిని వెలికి తీసి సరైన మార్గంలో నడపాల్సిన బాధ్యత గురువులదని జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ అన్నారు. స్థానిక బండ్లమిట్టలోని బాలికోన్నత పాఠశాలలో ప్రారంభమైన కెరీర్ ఎడ్యుకేషన్ 8వ తరగతి శిక్షణలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థి ఒక శిలలాంటి వారని, వారిలో దాగి ఉన్న నైపుణ్యాన్ని బయటకు తీసి గొప్ప శిల్పంగా మార్చాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో రమేష్, కెరీర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం సీఈవో రాక్వెల్ షరాఫ్, పాఠశాల హెచ్ఎం కృష్ణకుమారి, అనూష తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల చాంపియన్‌గా కడప

- రన్నరప్‌గా నిలిచిన తూర్పుగోదావరి జట్టు



రన్నరప్ నిలిచిన తూర్పు గోదావరి జిల్లా క్రీడాకారులు

కందుకూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బాలబాలికల తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలో కడప జిల్లా క్రీడాకారులు ప్రథమ స్థానం, రన్నరప్‌గా తూర్పు గోదావరి జిల్లా క్రీడాకారులు దక్కించుకున్నారు. తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి షేక్ అబ్దుల్ సలాం ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలకు వివిధ జిల్లాల నుంచి 350మందికి పైగా వచ్చారు. పోటీలు ఆసక్తికరంగా జరిగాయి. పోటీల అనంతరం ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన బహుమతి ప్రదానోత్సవానికి కందుకూరు సీఐ వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం అబ్దుల్‌సలాం మాట్లాడుతూ ఈ పోటీలో గెలుపొందిన క్రీడాకారులు ఈ నెల 28 నుంచి డిసెంబరు 2వరకు హర్యానాలో జరుగనున్న జాతీయస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి యల్‌టీ చంద్రమౌళి, జిల్లా అధ్యక్షుడు ఉన్నం వీరాస్వామి, కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య, టెక్నికల్ డైరెక్టర్ విజయ్‌శ్రీనివాస్, బీఆర్ ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల ఛైర్మన్ ఉన్నం భాస్కరరావు, గోనుగుంట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తైక్వాండోలో సత్తా

సిల్వర్ మెడల్ సాధించిన సత్యం హైస్కూల్ విద్యార్థిని



జననిని అభినందిస్తున్న హైస్కూల్ కరస్పాండెంట్ హరనాథ్‌బాబు, హెచ్ఎం

చినగంజాం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కందుకూరులోని ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలలో సత్యం హైస్కూల్ విద్యార్థిని ఎం.జనని సిల్వర్ మెడల్ సాధించింది. ప్రకాశం జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15, 16, 17 తేదీలలో జరిగిన 38వ సబ్ జూనియర్ క్యోరోగి, 13వ పూమ్సే బాలబాలికల తైక్వాండో రాష్ట్ర చాంపియన్‌షిప్-2024 పోటీలలో 24 కేజీల విభాగంలో జనని సిల్వర్ మెడల్ సాధించినట్లు కోచ్ వాటుపల్లి సుబ్రహ్మణ్యం తెలిపారు. హైస్కూల్‌లో సోమవారం జరిగిన అభినందన సభలో సిల్వర్ మెడల్ సాధించిన జననిని కరస్పాండెంట్ ఎన్.హరనాథ్ బాబు, హెచ్ఎం ఆర్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, కోచ్‌లు సుబ్రహ్మణ్యం, షేక్ సుల్తాన్‌బాషా, విద్యార్థులు అభినందించారు.

అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తి అరెస్టు

పామూరు, నవంబరు 18, (ఆంధ్రజ్యోతి) సోషల్ మీడియాలో ముఖ్యమంత్రి, మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ పోస్టులు పెట్టిన వ్యక్తిని పామూరు పోలీసులు అరెస్టు చేసి సోమవారం కోర్టులో హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధించారు. ఎస్ఐ కిశోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గం మల్కిపురం గ్రామానికి చెందిన నేతల నానిబాబు సోషల్ మీడియాలో ముఖ్యమంత్రి చంద్రబాబు, సతీమణి భువనేశ్వరి, నారా లోకేష్‌పై అసభ్యకరమైన పోస్టులు పెట్టాడు. వీటిపై ఈనెల 14న పామూరు టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు మోషే పోలీసులకు ఫిర్యాదుచేశారు. 162/2024 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. సీఐ భీమానాయక్ ఆదేశాలతో ఎస్ఐ దర్యాప్తు చేపట్టారు. రాజోలులోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో సంచరిస్తున్న నేతల నానిబాబును ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం అతనిని కనిగిరి జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో సోమవారం హాజరుపర్చారు. జూనియర్ సివిల్ న్యాయాధికారి భరత్ చంద్ర 14 రోజుల రిమాండ్ విధించినట్టు ఎస్ఐ తెలిపారు.

కలగా మిగిలిన అలుగుపై వంతెన నిర్మాణం

పంగులూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండమూరు గ్రామ సాగు నీటి చెరువు అలుగుపై వంతెన నిర్మాణం కలగానే మిగిలింది. దీర్ఘకాలంగా చెరువు అలుగుపై వంతెన నిర్మించాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు. గ్రామానికి కూత వేటు దూరంలో ఉన్న ఇంకొల్లు, అద్దంకి ప్రధాన రహదారికి ఉత్తరం వైపున కొండమూరు వాసుల పంట పొలాలున్నాయి. రైతులు తమ పంట పొలాలకు వెళ్లేందుకు నిత్యం ఈ అలుగు దాటాల్సిన పరిస్థితి. రైతులు చెరువు నీటిని పంట సాగుకు వినియోగిస్తారు. వర్షాలు అధికంగా కురిసిన సందర్భంలో అలుగు నీటి ప్రవాహం అధికంగా ఉండి రాకపోకలు సాగించ లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీటి ప్రవాహం అధికంగా ఉన్న సమయంలో అలుగు దాటే ప్రయత్నంలో కొందరు ప్రాణాలు పోగొట్టుకున్నారు. నిత్యం పశువులు తోలుకుని పొలాలకు చేరుకునే పశు కాపరులు, పొలం పనుల నిమిత్తం రాకపోకలు సాగించే రైతులు, వ్యవసాయ కూలీలు అలుగు నీటిని దాటి వెళ్లడం కష్టంగా ఉందని ఆందోళన చెందుతున్నారు. గ్రామస్థులు ఇతర ప్రాంతాలకు ప్రయాణం సాగించేందుకు ఆర్టీసీ బస్సు ఎక్కేందుకు కూత వేటు దూరంలో ఉన్న ఇంకొల్లు, అద్దంకి ఆర్అండ్‌బీ రహదారిని ఆశ్రయిస్తుంటారు. అలుగుపై వంతెన నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



అరటి అ'ధర'హో..!

● గెల రూ.300 ● కంభం చెరువు కింద 500 ఎకరాల్లో సాగు ● ఇతర ప్రాంతాలకు ఎగుమతులు

కంభం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : అరటి అంటే మనకు గుర్తుకు వచ్చేది మహానంది, నంద్యాల, తదితర ప్రాంతాలే. అయితే గత 10 సంవత్సరాల నుంచి కంభం మండలంలో అరటిసాగు ఊపందుకుంది. ఈ ఏడాది ధర కూడా ఆశాజనకంగా ఉంది. గతేడాది గెల రూ.100 ఉంటే ఈ ఏడాది రూ.300 పలుకుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కంభం చెరువు కింద 500 ఎకరాలకుపైగా అరటి సాగు చేశారు. సంప్రదాయ పంటలు ఆశించిన స్థాయిలో గిట్టుబాటు కాకపోవడంతో రైతులు కాస్త విభిన్నంగా ఆలోచించి బోర్ల ద్వారా ఉద్యానవన పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. అరటిసాగు ఎకరాకు రూ.80 నుంచి రూ.90 వేలు ఖర్చు అయినా రూ.1.50 లక్షల వరకు మిగులుతున్నాయని రైతులు చెబుతున్నారు.

పెరుగుతున్న ఎగుమతులు

ప్రస్తుతం పసుపుపచ్చ, సుగంధాల అరటికి ఈ ప్రాంతం నిలయంగా మారుతోంది. కంభం చెరువులో నీరు లేకపోయినా బోర్ల కింద సాగు చేస్తున్నారు. అడవి పందుల బెడదకు చెరకుపంటను నిలిపివేసిన రైతులు అరటిపంట వైపే మొగ్గు చూపుతున్నారు. కంభం ఉద్యానవనశాఖ పరిధిలో బేస్తవారపేట, అర్ధవీడు, కంభం మండలంలో అధికంగా చిన్నకంభం, కంభం, పోరుమామిళ్లపల్లి, హెచ్‌గూడెం, దర్గ పంచాయతీల్లో రైతులు అరటి పండిస్తున్నారు. పిలకలు నాటినప్పటి నుంచి 9 నెలల్లో ఒక్కో అరటిచెట్టుకు ఒక్కో గెల కాసింది. 120 నుంచి 150కిపైగా కాయలు కాస్తాయి. ఈ అరటితోటలకు ఎప్పుడూ నీటితేమ ఉండాలి. అరటి గెలలను కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. బెంగుళూరు, హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, నర్సరావుపేట, మార్కాపురం, తదితర ప్రాంతాలకు లారీల ద్వారా తరలిస్తుంటారు. గత ఏడాది గెల రూ.50 నుంచి రూ.100 పలుకగా ప్రస్తుతం గెల రూ.300 నుంచి రూ.350 పలుకుతుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఎగుమతులకు సిద్ధం చేసిన గెలలతో రైతు చేపూరి సోమయ్య



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారీయా

బాలల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలి

● కలెక్టర్ అన్సారియా ● చదలవాడలో 'బంగారు బాల్యం'కు శ్రీకారం

నాగులుప్పలపాడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : బాలల భవిష్యత్‌కు అధికారులు బంగారు బాటలు వేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారీయా సూచించారు. బంగారు బాల్యం వారోత్సవాల సందర్భంగా చదలవాడలో సోమవారం నిర్వహించిన గ్రామసభలో కలెక్టర్ తమీమ్ పాల్గొన్నారు. సభకు పంచాయతీ కార్యదర్శి ఇమ్రాన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఉన్నతంగా ఎదగాలన్నారు. విద్యార్థి దశ నుంచే బాలికలు మానసికంగా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని, విద్యతోనే తగిన గుర్తింపు లభిస్తుందని అన్నారు. గ్రామాల్లో వివిధ కారణాలతో చదువుకు దూరమైన విద్యార్థులను గుర్తించి బడికి వెళ్లేలా అధికారులు తగిన చర్యలు చేపట్టాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై విస్తృతంగా బాలికలకు అవగాహన పెంపొందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు .బాల్య వివాహాలపై గ్రామస్థాయిలోని ఆశా, అంగన్‌వాడీ వర్కర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాలికల అక్రమ రవాణాను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నెలలో మొదటి శుక్రవారం బంగారు బాల్యానికి ఎంపిక చేసిన అధికారులు ఆయా గ్రామాల్లో గ్రామసభ ఏర్పాటు చేసి బాలలకు కల్పించిన చట్టాలు, హక్కులను వివరించాలన్నారు. అనంతరం అధికారులతో బంగారు బాల్యంపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీవో లక్ష్మీ ప్రసన్న, మండల ప్రత్యేకాధికారి బేబిరాణి, పశుక్షేత్ర డీడీ రవికుమార్, ఐసీడీఎస్ పీడీ మాధురి, ఎంపీడీవో వై.మహాలక్ష్మి, తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాలలు పాఠశాలలకే పరిమితం కావాలి



కరవదిలో కార్యక్రమంలో మాట్లాడుతున్న జేసీ రోణంకి గోపాలకృష్ణ

ఒంగోలు (రూరల్) : బాలలు పాఠశాలలకే పరిమితం కావాలని జేసీ రోణంకి గోపాలకృష్ణ అన్నారు. ఒంగోలు మండలం కరవది గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం బాలల బంగారు భవిష్యత్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జేసీ మాట్లాడుతూ బడి బయట ఏ ఒక్క విద్యార్థి ఉండకూడదన్నారు. బంగారు బాల్యం గురించి గ్రామంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు నగర కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, ఎంపీడీవో యు.శేషుబాబు, తహసీల్దార్ ఎం.వాసు, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వాణి, పంచాయతీ సర్పంచ్ దేవరపల్లి కోటేశ్వరరావు, కార్యదర్శి పూర్ణ చంద్రరావు, జడ్పీఉన్నత పాఠశాల హెచ్‌ఎం రవికుమార్ గ్రామస్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండవవారిపాలెం గ్రామంలో జరిగిన బంగారు బాల్యం కార్యక్రమంలో ఒంగోలు నగర కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, ఎంపీడీవో యు.శేషబాబు,తహసీల్దార్ ఎం.వాసు, ఈవోఆర్డీ ఎ.బాలచెన్నయ్య, గ్రామసర్పంచ్ మండవ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

బాల్యంలోనే భవిష్యత్‌కు పునాది : డీఈవో

సింగరాయకొండ : ప్రతి విద్యార్థికి బాల్యం ఓ మధురానుభూతి అని, ఆ దశలోనే బంగారు భవిష్యత్‌కు పునాది పడుతుందని డీఈవో కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని మూలగుంటపాడు పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన బంగారు బాల్యం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. కీలకమైన బాల్య దశను కాపాడాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందన్నారు. బాలల హక్కులు, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్, చిన్నపిల్లల అక్రమ రవాణా, బాల్యవివాహాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవి, ఎంపీడీవో జయమణి, ఎంఈవోలు కె.శ్రీనివాసులు, ఎ.శ్రీనివాసరావు, మండల ప్రత్యేకాధికారి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. మూలగుంటపాడు పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో బంగారు బాల్యంపై గ్రామసభ నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ ముస్తాక్, పంచాయతీ కార్యదర్శి కొప్పోలు రామారావు తదితరులు హాజరయ్యారు.

బాల్యం ప్రతి ఒక్కరికీ మధురానుభూతి

సంతనూతలపాడు : బాల్యం అనేది ప్రతి ఒక్కరికీ మధురానుభూతి అని జడ్పీసీఈవో చిరంజీవి అన్నారు. స్థానిక జడ్పీహైస్కూల్లో సోమవారం జరిగిన బంగారు బాల్యం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చిన్నారులకు పునాది పడేది బాల్యంలోనే, ఇంతటి ప్రాధాన్యమున్న బాల్యాన్ని నేటి చిన్నారులు ఆస్వాదించలేకపోతున్నారన్నారు. బాల్యవివాహాలు, బాలకార్మికులు, బాలల అక్రమరవాణా లేని జిల్లాగా తయారు చేయాలనేది బంగారు బాల్యం కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతరం విద్యార్థులకు వక్తృత్వం, వ్యాసరచన, పెయింటింగ్, లోగో డిజైనింగ్, స్లోగన్ రైటింగ్ తదితర పోటీలను నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్‌బాబు, ఎంఈవో వెంకారెడ్డి, హెచ్‌ఎం ప్రమోద, జడ్పీటీసీ డి.రమణమ్మ, తహసీల్దార్ ఆదిలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్వామా ఏవో బాపట్లకు డీఎల్‌డీవోగా బదిలీ

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లానీటి యాజమాన్యసంస్థ (డ్వామా) అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సీహెచ్ విజయలక్ష్మిని బాపట్ల జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరి శశికాంత్ భూషణ్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. బాపట్ల జిల్లా డీఎల్‌డీవోగా విజయలక్ష్మిని నియమించారు. రాష్ట్రవ్యాప్తంగా 18 మంది అధికారులను బదిలీ చేయగా వారిలో విజయలక్ష్మి ఉన్నారు.

● రహదారుల్లో కనిపించని వైనం
● ఒక రూట్‌కు బదులు ఇంకోవైపు ప్రయాణం
● వాహనదారుల ఇబ్బందులు
● పట్టించుకోని అధికారులు



సూచిక బోర్డులేని టంగుటూరు-పొదిలి రహదారి

సూచిక బోర్డులు లేక.. తికమక!

మద్దిపాడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు రహదారుల్లో సూచిక బోర్డులు లేక వాహన చోదకులు తికమకపడుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళ ప్రయాణంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన రోడ్లకు సంబంధించిన కూడళ్లలో సైతం ఇదే పరిస్థితి ఉండటంతో ఒకవైపునకు బదులు ఇంకో మార్గంలో వెళ్తున్నారు. అధికారుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమైంది. పొదిలి-ఒంగోలు మధ్యలో టంగుటూరు వెళ్లే రహదారి అనుసంధానమవుతుంది. ఈ రెండు రోడ్లు కలిసేచోట సూచిక బోర్డు లేదు. దీంతో దారి తెలియక ప్రయాణికులు అయోమయానికి గురవుతున్నారు. శివరాయునిపేటకు ఒకవైపు వల్లాయపాలెం, మరోవైపు చిమట, ఇంకోవైపు కాకర్ల గ్రామాలు ఉన్నాయి. ఏ గ్రామానికి ఎటువైపు వెళ్లాలో తెలిపే బోర్డులు లేకపోవడం ఇబ్బందిగా మారింది. కూచిపూడి వద్ద గార్లపేటకు వెళ్లే రహదారికి బోర్డు లేకపోవడంతో వాహనదారులు జువ్విగుంట దారిలో ప్రయాణించి ఇబ్బందులు పడుతున్నారు. జువ్విగుంట వద్ద తంగెళ్ల రహదారికి వెళ్లేందుకు బోర్డును ఏర్పాటు చేయలేదు. గార్లపేటలో తాళ్లూరు, మద్దిపాడు గ్రామాలకు రూట్‌ను తెలియజేసే సూచిక బోర్డులు లేవు. చిలంకూరు వద్ద ఒకవైపు ఏలూరు, మరోవైపు కాకర్లకు వెళ్లే రహదారులు ఉన్నాయి. సూచిక బోర్డులు లేక కాకర్ల వైపు వెళ్లాల్సిన ప్రయాణికులు ఏలూరు వైపు కొద్ది దూరం ప్రయాణించి వెనక్కి రావాల్సి వస్తోంది. అంకెపల్లి, విజయలక్ష్మీపేట, చిమట గ్రామాలకు వెళ్లే రహదారుల వద్ద కూడా సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు ఆయా గ్రామాలకు మార్గం చూపే సూచక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చిన్నారులకు కన్నీటి వీడ్కోలు

● కొప్పోలు ప్రమాద మృతులకు ముగిసిన అంత్యక్రియలు
● బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఇవ్వాలని దళిత సంఘాల డిమాండ్

ఒంగోలు(క్రైం), నవంబరు18 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కొప్పోలు అంబేడ్కర్ నగర్‌కు చెందిన రేష్మంత్, వికాస్, విశాల్‌లకు సోమవారం కన్నీటి వీడ్కోలు పలికారు. రిమ్స్‌లో పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కొప్పోలులోని శ్మశానవాటికకు తరలించారు. అంతకుముందు మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని ప్రకాశం భవన్ వద్ద కుటుంబసభ్యులు, దళిత సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా డీఆర్వో ఓబులేష్ మృతుల కుటుంబాలు, దళిత నాయకులతో చర్చించారు. మృతుల కుటుంబాలకు రూ.పదిలక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, వికాస్, విశాల్ తల్లి బాలకోటేశ్వరికి ఉద్యోగం ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఆయా డిమాండ్‌లు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని డీఆర్వో వారికి హామీ ఇచ్చారు. దీంతో అక్కడ నుంచి కొప్పోలు శ్మశాన వాటికకు మృతదేహాలను తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గురు బాలుర ఫొటోలతో 'ఉయ్ మిస్ యూ' అంటూ ప్లకార్డులు చేబూని యువకులు వీడ్కోలు పలికారు. ఈ ర్యాలీలో పెద్దసంఖ్యలో మృతుల బంధువులు పాల్గొన్నారు.



మృతదేహాలతో దళిత సంఘాల నేతలు

● బాధిత కుటుంబాలకు ఎస్పీ పరామర్శ

రిమ్స్ వద్ద పోస్టుమార్టం నిర్వహిస్తుండగా బాధిత కుటుంబాలతో ఎస్పీ ఏఆర్ దామోదర్, ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఎస్పీ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని హితవు పలికారు. మైనర్లు సరదా కోసం వాహనాలు నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారని అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ప్రమాదంపై సమగ్ర విచారణ చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎస్పీ డీఎస్పీ రాఘవేంద్రరావు, తాలుకా సీఐ అజయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

జీజీహెచ్‌లో వైద్య పరీక్షల కోసం నిరీక్షణ

గంటల తరబడి ఎదురుచూపులు

ఒంగోలు, కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి) : వివిధ రకాల వ్యాధులతో బాధపడుతూ ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)కి వచ్చే వారికి వైద్య పరీక్షల కోసం నిరీక్షణ తప్పడం లేదు. ఆరోగ్యం బాగులేక వైద్యం కోసం వస్తున్న రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. అందుకు అనుగుణంగా పూర్తిస్థాయిలో వైద్యులు లేకపోవడం, అవసరమైన వైద్య పరీక్షలకు పరికరాలు ఉన్నా ఉపయోగం లేకపోవడంతో పేదల ఆరోగ్యానికి భరోసా లభించడం లేదు. సోమవారం ఒంగోలులోని రిమ్స్‌లో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు ఓపీ వద్ద భారీగా రోగులు బారులు తీరి ఉండటం కనిపించింది. ఇదంతా పూర్తి చేసుకుని వైద్య పరీక్షల కోసం వెళితే రోగులు అక్కడ ఎదురుచూడటం కనిపించింది. పూర్తిస్థాయిలో వైద్యులు, పరీక్షలు చేసేందుకు సరిపడా టెక్నికల్ సిబ్బంది లేకపోవడంతో రోగులు నానా అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా రక్తపరీక్షలు, ఎక్స్‌రే, స్కానింగ్, ఎంఆర్ఐ స్కానింగ్, సిటీ స్కాన్ వంటి వైద్య పరీక్షల కోసం గంటల తరబడి నిలువుకాళ్లపై నిలబడాల్సిన పరిస్థితి రిమ్స్‌లో ఉంది.



నాసర్ మహమ్మద్ సమాధి



నూతనంగా రంగులు వేసిన మఠం

నాసరయ్య ఉరుసు మహోత్సవాలకు సర్వం సిద్ధం

త్రిపురాంతకం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : త్రిపురాంతకంలోని నాసరయ్య పెద్దమఠంలో ఈ నెల 19 నుంచి 21 వరకు ఉరుసు మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. 19న ఉదయం ఉరుసుగంధం, ఊరేగింపు, 20న కనుమ, 21న గురుపూజ మహోత్సవ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. ఈ సందర్భంగా 19వ తేదీ రాత్రి పౌరాణిక, జానపద నాటకాలు ప్రదర్శిస్తారన్నారు. ఉరుసు మహోత్సవాలకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి, ఇతర జిల్లాల నుంచి వచ్చే భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపడతామని, ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా మఠానికి నూతనంగా రంగులు వేసి ఉత్సవాలకు సిద్ధం చేశారు.



తుమ్మలచెరువు వెళ్లేరహదారి దుస్థితి

తుమ్మలచెరువు రోడ్డుకు మోక్షమెప్పుడో.!

తర్లుపాడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తుమ్మలచెరువు రోడ్డుకు మోక్షమెప్పుడు కలుగుతుందోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు. 9 ఏళ్లుగా ఈ రోడ్డుకు మరమ్మతులు కూడా చేయకపోవటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తుమ్మలచెరువు నుంచి కలుజువ్వలపాడు రోడ్డు కూడా అధ్వానంగా ఉంది. రెండేళ్ల క్రితం నామమాత్రం అక్కడక్కడా ప్యాచింగ్ వర్క్ చేసి వదిలేశారు. ప్రస్తుతం ఆ రోడ్డు మోకాళ్ల లోతు గుంతలతో దర్శనమిస్తోంది. ఈ రోడ్లపై నిత్యం వివిధ పనుల నిమిత్తం ప్రయాణికులు తర్లుపాడు వస్తారు. రోడ్డు గుంతలమయంగా ఉండటంతో ద్విచక్ర వాహనదారులకు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్లపై ఆటోలు కూడా ప్రయాణించలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తర్లుపాడు- తుమ్మలచెరువు-కలుజ్వలపాడు రోడ్లకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అసెంబ్లీలో నేతల గళం

గిద్దలూరు వైద్యశాలను వంద పడకల ఆస్పత్రిగా మార్చాలి

● ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలను 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించారు. జిల్లాలోని అత్యంత వెనుకబడిన పశ్చిమ ప్రాంతంగా గిద్దలూరు నియోజకవర్గం ఉందన్నారు. 2014-19 నాటి టీడీపీ ప్రభుత్వ హయాంలో 50 పడకల ఆసుపత్రిగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేశారన్నారు. దీని కోసం నిధులు కూడా మంజూరు చేశారన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రివర్స్ పాలనతో ఆసుపత్రిలో నాశిరకంగా పనులు చేపట్టిందన్నారు. అప్పటి వరకు ఉన్న 50 పడకల ఆసుపత్రిని 40 పడకలకే పరిమితం చేసిందన్నారు. దీనిపై స్పందించిన ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ మాట్లాడుతూ గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలను 100 పడకల ఆసుపత్రిగా, కొమరోలులోని ప్రభుత్వ ఆసుపత్రిని 30 పడకల ఆసుపత్రిగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి సూచన మేరకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పలకల పరిశ్రమను ఆదుకోవాలి

● ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం, నవంబరు (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు 50 వేల మందికిపైగా ఉపాధి చూపిన మార్కాపురం పలకల పరిశ్రమ నేడు దైన్యస్థితిలో ఉందని ప్రభుత్వం ఆదుకోవాలని మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా సోమవారం ఆయన పలకల పరిశ్రమ సమస్య గురించి మాట్లాడారు. ప్రతి ఒక్కరు ఒకప్పుడు మార్కాపురం పలకపైనే అక్షరాలు దిద్దారని గుర్తు చేశారు. గతంలో 30 నుంచి 50 వేల మంది ఈ పరిశ్రమపై ఆధారపడేవారన్నారు. పశ్చిమ ప్రాంత ప్రజలకు ఎన్నో విపత్కర పరిస్థితుల్లో కూడా పలకల పరిశ్రమ ఉపాధి చూపిందన్నారు. కానీ నేడు పరిశ్రమ దీనస్థితికి చేరిందన్నారు. కేవలం రెండు నుంచి మూడు వేలమందికి మాత్రమే ఉపాధి చూపుతోందన్నారు. ఈ పరిశ్రమను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేసే విద్యాదీవెన కిట్లలో మార్కాపురం పలకను చేర్చాలన్నారు.

డిజైన్ స్లేట్‌పై జీఎస్టీని తగ్గించాలి

ఒకప్పుడు మార్కాపురం నుంచి డిజైన్ పలకలు ప్రపంచంలోని పలు దేశాలకు ఎగుమతి అయ్యేవన్నారు. దీని వలన విదేశీ ఎగుమతి సుంకం ద్వారా ప్రభుత్వాలకు కూడా ఆదాయం వచ్చేదన్నారు. కానీ ప్రభుత్వ పన్నులు పెరిగి వ్యాపార నిర్వహణ వ్యయం భారం కావడంతో ఎగుమతులు తగ్గాయన్నారు. డిజైన్ స్లేట్ వ్యాపారంపై ప్రస్తుతం 18 శాతం జీఎస్టీ విధిస్తున్నారన్నారు. అదే నాపరాయి పరిశ్రమకు 5 శాతం మాత్రమే జీఎస్టీ విధిస్తున్నారన్నారు. వెనుకబడిన పశ్చిమ ప్రాంత ప్రజల ఉపాధికి ఎంతో కీలకమైన డిజైన్ స్లేట్‌పై జీఎస్టీని 18 నుంచి 5 శాతంకు తగ్గించి ఆదుకోవాలన్నారు.

బ్లాస్టింగ్‌తో వికలాంగుడినయ్యా..

● న్యాయం చేసి ఆదుకోవాలని కలెక్టర్‌కు మొర


బ్లాస్టింగ్ వల్ల రాయి తగిలి చేయి తీసివేశారని సర్టిఫికెట్ చూపుతున్న కార్మికుడు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చీమకుర్తి మండలం ఆర్‌ఎల్‌పురం సమీపంలో ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఒక క్వారీలో బ్లాస్టింగ్ చేయడంతో తాను తీవ్రంగా గాయపడ్డానని, అయినా యాజమాన్యం ఇంతవరకు పట్టించుకోలేదని ఒంగోలులోని మారుతీనగర్‌కు చెందిన కత్తుల వెంకట ఆనంద్‌బాబు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. ఆర్‌ఎల్‌పురంలోని జయమినరల్ ఎక్స్‌పోర్ట్‌లో మైన్‌మేట్‌గా ఉద్యోగం చేస్తున్నానని తెలిపారు. అయితే సమీపంలోని క్వారీలో ఈ బ్లాస్టింగ్ చేయడం వల్ల ఒక బలమైన రాయి వచ్చి కుడిచేయి భాగానికి తగటడంతో తీవ్రంగా గాయపడ్డానని తెలిపారు. ఒంగోలులోని ఒక ప్రైవేటు వైద్యశాలలో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారన్నారు. అక్కడి నుంచి విజయవాడలోని మరో హాస్పటల్‌లో చేర్చారని తెలిపారు. అక్కడ వైద్యులు కుడిచేతిని పూర్తిగా తొలగించారన్నారు. ప్రభుత్వం కూడా దివ్యాంగుల సర్టిఫికెట్ ఇచ్చిందన్నారు. చీమకుర్తి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదై ఐదు నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. గత ఐదు నెలల నుంచి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, దీనిపై సమగ్ర విచారణ చేసి న్యాయం చేయాలని ఆయన కోరారు.

సంక్షిప్తంగా..

అమెజాన్‌కు శ్రీ హర్షిణి విద్యార్థి ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న చైర్మన్ రవికుమార్

ఒంగోలు విద్య, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అమెజాన్ కంపెనీలో జరిగిన ప్రాంగణ ఎంపికల్లో ఒంగోలులోని శ్రీ హర్షిణి డిగ్రీ కళాశాల విద్యార్థి ఏ. హరిహరకుమార్ రూ. 9 లక్షల ప్యాకేజీతో ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఉద్యోగం పొందిన విద్యార్థినిని అభినందించారు. కళాశాల సెక్రటరి అండ్ కరస్పాండెంట్ గోరంట్ల కవిత, డీన్ దాది ఆంజనేయులు, పీజీ కో ఆర్డినేటర్ శ్రీనివాసులురెడ్డి, క్యాంపస్ ఇన్‌చార్జి, అధ్యాపకులు ఉన్నారు.

పోలేరమ్మ ఆలయ హుండీ లెక్కింపు

జరుగుమల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కామేపల్లిలోని శ్రీపోలేరమ్మ తల్లి ఆలయ హుండీ ఆదాయాన్ని దేవదాయశాఖ అధికారులు సోమవారం లెక్కించారు. ఈ ఏడాది జూన్ 14 నుంచి సోమవారం వరకూ రూ.25.68లక్షల నగదు, 103.100 మిల్లీ గ్రాముల బంగారం, 1.668 కిలోల వెండి కానుకలుగా వచ్చాయని ఆలయ ఈవో బైరాగిచౌదరి తెలిపారు.

ఘనంగా కార్తీక సోమవారం పూజలు

మద్రిపూడి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కార్తీక సోమవారం సందర్భంగా పురాతన శైవక్షేత్రమైన అంద్ర కొండకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. రామలింగేశ్వరునికి అభిషేకాలు, పూజలు చేశారు. మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు.

పోక్సో కేసు నమోదు

నాగులుప్పలపాడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక దాడికి పాల్పడిన బాలుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. అమ్మనబ్రోలు గ్రామంలోని కనపర్తి బస్టాండ్ కూడలి ప్రాంతంలో నివశిస్తున్న పద్నాలుగేళ్ల బాలుడు అదే సామాజిక వర్గానికి చెందిన తన ఇంటి ప్రక్కన నివశించే పదేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు బాలుడిపె పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు.

విద్యార్థులకు డేటా సైన్స్‌పై అవగాహన

ఒంగోలు విద్య, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం సీఎస్‌ఐటీ చదువుతున్న విద్యార్థులకు డేటాసైన్స్ ప్రాముఖ్యతపై వర్చువల్ గెస్ట్ లెక్చర్ జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎన్ఐటీ నాగాలాండ్‌కు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నాగరాజు బాయదేటి ఎ ల్గొని మాట్లాడారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, సీఎస్ఐటీ హెచ్‌వోడీ ఎన్. శ్రీనివాసరావు ఉన్నారు.

క్విస్‌ఫార్మసీలో ఉచిత వైద్య శిబిరం

ఒంగోలు విద్య నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ ఫార్మసీ వారోత్సవాలను పురస్కరించుకొని స్థానిక క్విస్ ఫార్మసీ కళాశాలలో సోమవారం కిమ్స్ హాస్పటల్ సహకారంతో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. జనరల్‌వైద్య నిపుణులు డాక్టర్ రామాంజనేయులు, ఎండోక్రైనాలజి వైద్య నిపుణులు డాక్టర్ వైష్ణవిలు పాల్గొని పరీక్షలు నిర్వహించారు.

అర్జీలకు ఖచ్చితమైన సమాధానాలు ఇవ్వాలి

కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం


అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన వినతులకు సరైన సమాధానాలు ఇవ్వాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. వినతులు రీ ఓపెన్ చేసే పరిస్థితి లేకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని మీకోసం సమావేశపు హాలులో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పలురకాల సమస్యలను విన్నవించారు. అనంతరం జిల్లా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుంచి తమ సమస్యల పరిష్కారం అవుతాయని ఎంతో ఆశతో అర్జీదారులు వస్తున్నారని, వచ్చిన అర్జీలను పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా గడువులోపు పరిష్కరించాలన్నారు. వచ్చిన అర్జీలపై సంబంధిత శాఖల జిల్లా అధికారి ఖచ్చితంగా పరిశీలన చేయాల్సిన అవసరం ఉందన్నారు. పరిష్కరించిన అర్జీలను సంబంధిత జిల్లా అధికారులు ఒకసారి పరిశీలన చేయాలని సూచించారు. అర్జీల పరిష్కారంలో అలసత్వం లేకుండా నిర్ణీత గడువులోపు నాణ్యతతో పరిష్కరించేలా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ప్రజా సమస్యలపరిష్కార వేదిక లో వచ్చిన వినతుల పరిష్కారానికి సంబంధించి ప్రతిశాఖలో ఆడిట్ టీం ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అర్జీలు పెండింగ్, రీ ఓపెనింగ్ లేకుండా అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కార తీరు ఉండాలన్నారు. ఈనెల 19న జిల్లా వ్యాప్తంగా వరల్డ్ టాయిలెట్ డే కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు 260 అర్జీలను అధికారులకు అందజేశారు. గ్రీవెన్స్‌లో జాయింట్‌కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ, డీఆర్వో చిన ఓబులేషు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లోకేశ్వరరావు, వరకుమార్, సీపీవో వెంకటేశ్వర్లు, డీటీసీ సుశీల, జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులుతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 62 ఫిర్యాదులు


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు(క్రైం),నవంబరు18(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ఫిర్యాదులను చట్ట పరిధిలో సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ ఏఆర్.దామోదర్ తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలోని గెలాక్సీ భవన్‌లో జరిగిన ఎస్పీ గ్రీవెన్స్‌కు జిల్లాలో పలు ప్రాంతాలనుంచి 62 మంది ఫిర్యాదులు చేశారు. ఫిర్యాదిదారులతో మాట్లాడి వారి సమస్యలను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఒంగోలు రూరల్ సీఐ ఎస్.శ్రీకాంత్ బాబు ,సింగరాయకొండ సీఐ హజరత్తయ్య, డీసీఆర్‌బీ సీఐ దేవ ప్రభాకర్ సిబ్బంది పాల్గొన్నారు

నివేశన స్థలాలు ఇవ్వాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణ

కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా


కమిషనర్‌కు వినతిప్రతం ఇస్తున్న జిల్లా కార్యదర్శి నారాయణ

ఒంగోలు, కార్పొరేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికలకు ముందు ఎన్డీఏ కూటమి ఇచ్చిన హామీ మేరకు పట్టణ ప్రాంతంలో నిరుపేదలకు 2 సెంట్ల భూమి, గ్రామీణ ప్రాంతంలోని ప్రజలకు 3 సెంట్ల భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఒంగోలు నగర సమితి ఆధ్వర్యంలో సోమవారం కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం ఒంగోలు నగరంలో 30 వేల మందికి ఇళ్ల స్థలాలు అంటూ ఎన్నికల ముందు ఆర్భాట ప్రచారం చేసి, ఉపయోగం లేని కాగితాలు చేతిలో పెట్టిందని విమర్శించారు. అలాగే గత టీడీపీ పాలనలో టిడ్కో గృహాలు 80 శాతం నిర్మించి నప్పటికీ వాటిని పూర్తి చేసి, లబ్ధిదారులకు అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. దీంతో నగరంలో నివసించే పేదలు అద్దెలు చెల్లించలేక, పిల్లల చదువులు చదివించుకోలేక, పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో దిక్కుతోచక నానా అవస్థలు పడుతున్నారని అన్నారు. అనంతరం కమిషనర్ డాక్టర్ కే. వెంకటేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. ముందుగా స్థానిక మల్లయ్యలింగం భవనం నుంచి కార్పొరేషన్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ నాయుకులు ఉప్పుటూరి ప్రకాశరావు, కొత్తకోట వెంకటేశ్వర్లు, శ్రీరామ్ శ్రీనివాసులు, ఎస్‌డీ సర్దార్, సీహెచ్. ఆదినారాయణ, సీహెచ్. వెంకట్రావు, ఎంఎస్. సలార్, ఖాశీం, షఫీతోపాటు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కొత్తపట్నంలో ప్రదర్శన, ధర్నా



కొత్తపట్నంలో ప్రదర్శన చేస్తున్న పేదలు

కొత్తపట్నం(ఒంగోలు నగరం) : మండలంలో పేదలకు ప్రభుత్వం వెంటనే ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం కొత్తపట్నంలో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మండలరెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ముందుగా స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి ప్రదర్శనగా మండల రెవెన్యూ కార్యాలయానికి చేరుకుని అక్కడ ధర్నా నిర్వహించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అర్జీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకురాలు విజయ తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరులో..

టంగుటూరు : నిరుపేదలకు ప్రభుత్వం వెంటనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి టంగుటూరి ప్రభాకర్ అధికారులను డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు సోమవారం టంగుటూరులో పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు పేరయ్య, మహిళా నాయకురాలు సుశీల తదితరులు పాల్గొన్నారు.

మద్యం సేవించి.. ఆపై విధులకు అడ్డు తగిలి


నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనంలో మద్యం తాగి పడవేసిన వాటర్ బాటిళ్లు, మద్యం సీసాలు (వృత్తంలో)

మద్దిపాడు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి ఉద్యోగుల విధులకు అడ్డు తగిలిన సంఘటన మండలంలోని గుండ్లాపల్లిలో చోటుచేసుకుంది. సోమవారం ఉదయం ఎంఎల్‌హెచ్ కీర్తి నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనం వద్దకు వెళ్లగా అక్కడ కొందరు యువకులు మద్యం సేవిస్తూ కనిపించారు. ఆమె పట్టించుకోకుండా అక్కడ శుభ్రం చేస్తుండగా యువకులు ఆమెను ప్రశ్నిస్తూ ఆమెపై గ్లాసులు విసిరారు. అనంతరం ఆమెతో వాదులాటకు దిగారు. దాంతో ఆమె కార్యదర్శికి ఫోన్‌లో విషయాన్ని వివరించగా ఫొటో తీసి తనకు పంపాలని సూచించారు. ఆమెపొటో తీస్తుండగా దాన్ని డిలీట్ చేయమంటూ ఒక యువకుడు ఆమెపైకి దూసుకెళ్లారు. కొద్దిసేపటి తర్వాత అక్కడకు 104 వాహనం రాగా అందులో డాక్టర్ శిరీష వచ్చి కమ్యూనిటీ హాల్‌ను సచివాలయ సిబ్బంది ఉపయోగించుకుంటున్నారని, అక్కడకు ఇతరులు రాకూడదని చెప్పారు. అలాగే మద్యం సేవించి విధులకు అడ్డుతగిలిన యువకులపై మద్దిపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

జూనియర్, సబ్‌జూనియర్ షూటింగ్‌బాల్ పోటీలకు ఎంపికలు

సంతనూతలపాడు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా జూనియర్, సబ్‌జూనియర్ షూటింగ్‌బాల్ బాలబాలికల ఎంపికలు బుధవారం మండలంలోని పేర్నమిట్ట జడ్పీహైస్కూల్లో జరుగుతాయని అసోసియేషన్ కార్యదర్శి రత్నకుమార్, ప్రెసిడెంట్ నారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలకు 17, 19 సంవత్సరాల బాలబాలికలు 2008 జనవరి 1వతేదీ తర్వాత జన్మించినవారై ఉండాలన్నారు. ఎంపికలకు హాజరయ్యే వారు ఆధార్‌కార్డు, వయస్సు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలని, పూర్తి వివరాలకు సెల్‌నెం.7730004438 సంప్రదించాలన్నారు.

టీడీపీతోనే రాష్ట్ర భవిష్యత్తు

మద్దిపాడు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి):తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్ర భవిష్యత్ బాగుంటుందని, అదేవిధంగా పార్టీ కార్యకర్తలకు సైతం తగిన న్యాయం జరుగుతుందని మండల అధ్యక్షుడు మండవ జయంత్ బాబు అన్నారు. సోమవారం నేలటూరులో దుంప కృష్ణమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వంద రూపాయల సభ్యత్వంతో ఐదు లక్షల ప్రమాద బీమా వర్తింస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ముల్లూరి మురళి, మండవ గోపీనాధ్, పాడిబండ్ల అజయ్ బాబు, దేవబత్తిన ప్రసాద రావు, వెంకటేశ్వర రెడ్డి, నేలటూరు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బంగారు భవిష్యత్‌పై అవగాహన

టంగుటూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : తూర్పునాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల బంగారు భవిష్యత్‌పై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 బాలాజీ, సర్పంచ్ రవికుమార్, సచివాలయ కార్యదర్శి ఎస్‌కె జరీనా, హెచ్‌ఎం సుధారాణి పాల్గొన్నారు. మండలంలోని ఎం.నిడమలూరులో నిర్వహించిన కార్యక్రమానికి ఐటీడీపీ అధ్యక్షుడు కాకుమాని శ్రీనివాస్ హాజరై మాట్లాడారు.

విద్యార్థులకు పోటీలు

కొండపి : బంగారు బాల్యం కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో వక్తృత్వం, వ్యాసరచన, చిత్రలేఖనం తదితర పోటీలు నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి అయిన గృహ నిర్మాణశాఖ పీడీ పి.శ్రీనివాసప్రసాద్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.మురళి, ఎంపీడీవో రామాంజనేయులు, సీడీపీవో మాధవీలత, ఎంఈవోలు కె. సురేఖ, పి.రామారావు, హెచ్‌ఎంలు చలపతి, సునన్నకుమార్, సుబ్బారావు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కేంద్ర ప్రభుత్వ పెన్షన్‌దారులు

పెన్షన్‌దారుల సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ పెన్షన్‌దారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని పలువురు డిమాండ్ చేశారు. ఆల్ పెన్షనర్స్‌అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాకు జిల్లా అధ్యక్షుడు జి.శేషయ్య అధ్యక్షత వహించారు. ధర్నాలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ రాంబాబు మాట్లాడుతూ ఈపీఎఫ్ పెన్షన్‌దారులకు ప్రతినెలా పెన్షన్‌గా రూ.వెయ్యినుంచి మూడువేల వరకు మాత్రమే పొందుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తక్షణమే వీరికికనీస పెన్షన్ రూ. 9వేలు, డీఏ కలిసి ఇవ్వాలన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెన్షనర్ల, ఉద్యోగ వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నదని విమర్శించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్పందించి పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఆర్‌పీఏ నాయకులు టీవీఆర్‌కుమార్, ఎ.రాఘవులు,టి నారాయణ, రైతు సంఘం నాయకుడు చుండూరి రంగారావు, సింగరాజు శ్రీనివాసరావు, దామరాజు నాగేశ్వరరావు, ఎం. శ్రీనివాసరావు, ఐవీ ఆంజనేయులు, ఎస్.నరసింహారావు, డీ నారాయణ, జీ శ్రీరామమూర్తి, జీ నారాయణరావు తదితరులు ఉన్నారు.

పూడికతీత పనులు చేపట్టండి

● కమిషనర్ వెంకటేశ్వరరావు ఆదేశం

● హౌసింగ్ బోర్డు కాలనీలో 'వార్డుకోవారం' కార్యక్రమం


పూడికతో నిండిన కాలువను పరిశీలిస్తున్న కమిషనర్

ఒంగోలు, కార్పొరేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కాలనీల్లో మురుగునీటి పారుదల వ్యవస్థ మెరుగు కోసం, కాలువల్లో పూడిక తీత పనులు వెంటనే చేపట్టాలని నగర కమిషనరు డాక్టర్ కే. వెంకటేశ్వరరావు శానిటరీ సిబ్బందిని ఆదేశించారు. 'వార్డుకోవారం' కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక 19వ డివిజన్‌లోని హౌసింగ్ బోర్డు కాలనీలో కమిషనరు పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను కార్పొరేటర్ ఈదర వెంకట సురేష్ బాబు కమిషనర్‌కు వివరించారు. పర్యటనలో భాగంగా కమిషనర్ పలు సమస్యలను గుర్తించారు. కొన్ని వీధుల్లో సైడు కాలువలు లేకపోగా, మరి కొన్ని చోట్ల ఉన్న ప్రాంతాల్లో కనీసం కాలువల్లో కూడా పూడిక తీయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం ఇంటి చెత్త సేకరణకు పరిమితం కాకూడదని, వీధుల్లో చెత్తను తొలగించాలన్నారు. కాలనీల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించడంతోపాటు కాలువల్లో పూడిక తీత పనులు వెంటనే చేయాలన్నారు. అలాగే భాగ్యనగర్ 4వ లైను నుంచి హౌసింగ్ బోర్డుకు వెళ్లే మార్గంలో పైపులైను లీకులు, అధ్వానంగా ఉన్న రోడ్లను పరిశీలించి, లీకుల రిపేర్లు, అలాగే మెయిన్ పైపులైను పనులు త్వరతగతిన పూర్తి చేయాలని ఇంజనీర్లు, కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. అదేవిధంగా పార్కు నిర్మాణ పనులు, తదితర సమస్యలు పరిశీలించిన కమిషనర్ పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ మనోహర్ రెడ్డి, డీఈలు టీడీపీ డివిజన్ నాయకులు ఇందుర్తి మారుతీరావు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

ఒప్పందాలను అమలు చేయాలి

● ధర్నాలో ఆశావర్కర్లు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు18(ఆంధ్రజ్యోతి): ఆశావర్కర్ల సమస్యలపై ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను వెంటనే అమలు చేయాలని ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కల్పన ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ఆశావర్కర్ల సమస్యలపై ఎం.బాలమ్మ అధ్యక్షతన ధర్నా జరిగింది. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆశావర్కర్ల సమస్యలపై ఒప్పందం చేసుకుని 9 నెలలైందని, ప్రభుత్వం ఇంతవరకు దాన్ని అమలు చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఆశాలకు సంబంధం లేని విధులు చేయిస్తున్న వైద్యాధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, వేతనాలతో కూడిన సెలవులు, మెటర్నటీ సెలవుల సౌకర్యం కల్పించాలని కోరారు. జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.రమేష్, సీఐటీయూ జిల్లా నాయకులు కాలం సుబ్బారావు, నాయకులు సీహెచ్.శ్రీనివాసరావు, జి.శ్రీనివాసులు, ఆశావర్కర్ల యూనియన్ జిల్లా నాయకులు ఎం.పరిశుద్ధం, అరుణ, పుల్లమ్మ, అన్నపూర్ణ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

కారుడ్రైవర్ అనుమానాస్పద మృతి

- వివాహేతర సంబంధమే కారణమని అనుమానాలు


మృతిచెందిన సురేష్

ఒంగోలు(క్రైం), నవంబరు18 (ఆంధ్రజ్యోతి): కారుడ్రైవర్ అనుమానస్పద రీతిలో మృతిచెందాడు. ఈ ఘటన స్థానిక కొప్పోలు రోడ్డులోని రాజీవ్ కాలనీ 6 లైన్ పక్క రోడ్డులో ఆదివారం రాత్రి జరిగింది. వివరాలలోకి వెళితే.. స్థానిక ఏకలవ్యనగర్‌లో నివాసం ఉంటున్న గాలేటి సురేష్ (34) రాజీవ్ కాలనీ పక్కరోడ్డులో ఓ ఇంటిలో శవమై కనిపించాడు. సోమవారం ఉదయం సురేష్‌తో సన్నిహితంగా ఉంటున్న యువతి చూసి సమాచారం ఇచ్చింది. ఎనిమిది నెలలుగా సురేష్ ఏకలవ్యనగర్‌లో నివాసం ఉండే మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. అప్పటి నుంచి భార్య పావనితో తరచు గొడవపడుతున్నాడు. వారం క్రితం నుంచి ఇంటికి సరిగా రావడం లేదు. ఈ క్రమంలో తన భర్త సురేష్ అనుమానాస్పదంగా మృతి చెంది ఉన్నాడని భార్య పావని ఒంగోలు తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసిన తాలుకా ఎస్సై ఫిరోజ్ సురేష్ మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు.

అసలేం జరిగింది...

కారు డ్రైవరుగా పనిచేసే సురేష్‌కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారు స్థానిక ఏకలవ్యనగర్‌లో నివాసం ఉంటున్నారు. అదే ప్రాతంలో నివాసం ఉంటున్న యువతి భర్తకు దూరంగా తల్లివద్ద ఉంటోంది. ఈనేపథ్యంలో వీరి ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడింది. పదిరోజుల క్రితం స్థానిక రాజీవ్ కాలనీ 6లైన్ పక్కన ఉన్న రోడ్డులో ఓ ఇంటి మొదటి అంతస్తును అద్దెకు తీసుకున్నారు. తరచుగా సురేష్, యువతి కలిసి అక్కడకి వచ్చి వెళుతున్నారు. ఆదివారం రాత్రి సురేష్ ఆయువతికి ఫోన్‌చేసి పిలిచాడు. ఆమె వచ్చేందుకు నిరాకరించింది. పైగా సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్‌చేసుకుంది. సోమవారం ఉదయం తాను అక్కడకు వెళ్లిన యువతి చున్నీతో సురేష్ ఉరివేసుకొని ఉన్నాడని తానే కిందకు దించానని చెబుతోంది. దీంతో సురేష్ మృతిపై అనేక అనుమానాలు ఉన్నాయి. ఈ కేసుకు సంబంధించి యువతిని విచారణ చేస్తున్నామని తాలుకా సీఐ అజయ్‌కుమార్ తెలిపారు.

రోడ్డుప్రమాదంలో జింక మృతి


రోడ్డుప్రమాదంలో మృతి చెందిన జింక

పొదిలి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కంభాలపాడు గ్రామా సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో జింక అక్కడిక్కడే మృతి చెందింది. స్థానికులు తెలి పిన వివరాల ప్రకారం, కంభాలపాడు సమీపం లో రోడ్డు దాటుతున్న సమయంలో గుర్తు తెలియని వాహనం జింకను ఢీ కొట్టింది. దీంతో స్థానికులు మోటారుబైక్ ఆపి చూసేలోపే వాహనం ఢీకొట్టి వెళ్లిందన్నారు. అనంతరం జింక దగ్గరకు వెళ్లేసరికి అప్పటికే కొనప్రాణంతో ఉందన్నారు. కొంతసేపటికి జింక మృతి చెందిందన్నారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించామన్నారు.

అర్హులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

ఎర్రగొండపాలెం రూరల్ నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన పేదలకు ఇంటిస్థలం వెంటనే మంజూరు చేసి పక్కా గృహం నిర్మించాలని సీపీఐ సీనియర్ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఎర్రగొండపాలెం పంచాయితీ కార్యదర్శి ఈ రాజశేఖరరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణం కోసం గ్రామాల్లో 1 సెంటు, పట్టణాల్లో కూడా ఒక సెంటు ఇచ్చారని అన్నారు. వారికి ఇళ్ల నిర్మించేందుకు కూటమి ప్రభుత్వం ఆర్థిక సాయం చేయాలని అన్నారు. ప్రస్తుతం మంజూరు చేసే పక్కా గృహానికి 4 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట జిల్లా కార్యవర్గ సభ్యులు కెవి కృష్ణ గౌడ్, సీపీఐ మండల కార్యదర్శి నక్కా తిరుపతయ్య, రైతు సంఘం నాయకులు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి మత్తులో యువత చిత్తు

- వై.పాలెం ఎక్సైజ్ శాఖ పరిధిలోనూ సాగు
- దాడుల్లో పట్టుబడుతున్న వైనం
- యువతకు అవగాహన కల్పనలో విఫలం

ఎర్రగొండపాలెం, నవంబరు 18, (ఆంధ్రజ్యోతి) : మత్తు పదార్థాలు, గంజాయిలకు అలవాటు పడి యువత నిండు జీవితాలను నాశనం చేసుకొంటోంది. కూటమి ప్రభుత్వం మత్తు పదార్థాలు, గంజాయిపై ఉక్కుపాదం మోపుతోంది. ఎక్కడికక్కడ అమ్మకాలు జరగకుండా చర్యలు తీసుకుంటోంది. అయినప్పటికీ, గుట్టుగా ఈ దందా కొనసాగుతోంది.

ఎర్రగొండపాలెం ఎక్సైజ్‌శాఖ పరిధిలో ఈ ఏడాది గంగుపల్లి గ్రామంలో 282 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకొని నిందితులపై కేసు నమోదు చేశారు. అలాగే కొలుకులలో 5 కిలోలు గంజాయిని స్వాధీనం చేసుకన్నారు. పాలుట్లలో 43 మొక్కలు, అక్కపాలెంలో 1.5 కిలోలు దొరికిన ఘటనలో కేసులు నమోదయ్యాయి. కేసుల సంఖ్య నిందితుల శిక్షల ఎలా ఉన్నా, ఈ ప్రాంతంలో గంజాయి సాగు ఆందోళన కలిగిస్తోంది. సాగు మేరకు వినియోగం ఉండడంతో ఆ ప్రభావం ఈ ప్రాంత యువత మీద ఉంటోంది.

చిన్నవయస్సులోనే జీవితాలు నాశనం

ఈ నెల 15న గంజాయి విక్రయించేందుకు ముగ్గురు యువకులు సిద్ధంగా ఉన్నారన్న సమాచారంతో ఎర్రగొండపాలెం పోలీసులు దాడులు చేసి యువకులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. ఈ ముగ్గురు కనీసం 25 ఏళ్ల నిండని యువకులే కావడం గమనార్హం. ఒక వైపు వీరు ఈ వ్యసనానికి లోనై, మరోవైపు ఈ అక్రమ దందాలో వీరు కొనసాగుతున్నారు. ఈ ముగ్గురు యువకుల్లో వనపర్తి బెనహర్ (21), రాచకొండ శ్రీకాంత్ (21) పటాన్ సుభాని (24) అంటే ముగ్గురు యువకులు ఇంత చిన్న వయస్సులో మత్తుపదార్థాలకు అలవాటి పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. ఇలాంటి అలవాట్లతో పలువురు యువకులు పెడదారి పడుతున్నారు.

అవగాహన కలిగించడంలో అధికారులు విఫలం

ఇటు ఎక్సైజ్ శాఖ, పోలీస్ శాఖ అధికారులు మత్తు పదార్థాలతో కలిగే నష్టాలపై యువతకు అవగాహన కల్పించడంలో పూర్తిగా విఫలం అయ్యారని విమర్శలు ఉన్నాయి. తూతూమంత్రంగా కాకుండా ప్రధాన కూడళ్లు, కళాశాలు, పాఠశాలల వద్ద అవగాహన కలిగేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలి. పోలీస్ సిబ్బంది పాఠశాలలు, గ్రామ శివారులలో నిఘా ఉంచాలి. ఇక తల్లిదండ్రులు కూడా తమ పిల్లలపై నిఘా ఉంచాలి. మంచి అలవాటు నేర్పించాలని యువత పక్కదారి పట్టకుండా తమ పిల్లల పట్ల బాధ్యతగా ఉండాలని అధికారులు తల్లిదండ్రులను కోరుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం

రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికారుల ఆదేశాలతో ఎర్రగొండపాలెం సర్కిల్ పరిధిలో ప్రజలకు, యువతకు అవగాహన కల్పిస్తున్నామని ఎర్రగొండపాలెం ఎక్సైజ్ సి.ఐ సి.హెచ్ శ్రీనివాసులు సోమవారం తెలిపారు. కాలేజీలలో ప్రత్యేక క్యాంప్‌లు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఎక్కడైన గంజాయి, మత్తు పదర్థాలు అమ్ముతున్న, కొనుగోలు చేస్తున్న, మొక్కలు ఉన్న సమచారం ఇవ్వాలని ఆయన ప్రజలను కోరారు. అందరి సహకారంతోనే నిర్మూలించ వచ్చునని అన్నారు. సీహెచ్ శ్రీనివాసులు ఎక్సైజ్ సీఐ


ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్న గంజాయి మొక్కలు (ఫైల్)

జాబ్ మేళాలు ఉపయోగించుకోవాలి

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 18 ఆంధ్రజ్యోతి: నిరుద్యోగ యువత జాబ్ మేళాలు ఉపయోగించుకోవాలని స్కిల్ డవలప్‌మెంట్ మార్కాపురం ఇన్‌చార్జ్ ఫిరోజ్ గాంధీ అన్నారు. స్థానిక ఎస్‌పీసీ శిక్షణా కేంద్రంలో సోమవారం మినీ జాబ్‌మేళా నిర్వహించారు. 75 మంది హాజరుకాగా 34 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కల్పనా కార్యాలయం సిబ్బంది రామచంద్రారెడ్డి, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాల మంజూరుకు వినతి

మార్కాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇంటి స్థలాలు మంజూరు చేయాలని సోమవారం మీ కోసం కార్యక్రమంలో సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్‌కు మార్కాపురం డివిజన్ పరిధిలో ఇరిగేషన్, ఎన్ఎస్‌పీ, ఆర్అండ్‌బీ శాఖల్లో పనిచేస్తున్న వర్క్‌చార్జి ఉద్యోగులు వినతిపత్రం అందజేవారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద కుటుంబాలకు చెందిన తాము 20 ఏళ్లుగా పనిచేస్తున్నా ఇళ్లస్థలాలు ఎక్కడాలేవన్నారు. ఇక మార్కాపురంలో ఆక్రమణల తొలగింపుతో తాము ఉపాధి కోల్పోయామని చిరు వ్యాపారులు సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించి అర్జీ అందజేశారు.

ఆలయాల్లో వైభవంగా కార్తీక పూజలు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం సందర్భంగా వివిధ ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా ఆలయాల్లో శివ నామస్మరణలతో ఆలయాలు మార్మోగాయి. పట్టణంలోని జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు వేలూరి ఆంజనేయశర్మ, వరుణ్‌తేజ శర్మలు మార్కండేశ్వరుడు, జగదాంబలకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణ చేశారు. స్వామి దర్శనానికి తెల్లవారుజామున 3 గంటల నుంచే భక్తులు బారులతీరారు. మార్కండేశ్వరుని దర్శించుకుని పూజలు చేశారు. నాగశిలలకు పాలు పోశారు. కార్తీక దీపాలు వెలిగించారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని పలు ఆలయాల్లో కార్తీక దీపాలు వెలిగించారు.


జగదాంబకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, నాగదేవతలకు భక్తుల పూజలు

గిద్దలూరు : పట్టణంలోని శ్రీ పాతాళ నాగేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం తెల్లవారుజాము నుంచే ప్రజలు కార్తీక దీపాలు వెలిగించి స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. నాగేశ్వర స్వామికి పలువురు అభిషేకాలు చేశారు. శ్రీకుసుమ హరనాథ మందిరంలో కార్తీక మాస ప్రత్యేక పూజలు అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. అభయాంజనేయస్వామి దేవాలయంలో సైతం శివునికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిశాల, వేంకటేశ్వరస్వామి దేవాలయాలు, వేణుగోపాల స్వామి దేవాలయాలలో గంగమ్మ, గౌరమ్మలకు కుంకుమ పూజలు నిర్వహించారు.

కంభం : కార్తీక సోమవారం సందర్భంగా కంభం, అర్థవీడు మండలాల్లో పలు శివాలయాలు భక్తుల శివనామస్మరణలతో మారుమోగాయి. మండలంలోని చిన్నకంభం వీరభద్రస్వామి ఆలయం, రావిపాడు కోటేశ్వర స్వామి దేవాలయం, కంభం శివాలయం, తురిమెళ్లలోని కనక సురభేశ్వర ఆలయంలో భక్తులు కార్తీకదీపాలు వెలిగించి ఆది దంపతులకు మొక్కులు తీర్చుకున్నారు.


మార్కండేశ్వరుడి దర్శనానికి వచ్చిన భక్తులు, చిన్నకంభంలో వీరభద్రుడికి పూజలు

బాలల బంగారు భవిష్యత్తుకు తోడ్పడాలి

మార్కాపురం మున్సిపల్ కమిషనర్ నారాయణరావు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు బాలలకు అదేలా చూసి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని మున్సిపల్ కమిషనర్ నారాయణరావు అన్నారు. స్థానిక ఎసీటీసీ కాలనీలోని మున్సిపల్ పాఠశాలలో బంగారు బాల్యం వారోత్సవాలు సోమవారం నిర్వహించారు. వివిధ అంశాలు వివరించారు. పట్టణంలోని పలు పాఠశాలలలో బంగారుబాల్యం వారోత్సవాలు నిర్వహించారు.

బేస్తవారపేట : బంగారు బాల్యం- బాలోత్సవాల్లో భాగంగా సోమవారం బేస్తవారపేట జిల్లా పరిషత్ హైస్కూల్ నందు జరిగిన ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో బాల్య వివాహాలు,బాల హక్కులు-చట్టాలు,బాల కార్మికుల సమస్య తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జడ్‌పీటీసీ సభ్యులు బండ్లమూడి వెంకట రాజయ్య, మండల ప్రత్యేక అధికారి నారాయణరెడ్డి, ఎంపీడీవో ఏవీ.రంగనాయకులు, తహసీల్దార్ జితేంద్ర కుమార్, సీడీపీవో నీలోఫర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కమిషనర్ నారాయణరావు

విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు

గిద్దలూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా స్థానిక శాఖ గ్రంథాలయం ఆవరణలో చుక్కల ముగ్గుల పోటీలను నిర్వహించారు. 50 మందికి పైగా విద్యార్థులు చుక్కల ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. పోటీలు విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీస్తాయని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, విశ్రాంత హెచ్ఎం వై.నర్సిరెడ్డి, రిటైర్డ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కాగా రాచర్ల గ్రంథాలయంలో గ్రంథపాలకుడు శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో చదరంగం పోటీలు నిర్వహించారు.

పెద్దదోర్నాల : నిరంతర కృషితో విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తును పొందుతారని ఎంఈవో మస్తాన్‌నాయక్ అన్నారు. స్థానిక కస్తూర్బా గురుకుల బాలికల పాఠశాలలో పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తూ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కాపురానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు రాంభూపాల్‌రెడ్డి అతిథిగా హాజరయ్యారు.


దోర్నాలలో ధ్రువపత్రాలతో విద్యార్థులు

ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని, ఉపాధ్యాయులు తరగతి గదిలో చెప్పిన పాఠాలను శ్రద్ధగా వినాలని పరీక్షల్లో భయం లేకుండా రాయాలన్నారు. పలు సూచనలు చేశారు. అనంతరం గత ఏడాది పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రథమ, ద్వితీయ శ్రేణిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తూ ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎల్.అనూష, అధ్యాపకులు వసంత భారతి తదితరులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం క్విజ్‌పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో ఏపీడబ్ల్యూఆర్ స్కూల్ బాలురు, బాలికలు, కస్తూర్బా గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పుల్లలచెరువు : సమాజంలో బాలబాలికలు సమానత్వం పాటించాలని పుల్లలచెరువు ఎంపీడీవో వసంతరావు నాయక్ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యలయంలో బాల కార్మిక వ్యవస్థ పై అవగహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాలను జరుగకుండా అడ్డుకోవాలని అన్నారు. బాలల కార్మికులుగా మారకుండా ప్రతి ఒక్కరు బాగా చదువుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎంఈవో ఇందిరా ప్రసాద్, ఐసీడీఎస్ సూపరువైజరు శివలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం రూరల్ : విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఉపాధ్యాయులు శాఖమూరి శ్రీనివాసరావు, ఆంజనేయులు, రమాదేవి మ్యాథ్స్‌లు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా సోమవారం గ్రంథపాలకురాలు కె.ఝాన్సీ ఆధ్వర్యంలో ఆటల పోటీలు, వ్యాసరచన పోటీలను ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. వ్యాసరచన, కబడ్డి పోటీలకు 64 మంది వివిధ పాఠశాలల నుండి పాల్గొన్నారని ఝాన్సీ తెలిపారు.


తర్లుపాడులో ముగ్గుల పోటీలో పాల్గొన్న విద్యార్థులు

తర్లుపాడు : గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మండలంలోని వివిధ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులకు ముగ్గులపోటీలు, మ్యూజికల్ చైర్స్ పోటీలను నిర్వహించారు. న్యాయనిర్ణేతలుగా పి.కోటిమోహన్, దొండేటి గురవారెడ్డి, పుల్లయ్య, గోసు శ్రీనివాసులు, మంచా ప్రభాకర్ వ్యవహరించారు. ఈ పోటీలకు వివిధ పాఠశాలలకు చెందిన 80 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. విజేతలకు వారోత్సవాల ముగింపు రోజున బహుమతులు అందజేయనున్నట్లు గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి తెలిపారు.

ఎర్రగొండపాలెం రూరల్ : బాలల బంగారు భవిష్యత్తు వైపు కార్యక్రమంలో బాగంగా సోమవారం ఎర్రగొండపాలెంలోని మండల పరిషత్ కార్యాలయంలో విద్యార్థులకు డిబేట్, డ్రాయింగ్, ఈజీ రైటింగ్ పోటీలను నిర్వహించారు.

సాయిబాబా జన్మదిన కార్యక్రమాలు ప్రారంభం

గిద్దలూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రేమసుధామందిరం ఆవరణలో సత్యసాయిబాబా 99వ జన్మదిన వేడుకలు సోమవారం ప్రారంభమయ్యాయి. సత్యసాయి భక్తులు సోమవారం తెల్లవారుజామున నగర సంకీర్తన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ప్రేమసుధామందిరంలో నామసంకీర్తన, వేదపఠన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో అమ్మవారిశాల అధ్యక్షులు వాడకట్టు రంగసత్యనారాయణ పతాక ఆవిష్కరణ చేశారు. సత్యసాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్యసాయి సేవాసమితి కన్వీనర్ సూరె అనంతరామయ్య, కమిటీ ప్రతినిధులు ఆయా ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

గిద్దలూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు పట్టణంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ పార్టీ నాయకులు నిర్వహించారు. ప్రతి ఒక్కరి ఇంటికి వెళ్లి సభ్యత్వం నమోదు చేయాలని ఆ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు ఎ.ఉదయ్‌శంకర్, జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జేవీ.నారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు బీవీ.రామాంజనేయలు. బీజేపీ నాయకులు రెడ్డి మల్లారెడ్డి, పిడతల రమేష్‌రెడ్డి, షేక్ ఖాదర్‌వలి, మట్టిమల్లె పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

మిరపలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

గిద్దలూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత సీజన్‌లో సాగైన మిరప పంటలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి ఉద్యానవన శాఖాధికారిణి పి.విష్ణుప్రియ వివరించారు. మిరప పైరులో చాలాచోట్ల తామర పురుగు, తెల్లదోమ కనిపిస్తున్నదన్నారు. ఈ పురుగుల నివారణ కోసం ఎకరాకు 30 నుంచి 50 నీలి, పసుపు రంగు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. విప్రోనిల్ మందును పిచికారి చేసుకోవాలన్నారు. శిలీంద్రాల వలన వచ్చే ఆకుమచ్చ, కాయమచ్చలను తగ్గించడం కోసం ఎం-45 మందును పిచికారి చేసుకోవాలని సూచించారు. సూక్ష్మపోషకాలు అందించడం కోసం ఫార్ములా 6 మందును లీటరుకు 5 గ్రాములు కలిపి పిచికారి చేయాలన్నారు. అలాగే మల్టికె, 19-19-19 మందులను మొక్కలపై పిచికారి చేయాలని సూచించారు. మిరప పంటలో బొబ్బర తెగులును నియంత్రించేందుకు సమీకృత తెగులు నివారణ పద్ధతులు పాటించాలని రైతులకు సూచించారు.

గ్రామీణ యువతకు ఉపాధి కల్పనే ధ్యేయం

కంభం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఎప్పటికప్పుడు ఉపాధి కల్పించేందుకు వ్యయప్రయాసల కోర్చి స్కిల్‌హబ్ సెంటర్ల ద్వారా అవకాశాలను కల్పిస్తోందని, శిక్షణ పొంది చెన్నై, తిరుపతి వంటి ప్రదేశాలలో ఉద్యోగాలు పొందడం హర్షణీయమని తహసీల్దార్ కిరణ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో సోమవారం స్కిల్‌హబ్ జాబ్‌మేళ నిర్వహించారు. కార్యక్రమానికి తహసీల్దార్ కిరణ్‌తోపాటు ఇంటర్మీడియట్ విద్యామండలి ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి సైమన్ విక్టర్ హాజరై మాట్లాడారు. యువత సామర్థ్యాలను పెంచేందుకు శిక్షణ ఇచ్చి కంపెనీల ద్వారా ఉపాధి కల్పించేందుకు కంభం స్కిల్‌హబ్ దోహద పడుతుందన్నారు. ఈ జాబ్‌మేళలో 40 మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోగా వారిలో 15 మందికి ఆయా సంస్థలు ఉద్యోగాలు కల్పించాయి. కార్యక్రమంలో ఎంపీడీవో వీరభద్రాచారి, కో-ఆర్డినేటర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో ఎంఎస్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

మార్కాపురం వన్ టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మార్కాపురానికి చెందిన ఎంఎస్ స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులు కరాటేలో బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాలలో కరాటే చీఫ్ ఎగ్జామినర్ మారంరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఇన్‌స్ట్రక్టర్ తోట.ప్రసాద్‌లు విద్యార్థులను సోమవారం అభినందించారు. విజయవాడ లోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో విజయవాడ పడమట కరాటే అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నిర్వహించిన ప్రెసిడెంట్ కప్ ఏపీ స్టేట్ లెవెల్ పోటీల్లో 15 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. 10 మందికి బంగారు పతకాలు, 4 వెండి పతకాలు, 2 కాంస్య పతకాలు సాధించారని తెలిపారు.



కరాటే పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కబడ్డీలో వాసవీ విద్యానికేతన్ సత్తా

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 18 ఆంధ్రజ్యోతి: స్థానిక వాసవి విద్యానికేతన్ విద్యార్థులు కబడ్డీలో సత్తాచాటారు. స్థానిక నేతాజీ, సుభాష్ చంద్రబోస్ కబాడ్డీ క్లబ్ నిర్వహించిన పాఠశాల స్థాయి కబాడ్డీ టోర్నమెంట్‌లో విద్యార్థులు రన్నర్‌లుగా నిలిచి ద్వితీయ స్థానం బహుమతులు పొందారని ప్రిన్సిపాల్, డైరెక్టర్ రంగయ్య తెలిపారు. సోమవారం పాఠశాలలో విద్యార్థులను అభినందించారు.

విద్యార్థులు మంచి నడవడికను అలవర్చుకోవాలి

సబ్ కలెక్టర్ వెంకట్ సహదిత్ త్రివినాగ్

మార్కాపురం రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : బాలబాలికలు చిన్నతనం నుంచే మంచి నడవడికను అలవర్చుకోవాలని సబ్ కలెక్టర్ వెంకట సహదిత్ త్రివినాగ్ విద్యార్థులకు సూచించారు. మండలంలోని నాయుడుపల్లి గ్రామంలో సోమవారం తహసీల్దార్ చిరంజీవి ఆధ్వర్యంలో బంగారు బాల్యం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ బాలబాలికలు ప్రతి ఒక్కరూ చదువుకుని జీవితంలో ఉన్నత స్థితికి ఎదగాలన్నారు. చదువును ఎవరూ మధ్యలో ఆపకుండా ఉన్నత లక్ష్యాలను సాధించాలని కోరారు. బాల్యవివాహాలు జరగకుండా ఉండేందుకు అందరూ అవగాహన పెంచుకోవాలన్నారు. తహసీల్దార్ చిరంజీవి మాట్లాడుతూ తల్లిదండ్రులు వారి పిల్లలను కచ్చితంగా బడికి పంపాలన్నారు. ఎట్టి పరిస్థితిలోనూ, వారిని పనులకు పంపకూడ దన్నారు. పిల్లలు చదుకున్నపుడే ఆ కుంటుంబం ఆర్థికంగా సామాజికంగా ఎదుగుతుందన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం డి.పిచ్చయ్య, ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు కందుల శ్రీనివాసరెడ్డి, వల్లపునేని గాలెయ్య, సచివాలయ సిబ్బంది, వీవోఏలు పాల్గొన్నారు. మండలంలోని భూపతిపల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం ఏపీవో జీవరత్నం ప్రత్యేక అధికారిగా బంగారు బాల్యం కార్యక్రమం నిర్వహించారు.


దోర్నాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న జగన్నాథరావు

పెద్దదోర్నాల : ఆట పాటలతో కూడిన విద్య బాల్యంలోనే సాధ్యమని, అన్నింట రాణించాలని గిరిజన సంక్షేమ అధికారి జగన్నాథరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఈవో మస్తాన్ నాయక్ ఆధ్వర్యంలో బంగారుబాల్యం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీ డబ్ల్యూవో జగన్నాథరావు, ఎంపీడీవో నాసర్‌రెడ్డి మండల స్థాయి పోటీలు ప్రారంభించారు. విద్యార్థులకు బాల్య వివాహాలపై వ్యాసరచన, బంగారు బాల్యంపై వక్తృత్వం, భద్రతపై చిత్రలేఖనం, తదితర అంశాలపై పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్‌వీ నారాయణరెడ్డి, ఏపీఎం పోలయ్య, ఉపాధ్యాయ సిబ్బంది, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

పొదిలి : బంగారుబాల్యం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో శోభన్ బాబు అన్నారు. సోమవారం స్థానిక బాలికోన్నత పాఠశాలలో జరిగిన బంగారు బాల్యం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వ హిస్తున్న బంగారు బాల్యం కార్యక్రమంలో అధికారులు తప్పకుండా పాల్గొని రోజువారి కార్యక్రమాలు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ముఖ్యంగా చదువుకోని విద్యార్థులను, డ్రాప్‌అవుట్స్‌ను గుర్తించాలన్నారు. అదేవిధం గా సోమవారం మండల స్థాయిలో అన్ని పాఠశాలల్లో వ్యాసరచనలు, ఆటలపోటీలను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, సీడీపీవో సుధామారుతీ, ఎంఈవో శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

కంభం : కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం బంగారు బాల్యం కార్యక్రమంలో భాగంగా మండలస్థాయి పోటీలను ఎంఈవో బి.మాల్యాద్రి అధ్యక్షతన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ కిరణ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బాల్యవివాహాల నిర్మూలనపై వ్యాసరచన, వక్తృత్వ పోటీ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వీరభద్రాచారి, ఎంఇఒ-2 శర్వాణి, ఆర్ఐవో సెమన్‌విక్టర్, డీఆర్‌డీఏ ఏపీఎం మాధవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చెంచులక్ష్మి, లార్డ్స్ సంస్థ ప్రధాన కార్యదర్శి ఏలియా, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ వెంకట త్రివినాగ్

రోడ్డు ప్రమాదంలో ఎంపీపీకి గాయాలు

దొనకొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో దొనకొండ ఎంపీపీకి స్వల్ప గాయాలయ్యాయి. ఈఘటన దొనకొండ బ్రహ్మారావుపేటలోని ఆంజనేయస్వామి గుడి వద్ద సోమవారం చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. ఎంపీపీ బొరిగొర్ల ఉష, ఆమె భర్త ఉపాధ్యాయుడు మురళీ కారులో త్రిపురాంతకం వెళ్లి వస్తున్నారు.

బ్రహ్మారావుపేట సమీపం లోకి వచ్చేసరికి కారు అదుపుతప్పి ఎ దురుగా ఉన్న ఆంజనేయస్వామి దేవాల యం ప్రహరీగోడను బలంగా ఢీకొట్టింది. ఈప్రమాదంలో కారు బెలూన్లు ఓపెన్ కావటంతో ఎంపీపీకి స్వల్ప గాయాలయ్యాయి. ఆమె వినుకొండ వైద్యశాలలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం.

ఎరువు దుకాణాల తనిఖీ

తాళ్లూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తూర్పుగంగవరం, తాళ్లూరు గ్రామాల్లోని ఎరువులు, పురుగుల మందుల దుకాణాలను మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు సోమవారం తనిఖీ చేశారు. శ్యాంపిల్స్‌ను సేకరించారు.

కార్యక్రమంలో ఏఈవో నాగరాజు, డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఎన్‌ఎస్‌పీ క్వార్టర్స్

- కొన్ని ఆక్రమణల చెరలో... మరికొన్ని శిథిలావస్థలో
- పట్టించుకోని అధికారులు

ముండ్లమూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ముండ్లమూరులో నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన ఎన్ఎస్‌పీ క్వార్టర్స్ శిథిలావస్థకు చేరాయి. మరికొన్ని ఆక్రమణలకు గురయ్యాయి. 1984లో ఎన్ఎస్‌పీ అధికారులు నాగార్జున సాగర్ కుడి కాలువ పరిధిలో రజానగరం, మోదేపల్లి మేజర్లు తవ్వకాలు చేపట్టారు. అందుకనుగుణంగా ముండ్లమూరులో ఎన్ఎస్‌పీ సిబ్బంది ఉండేందుకు క్వార్టర్స్‌ను నిర్మించారు. ఇద్దరు డీఈలతో పాటు ఏఈ, సూపర్‌వైజర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, లస్కర్లు ఉండేందుకు లక్షల రూపాయలు వెచ్చించి క్వార్టర్స్ నిర్మించారు. రెండున్నర దశాబ్దాల వరకు వినియోగంలో ఉన్నాయి. కాలక్రమేణ శిథిలావస్థకు చేరాయి. సిబ్బంది పదవీ విరమణకావడం, కొత్త వారిని నియమించక పోవటంతో ఎన్ఎస్‌పీ క్వార్టర్స్ నిరుపయోగంగా మారిపోయాయి.



శిథిలావస్థకు చేరి చిల్లచెట్లతో మూసుకు పోయిన క్వార్టర్స్

ఈక్రమంలో ముండ్లమూరుకు చెందిన కొందరు కొన్ని క్వార్టర్స్‌ను ఆక్రమించుకున్నారు. మరికొన్ని శిథిలావస్థకు చేరి చిల్లచెట్లతో మూసుకుపోయాయి. క్వార్టర్స్ తలుపులు, కిటికీలు దొంగల పాలయ్యాయి. రహదారికి అతి దగ్గరలో ఇవి ఉన్నాయి. ఇక్కడ స్థలం కోట్ల రూపాయలు పలుకుతుంది. ఈ పరిస్థితుల్లో కొన్ని క్వార్టర్స్‌ను ఆక్రమించి అనధికారికంగా నివాసం ఉంటున్నారు. ప్రస్తుతం డీఈ, జేఈలు మాత్రమే డీఈ కార్యాలయంలో ఉంటూ ఉద్యోగం చేస్తూ సాయంత్రానికి పట్టణాలకు వెళ్తున్నారు. నిరుపయోగంగా క్వార్టర్స్ ఉండటం తో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిపోయాయి. డీఈ టైపు రెండు క్వార్టర్స్, ఏడీ టైపు రెండు క్వార్టర్స్ సబ్‌డివిజన్ టైపు రెండు క్వార్టర్స్ ఏఈ క్వార్టర్స్ ఒకటి, ఏ టైపు ఎనిమిది, బీ టైపు రెండు, సీ టైపు 15, సీడీ టైపు మూడు క్వార్టర్స్ ఉన్నాయి. చిల్లచెట్ల మధ్యలో ఎన్ఎస్‌పీ క్వార్టర్స్ ఉండటంతో ఆ ప్రాంతంలో నివాసం ఉండే ప్రజలు సైతం భయపడి పోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చిల్లచెట్లతో మూసుకుపోయిన క్వార్టర్స్‌లో చెట్లను తొలగించాలని కోరుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వాటిని మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

పరిశుభ్రత లేకపోతే రెస్టారెంట్‌లను సీజ్ చేస్తాం

కనిగిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రెస్టారెంట్‌ల్లో వంటగదులతో పాటు సిట్టింగ్ ఏరియాల్లో పరిశుభ్రత లేకపోతే కేసు నమోదు చేసి సీజ్ చేస్తామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్‌రసూల్ అన్నారు. కమిషనర్ ఆదేశాలమేరకు సోమవారం పట్టణంలో రెస్టారెంట్లు, హోటళ్లను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రెస్టారెంట్‌లలో మాంసాహారాన్ని ఫ్రిజ్‌లలో నిల్వ ఉంచి ఆహారాన్ని తయారు చేస్తున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయన్నారు. ఆహారాన్ని వడ్డించే సమయంలో వేడిచేసి ఇవ్వటంతో భుజించిన వారు అనారోగ్యాల పాలయ్యే అవకాశం ఉందన్నారు. రెస్టారెంట్‌లలో వంట గదులు, ఆహారాన్ని అందించే పాత్రలు, వంట సరుకులను ఆయన పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతివారం తనిఖీ చేస్తామని చెప్పారు. తీగెలగొంది, వైఎస్సార్ రోడ్డులలో ఉండే రెస్టారెంట్‌లలో శుభ్రత లేకపోవటంతోపాటు టేస్టింగ్‌సాల్ట్ వాడకంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

బాలల హక్కులను కాపాడటంలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర

తాళ్లూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కులను కాపాడటంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులదే కీలకపాత్ర అని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, ఎంపీడీవో కె.సుందరరామయ్య అన్నారు. మండలంలోని పలుపాఠశాలల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు సోమవారం మండలస్థాయిలో స్థానిక వీకే ఉన్నత పాఠశాలలో పోటీలు నిర్వహించారు. పరీక్షల తీరును ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, ఎంపీడీవో కె.సుందరరామయ్య. తహసీల్దార్ కె.సంజీవరావు, ఎంఈవో జి.సుబ్బయ్య పరిశీలించారు.



పరీక్షల నిర్వహణను పరిశీలిస్తున్న ఎంపీపీ, ఎంపీడీవోలు

రాజగారి బాట ఆక్రమణకు గురికాకుండా చర్యలు

పామూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక విరాట్‌నగర్‌లోని 350 సర్వే నెంబర్ లో గల శ్రీకాళహస్తి రాజగారి బాట ఆక్రమణకు గురికాకుండా సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేస్తామని తహసీల్దార్ బీవీ రమణారావు అన్నారు. రాజగారి బాట స్థలానికి సంబంధించి తమకు పట్టా ఉందంటూ కొందరు ఆక్రమణకు పాల్పడుతు న్నారని విరాట్‌నగర్ వాసులు సోమవారం తహసీల్దార్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఆక్రమణపై ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. సర్వే చేయించి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వీఆర్వోలు మండ్ల శ్రీనివాసులు, మహేష్, వార్డు మెంబర్ ఉప్ప లపాటి హరిబాబు, నొస్సం నాగేంద్రచారి, ఎం.దొరసానయ్యచారి, ఎం.సత్యం, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలి

దర్శి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మాడపాకుల రమేష్‌బాబు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సచివాలయం వద్దక జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు స్థలాలు మంజూరు చేయాలన్నారు. అలాగే, గృహ నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించాలని డిమాండ్ చేశారు. గత వైసీపీ ప్రభుత్వం నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో కేవలం సెంటు స్థలం మాత్రమే కేటాయించటంతో అక్కడ లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోలేదన్నారు. ప్రజలకు అనువైన చోట ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఆర్.అంజమ్మ, సంపూర్ణ, కోటేశ్వరరావు, మహేష్ పాల్గొన్నారు.

కనిగిరిలో.. కనిగిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీపీఐ నాయకుడు జీపీ రామారావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడా రు. గత ప్రభుత్వంలో పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు ఇచ్చారన్నారు. ఎన్నికలు రావటంతో కేటాయింపులు చేయలేదన్నారు. వారికి స్థలా లు కేటాయించి నిర్మాణాలకు రూ.5 లక్షల చొప్పున మంజూరుచేయాలని డిమాండ్ చేశారు. సర్వే నెంబరు 19లో వంద కుటుంబాలు ఏడాది నుంచి నివాసాలు ఉంటున్నా రన్నారు. వారికి పట్టాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో తిరుపాలు, సుబ్బారావు, రమణయ్య, పవన్‌కల్యాణ్, అంజమ్మ, అంకమ్మ, కోటయ్య, శివ, అంకయ్య, హనుమంతు, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.



కనిగిరిలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ శ్రేణులు

పామూరులో.. పామూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సయ్యద్ మౌలాలి డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా సోమవారం పామూరు గ్రామ సచివాలయ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం ఇచ్చిన స్థలాలను మార్పుచేసి మూడు సెం ట్లు కేటాయించి రూ.5 లక్షలు మంజూరు చేయాలన్నారు. అనంతరం పంచాయతి కార్యదర్శి జీవీ అరవిందకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వజ్రాల సుబ్బారావు, పోతుల ప్రభాకర్, ఆర్.సూరిబాబు, పాలపర్తి మస్తాన్‌రావు, పి.రఘునాథరెడ్డి, ప్రసాద్, మహేష్, రమణయ్య, వెంకటయ్య, జానిబాషా పాల్గొన్నారు.

'బంగారు బాల్యం భవితకు సోపానం'

పీసీపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): భవితకు సోపానం బంగారు బాల్యం అని మండల ప్రత్యేక అధికారి పానకాలరావు అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం నోడల్ అధికారుల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. పీసీపల్లి, పెదయిర్లపాడు జడ్పీ ఉన్నత పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా దృష్టి సారిస్తేనే బాలల భవిష్యత్తు బంగారుబాట అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభాకరశర్మ, తహసీల్దార్ సీహెచ్ ఉష, మండల విద్యాశాఖాధికారులు సంజీవిని, ఎం.శ్రీనివాసులు, వైద్యాధికారిణి డాక్టర్ మంజుల, తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

విద్యతోనే సమాజంలో మార్పు

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే సమాజ మార్పు సాధ్యమవుతుందని ప్రత్యేకాధికారి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం బంగారుబాల్యం మండలస్థాయి ఆటలపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మంజునాథరెడ్డి, ఎంఈవో రాజాల కొండారెడ్డి, హెచ్‌ఎం షేక్ ఖాదరున్నీసాబేగం, అంగన్‌వాడీ సూపర్ వైజర్ దేవాకృపావరం, తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు కమిటీలు ఏర్పాటు

పామూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) బాలల హక్కుల పరిరక్షణకు మండలస్థాయి అధికారులందరూ కమిటీగా ఏర్పడి బంగారు బాల్యం హక్కులను కాపాడాలని మండల ప్రత్యేకాధికారి బి.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామ పంచాయతీలో బాలల హక్కుల పరిరక్షణ కోసం కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ గంగసాని లక్ష్మి, తహసీల్దార్ రమణారావు, ఎంపీడీవో బి.సురేష్, ఎంఈవో కె.కరుణకుమారి పాల్గొన్నారు.

గిరిజన కాలనీలో..

కురిచేడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చదువుతోనే బంగారు భవిష్యత్తు ఉంటుందని తహసీల్దార్ రజనీకుమారి అన్నారు. సోమవారం మండలంలోని పడమర నాయుడుపాలెం పంచాయతీ పరిధిలోగల వల్లెల యానాది కాలనీలో బంగారు బాల్యం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు వస్రాం నాయక్, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలి

ముండ్లమూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు కన్న కలలను సాకారం చేయాలని మండల ప్రత్యేకాధికారి బి.రమణ అన్నారు. సోమవారం ముండ్లమూరు, ఉమామహేశ్వర అగ్రహారం, మారెళ్ళ, పోలవరం, పూరిమెట్ల, కెల్లంపల్లి, పసుపుగల్లు, నాయుడుపాలెం, ఈదర గ్రామాల్లో బంగారు బాల్యం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో ఆర్.జనార్దన్, ఎంఈవో ఎన్.సుబ్బారావు, కె.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



పామూరులో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు

దొనకొండలో.. దొనకొండ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): బంగారు బాల్యం భవితకు సోపానమని జిల్లా డిప్యూటీ సీఈవో పి.బాలమ్మ అన్నారు. బాలల హక్కులపై ప్రభుత్వం బంగారు బాల్యం కార్యక్రమం నిర్వహిస్తుందని చెప్పారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన బంగారు బాల్యం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి, తహసీల్దార్ బి.రమాదేవి, ఎంపీడీవో ఎం.శ్రీదేవి, ఎంఈవో సాంబశివరావు, వైద్యాధికారిణి డాక్టర్ సునీత తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

బాలల భవిష్యత్తు బంగారుమయం కావాలి

దర్శి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): బాలల భవిష్యత్తు బంగారు మయమయ్యేలా తీర్చిదిద్దాలని మండల ప్రత్యేకాధికారి రవికుమార్ సూచించారు. బంగారు బాల్యం కార్యక్రమంలో భాగంగా సోమవారం విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలపై లైంగిక దాడుల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణమూర్తి ఎంఈవో కె.రఘురామయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఆలయం నిర్మాణానికి రూ.3 లక్షల విరాళం

పామూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుకట్టకిందపల్లి నక్కలగండి ప్రాజెక్టు దగ్గర నిర్మిస్తున్న శ్రీగంగమ్మతల్లి దేవస్థానానికి ఏఎంసీ మాజీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ విన్నపం మేరకు వ్యాపారవేత్త వడ్లమూడి నాగేంద్ర రూ.3,01,116 విరాళాన్ని ప్రకటించారు. లక్ష్మీబాలాజీ స్టోన్‌క్రషర్ ఆవరణలో విరాళానికి సంబంధించిన బ్యాంక్ చెక్‌ను నిర్వాహకులకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చెనికల పెదమాలకొండయ్య, మాజీ సర్పంచ్ మానం గురవయ్య, బి.వెంకటేశ్వరరావు, ఎం.వెంగళరావు, పి. రమణయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు సామర్థ్య పరీక్షలు

పామూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీ రాష్ట్ర కార్యదర్శి ఆదేశాల మేరకు స్థానిక విద్యాలయంలో విద్యార్థినుల బేసిక్‌లెవల్ స్థాయిని గుర్తించడానికి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో జి.కరణకుమారి తెలిపారు. కేజీబీవీలో 6వ తరగతి నుంచి ఇంటర్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినుల స్థాయిని గుర్తించేందుకు ఈ పరీక్షలు దోహదపడతాయన్నారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కటకం సజన, అధ్యాపకులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక సోమవారం వేడుకలు

దర్శి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో కార్తీక సోమవారం వేడుకలు వైభవంగా జరిగాయి. స్థానిక శ్రీఅన్నపూర్ణ సమేతా కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ పరమేశ్వరులు భక్తుల పూజలందుకున్నారు. మహిళలు తెల్లవారుజామునే దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

పోతవరం, పొతకమూరు, కొర్లమడుగు గ్రామాల్లోని శివాలయాల్లో వైభవంగా వేడుకలు జరిగాయి.

బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

ముండ్లమూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో మద్యం బెల్టు షాపులు నిర్వహించినా, అందుకు ప్రోత్సహించినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ వై.రామారావు హెచ్చరించారు. సోమవారం సాయంత్రం స్థానిక పోలీసు స్టేషన్‌లో మద్యం షాపుల నిర్వాహకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బెల్టు షాపులు నిర్వహించ వద్దన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వై.నాగరాజు, ఏఎస్‌ఐ హనుమంతరావు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

వెలిగండ్ల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా ఉంటుందని ఆపార్టీ నియోజకవర్గ నాయకుడు శ్యామల కాశిరెడ్డి అన్నారు. మండలంలోని రాళ్ళపల్లి, గుడిపాటిపల్లి పంచాయతీల్లో సోమవారం సభ్యత్వ కార్యక్రమం చేపట్టారు ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వం తీసు కున్న వారికి రూ.5 లక్ష ప్రమాద బీమా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో కేలం ఇంద్రభూపాల్ రెడ్డి, మీనిగ కాశయ్య, కీసరి రమణారెడ్డి, సాన జయపాల్‌రెడ్డి, బర్నబాస్, ముక్కు వెంకటేశ్వరరెడ్డి, మనీషా, నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యోగయ్య స్వామి షష్టి

కురిచేడు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కురిచేడులో వేంచేసి ఉన్న యోగయ్య స్వామి మఠంలో సోమవారం సుబ్రహ్మణ్య షష్టి కార్యక్రమం వైభవంగా జరిగింది. నిర్మాణంలో ఉన్న ఆలయంలో యోగయ్య స్వామి చిత్రపటాన్ని ఉంచి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళా భక్తులు పొంగళ్ళు నైవేద్యంగా సమర్పించారు. రాత్రికి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు విద్యుత్ ప్రభ ఏర్పాటుచేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు

ప్రతిఒక్కరూ భక్తి భావాన్ని అలవర్చుకోవాలి

ముండ్లమూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ దైవభక్తిని పెంచుకోవాలని, అప్పుడే మంచి భావాలు కలిగి ఉంటారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని శంకరాపురంలో మేడికొండ శంకరరావు గురుస్వామి ఇంట్లో అయ్యప్ప స్వామి పడి భజన పూజా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన లక్ష్మి దంపతులు అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప స్వామి ఆశీస్సులు శంకరాపురం ప్రజలకే కాకుండా మండల ప్రజలందరికీ ఉండాలని వారు ఆకాంక్షించారు. అనంతరం లక్ష్మి, లలిత్‌సాగర్ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, సర్పంచ్ కూరపాటి మహేశ్వరి నారాయణస్వామి, మేడికొండ శంకరరావు, మండలపు తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

కనిగిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కనిగిరి పట్టణంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పీసీ కేశవరావు డిమాండ్ చేశారు. సోమవారం ర్యాలీగా మున్సిపల్ కార్యాలయం వద్దకు వెళ్లి ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కనిగిరి పట్టణంలోని ప్రధాన చెరువులైన పెద్దచెరువు, నాగులచెరువులను సమ్మర్ స్టోరేజి ట్యాంకులుగా మార్చటంతో పాటు ఇంటింటికి కుళాయిల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారన్నారు. ఆదిశగా చర్యలు చేపట్టా లన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ జోసఫ్ డానియేలుకు అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బషీరా, శాంతకుమారి, నరేంద్ర, పిచ్చయ్య, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

పొలాలకు వెళ్లేందుకు దారి ఏర్పాటుచేయాలి

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తమ పొలాలకు వెళ్లేందుకు దారిని ఏర్పాటుచేసి న్యాయం చేయాలని సర్పంచ్ ఎస్.రాధరుక్మిణమ్మ, జక్కా వెంకటేశ్వరరెడ్డి సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అంద జేశారు. మండంలోని అరివేముల రెవెన్యూ పరిధిలోగల దక్షిణం వైపున 137/2, 136/1, 136/2, 137/1 సర్వే నెంబర్లలో గ్రామస్థుల భూములు ఉన్నాయని వారు పేర్కొన్నారు. గుంటూరుకు చెందిన గమ్మడి కృష్ణకిషోర్ సర్వేనెంబర్ 135లో దాదాపు 43 ఎకరాల భూమిని కొనుగోలు చేశారని చెప్పారు. తమ భూము లకు వెళ్లేదారిని ఆక్రమించి అందులో ఎర్రచందనం చెట్లు వేశారని వినతిపత్రంలో పేర్కొన్నారు. సర్వే చేయించి దారి సౌకర్యం కల్పించాలని వారు కోరారు. కాగా, మండలంలోని గుంతచెన్నంపల్లిలో సర్వేనెంబర్ 234లో గల ఎస్సీ, ఎస్టీలకు చెందిన భూమిని ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సోమవారం ఎమ్మార్పీఎస్ నాయకులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

రక్తహీనతతో బాధపడుతున్న బాలికలు

తాళ్లూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం బాలికలు అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడతున్నారు. ప్రస్తుత సీజన్‌లో నిత్యం జ్వరాలు, జలుబు, తలనొప్పి, రక్తహీనత ఇతరత్రా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. సరైన వైద్యం అందక అనారోగ్యం పాలవుతూ రక్తహీనతతో బాధపడుతున్నారు. అనార్యోగం పాలైన బాలికలను కిలోమీటర్ దూరంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్యం కేంద్రానికి తీసుకువచ్చి మందులు ఇప్పించే పరిస్థితి కొనసాగుతున్నది. రమణాలవారిపాలెంతకు చెందిన జి.సైమన్ కుమార్తె మిర్యాని గత పది రోజలుగా అనారోగ్యంతో బాధ పడతున్నది. స్థానిక పిహెచ్‌సీకి తీసుకెళ్లి పరీక్షలు చేయించగా ఎలాంటి సమస్య లేదని చెప్పటంతో ఆబాలికను విద్యాలయంలోనే ఉంచారు. ఆబాలిక ఆరోగ్యపరిస్థితి మెరుగుపడలేదు. కుమార్తెను చూసే ందుకు సోమవారం విద్యాలయానికి వచ్చిన తండ్రి సైమన్ ఆమె ఆరోగ్యపరిస్థితి చూసి కలత చెందాడు. వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లి రక్త పరీక్ష చేయించగా హిమోగ్లోబిన్ నాలుగు గ్రాములు మాత్రమే ఉంది. సమయం గడిచే కొద్ది పరిస్థితి ఇ బ్బందికరంగా ఉంటుందని వైద్యులు సూచించారు. దీంతో బాలికను హుటాహుటీన ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఇటువంటి సమస్యలతో మరికొంత మంది బాలికలు బాధపడు తున్నట్టు సమాచారం.

బొద్దికూరపాడు చేపల వేలం పాట వాయిదా

తాళ్లూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొద్దికూరపాడు మైనర్ ఇరిగేషన్ చేరువు వేలంపాట వాయిదా పడింది. గ్రామ సచివాలయం వద్ద సోమవారం వేలం పాట వేయగా, ఎవరూ రాకపోవటంతో వాయిదా పడింది. చేపలవేలం పాట ప్రభుత్వ మద్దతు ధర రూ.14లక్షల 80వేలు ఉండటంతో ఎవరూ రాకపోవటంతో వాయిదాపడింది. దీంతో శుక్రవారానికి పాటను వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో కె.సుందరరామయ్య తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మందా శ్యాంసన్, ఉపసర్పంచ్ పులి ప్రసాద్‌రెడ్డి, గ్రామ కార్యదర్శి అల్లం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

నారాయణస్వామిని దర్శించుకున్న దేవదాయశాఖ అధికారి



నారాయణస్వామిని దర్శించుకొన్న దేవదాయశాఖ అధికారి పానకాలరావు

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం మిట్టపాలెం శ్రీనారాయణస్వామిని సోమవారం దేవదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఎం.పానకాలరావు దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి సత్కరించారు. అనంతరం ఉచిత అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, కొమ్మినేని వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

మహిళను మోసగించిన కేసులో మూడు నెలల జైలు

పీసిపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నకిలీ బంగారం విక్రయించి మహిళను మోసగించిన కేసులో ఇద్దరికి కనిగిరి జ్యుడిషియల్ కోర్టు న్యాయాధికారి కె.భరత్‌చంద్ర మూడునెలలు జైలు శిక్ష విధిస్తూ సోమవారం తీర్పు ఇచ్చారు. 2016 ఆగస్టులో మండలంలోని వెంగళాయపల్లి గ్రామానికి చెందిన వరమ్మ అనే మహిళ తన ఇంటి బయట బట్టలు ఇస్త్రీ చేసుకుంటుండగా కోట మ్మ, పోలయ్య అనే ఇద్దరు తేనె అమ్ముతామని మాటలు కలిపారు. మరుసటి రోజు తేనె తీసుకొచ్చి ఇచ్చారు. ఈసందర్భంగా తమ వద్ద ఉన్న బంగారాన్ని లక్ష రూపాయలకే ఇస్తామని నమ్మబలికారు. వారి మాటలు నమ్మిన ఆమె తన దగ్గర ఉన్న రూ.30 వేలు ఇచ్చింది. మరుసటి రోజు కోటమ్మ, పోలయ్యలు వర మ్మ దగ్గరకు వచ్చి ఒక రేకును ఇచ్చి మూడు సంవత్సరాల తరువాత నగలు చేయించుకోమని వెళ్ళిపోయారు. ఆతరువాత ఆమె కుమారుడు సదరు డబ్బులు ఏమయ్యాయని ప్రశ్నించారు. తాను తక్కువ ధరకు బంగారం కొన్నానని మోస గాళ్ళు ఇచ్చిన రేకును చూపించింది. కనిగిరిలోని బంగారు దుకాణంలో రేకు నా ణ్యతను పరిశీలింరగా, నకిలీదని తేలింది. దీంతో మోసపోయానని గ్రహించిన వరమ్మ పీసీపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్‌ఐ డి.రామ కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నెల్లూరు జిల్లా జెండాతిప్పకు చెందిన కోటమ్మ, పోలయ్యలను అరెస్టుచేసి కోర్టుకు హాజరుపరచారు. ఎనిమిదేళ్ళ విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో సోమవారం న్యాయాధికారి భరత్‌చంద్ర 3నెలల జైలు శిక్షతోపాటు రూ.250 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలు

కనిగిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలుశిక్షతో పాటు రూ.3 లక్షలు జరిమానా విధిస్తూ కనిగిరి జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి భరతచంద్ర సోమవారం తీర్పు ఇచ్చారు. హనుమంతునిపాడు మండలం మహమ్మదాపురం హైస్కూల్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మైలా కిషోర్‌కుమార్ వెంగనగుంట గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి నుంచి రూ.3 లక్షలు అప్పుగా తీసుకుని చెక్కు ఇచ్చారు. ఆతర్వాత సుబ్బారెడ్డి బ్యాంకులో వేయగా చెక్కు బౌన్స్ అయింది. మూడేళ్ళుగా విచారణ జరిగి నేరం రుజువైనందున మైలా కిషోర్‌కుమార్‌కు న్యాయాధికారి భరత్‌చంద్ర ఏడాది పాటు జైలుశిక్ష, రూ3లక్షలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



బాపట్ల జిల్లా వార్తలు

5

మంగళవారం 19 నవంబరు 2024



కోటప్పకొండ ప్రాంతంలో వరి పొలం



ధాన్యం ధర పతనం

- పది రోజుల్లో బస్తాకు రూ. 400 తగ్గించేశారు
- చోద్యం చూస్తున్న పౌరసరఫరాల శాఖ
- కొనుగోలు కేంద్రాల ఊసెత్తని వైనం
- ఉమ్మడి జిల్లాలో 4.49 లక్షల ఎకరాల్లో వరి సాగు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) ఖరీఫ్‌లో అన్నదాతలు విస్తృతంగా వరి సాగు చేశారు. దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. వరి నూర్పిడులు ప్రారంభమయ్యాయి. తెనాలి ప్రాంతం, పల్నాడు జిల్లాలోని నకరికల్లు, ఈపూరు, రాజుపాలెం మండలాల్లో వరి నూర్పిడులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎకరాకు 30 నుంచి 40 బస్తాలు (75కిలోలు) ధాన్యం దిగుబడి వస్తోందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే ధాన్యం చేతికొచ్చే సమయానికి ధర తగ్గిపోతుండటంతో అన్నదాతలు ఆవేదనకు లోనవుతున్నారు. వ్యాపారులు ఒక్కసారిగా ధరను తగ్గించి వేశారు. పది రోజుల వ్యవధిలోనే బస్తా కు రూ 400 వరకు ధర తగ్గించారు. మద్దతు ధర కన్నా కూడా బస్తాకు రూ 300 నుంచి రూ 400 వరకు మార్కెట్‌లో ధర తక్కువగా ఉండడం గమనార్హం. రైతుకు ధాన్యం వచ్చే సమయంలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుకు మద్దతు ధర వచ్చేలా చేయాలి. కానీ పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలో ఎక్కడా కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదు. గత ఏడాది సాగు నీటి కరువుతో రైతులు వరి సాగును కోల్పోయారు. ఈ ఏడాది సకాలంలో సాగు నీటి సరఫరా చేయడంతో వరి సాగుకు రైతులు మొగ్గు చూపారు. సాగర్ అయకట్టులో

(మిగతా 6వ పేజీలో..)

కలగానే.. కనీస వేతనం


పదిహేనేళ్ల క్రితం నిర్ణయించిన కనీస వేతనమే ఈరోజుకూ కష్టజీవులకు అమలవుతోందంటే నమ్మగలరా? రాష్ట్రంలో అక్షరాలా అదే జరుగుతోంది. ఎప్పుడో 2010లో నిర్ణయించిన కనీస వేతనాలే కష్టజీవులు, అసంఘటితరంగ కార్మికులకు అమలవుతోంది. ఎప్పుడో 2017కి ముందే జరగవలసిన కనీస వేతన సవరణ ఇప్పటికీ జరగకపోవడంతో కష్టజీవులు, అసంఘటితరంగ కార్మికులు తీవ్ర శ్రమ దోపిడీకి గురవుతున్నారు. ఈ ఏడున్నరేళ్లలో నిత్యావసర సరుకులు, సేవల ధరలు 200 శాతానికి మించి పెరిగి, కార్మికుల జీవన వ్యయం అనేక రెట్లు పెరిగింది. అయినప్పటికీ కార్మికుల వేతనాలు మాత్రం పెంపుదలకు నోచుకోలేదు.

- వేతన మెరుగుదల కోసం కష్టజీవుల ఎదురు చూపులు
- ఇప్పటికీ పదమూడేళ్లనాటి కనీస వేతనమే దిక్కు
- గత ప్రభుత్వ హయాంలో సలహాబోర్డు ఏర్పాటు
- 2018లోనే రాష్ట్రమంతటా సలహాబోర్డు చైర్మన్
- ప్రభుత్వం మారడంతో సిఫార్సులు బుట్టదాఖలు
- జిల్లాలో 17 లక్షల మంది కష్టజీవులకు అన్యాయం

గుంటూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): 2014 తరువాత కనీస వేతన సవరణ లేకపోవడంతో కార్మికులు ఆందోళనలు చేపట్టారు. దీంతో అప్పటి టీడీపీ ప్రభుత్వం 2018లో వేతన సవరణపై కసరత్తు ప్రారంభించింది. పెరుగుతున్న ధరలు, జీవన ప్రమాణాల ఆధారంగా వేతన సవరణకు సంబంధించి నివేదికను సిద్ధం చేయాలని సలహాబోర్డును ఆదేశించింది. వేతన సలహా మండలి చైర్మన్ రామ్మోహన్‌రావు నేతృత్వంలోని బృందం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పర్యటన నిర్వహించి కార్మికులు, కార్మిక సంఘాలతో సమావేశాలు నిర్వహించింది. ఈ సందర్భంగా కనీస వేతనాన్ని 21 వేలుగా నిర్ణయించాలని కార్మిక సంఘాలన్నీ ముక్తకంఠంతో నినదించాయి. దీంతోపాటు కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను, కార్మికుల డిమాండ్లను నమోదు చేసి సలహా సంఘం వేతన సవరణపై నివేదికను సిద్ధం చేసింది. సరిగ్గా అదే సమయంలో ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో మొత్తం ప్రక్రియ (మిగతా 6వ పేజీలో..)

పైసలిస్తేనే.. పీఎఫ్ రుణం

పల్నాడు జిల్లా ఫిరంగిపురం మండలంలో పనిచేసే ఓ ఉపాధ్యాయుడు రూ. 5లక్షల రుణం కావాలని జిల్లా పరిషత్ (జడ్పీ) పీఎఫ్ కార్యాలయానికి దరఖాస్తు చేసుకున్నాడు. వాస్తవంగా నెలలోపు రుణం మంజూరు కావాలి....అయితే డిప్యూటీ సిఎం వద్ద పనిచేసే ప్రత్యేక అధికారి జోక్యంతోనే రుణం మంజూరు అయింది... బాపట్ల ప్రాంతానికి చెందిన మరొక ఉపాధ్యాయుడు కుమార్తె వివాహం కోసం రుణం కావాలని దరఖాస్తు చేశాడు... దరఖాస్తు చేసి నెలలు గడుస్తున్నా రుణం మాత్రం మంజూరు కాలేదు. జడ్పీ సిబ్బంది పెట్టే కొర్రీలకు ఆయన విసుగెత్తిపోయి చివరకు అంతో ఇంతో ముట్టజెప్పి రుణం పొందాల్సిన దుస్థితి.. మరొక ఉపాధ్యాయుడు రిటైర్‌మెంట్ బెనిఫిట్ కోసం చేసిన దరఖాస్తుకు ఇప్పటి వరక అతీగతి లేదు. చివరకు ఉపాధ్యాయుల డెత్ క్లయిమ్ దరఖాస్తులు క్లియర్ చేయడానికి పర్సంటేజీలు లేనిదే పనికావడం లేదని ఉపాధ్యాయ సంఘాలు ధ్వజమెత్తుతున్నాయి. ఇలా ఆరునెలల్లో దాదాపు రూ. 100 కోట్లు క్లయిమ్‌లకు జడ్పీ సిబ్బంది కొర్రీలు వేసి వెనక్కి పంపారని వారు ఆగ్రహం వెలిబుచ్చుతున్నారు.



- మంజూరులో జడ్పీ సిబ్బంది కాసులు వేట
- మెడికల్ సర్టిఫికెట్స్ పేరుతో బేరాలు
- ఆరు నెలల్లో రూ.100కోట్లుపైగా చెల్లింపులకు కొర్రీలు

గుంటూరు(విద్య),నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో స్థానిక సంస్థల యాజమాన్యాల్లో(జడ్పీ, మండల పరిషత్) పనిచేసే ఉపాధ్యాయులు దాదాపు 10వేల మందికిపైగా ఉన్నారు. ఆయా ఉపాధ్యాయులు తమ జీతం నుంచి కొంత మొత్తం జడ్పీ పీఎఫ్ అకౌంట్‌లో జమచేస్తారు. ఇందులో రూ.5వేల నుంచి రూ.25వేల వరకు ఉపాధ్యాయులు తాము తీసుకుంటున్న జీతాల ఆధారంగా ఈ మొత్తం జమచేస్తారు. ఈ మొత్తాల నుంచి అవసరమైన వారు రుణాలు తీసుకుంటారు. ఉపాధ్యాయుల పిల్లల వివాహాలు, ఉన్నత చదువులు కోసం, ఇంటి నిర్మాణం కోసం, వైద్య బిల్లులు చెల్లింపులు ఇతరత్రా ఆర్థిక అవసరాల కోసం రుణాలు తీసుకుంటారు. జడ్పీ పీఎఫ్ అకౌంట్‌లో ఉన్న తమ డబ్బునే వారు రుణాల రూపంలో తీసుకుంటారు. అయితే ఈ రుణాలు చెల్లింపుకు జడ్పీలో ఈ అండ్ ఎఫ్ విభాగాలు కీలకంగా పనిచేస్తాయి. ప్రాథమిక (మిగతా 6వ పేజీలో..)

'అసైన్డ్' అక్రమార్కులపై గురి...!

- గత ప్రభుత్వంలో భారీగా భూ అక్రమాలు
- యాజమాన్య హక్కు పేరిట దందా
- నేతల అండతో ఇష్టారాజ్యంగా పేదల భూముల చెర
- జిల్లా వ్యాప్తంగా 650 ఫిర్యాదులు!
- ప్రభుత్వం చేతిలో సమగ్ర నివేదిక

(బాపట్ల, ఆంధ్రజ్యోతి) అసెంబ్లీ సమావేశాలు వేదికగా అసైన్డ్ భూములలో అక్రమాలకు పాల్పడిన వారిని వదిలిపెట్టేది లేదని ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసిన సంగతి తెలిసిందే. భూ అక్రమాలకు పాల్పడిన వారి ఆట కట్టించేందుకు చట్టాలకు కూడా పదును పెట్టి అమల్లోకి తెస్తున్నారు. ప్రభుత్వం దగ్గర ఉన్న సమాచారం ఆధారంగా త్వర లోనే అసైన్డ్ దొంగలపై చర్యలకు దిగే అవ కాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. టీడీపీ కేంద్ర కార్యాలయంలో నేతలు నిర్వహించిన ప్రజా దర్బార్‌కు జిల్లా వ్యాప్తంగా అసైన్డ్ అక్రమా లకు సంబంధించి 650 ఫిర్యాదులు అంది నట్లు తెలుస్తోంది. వీటితో పాటు జిల్లా యంత్రాంగం దాదాపు రెండు నెలల పాటు కసరత్తు చేసి నివేదికను ప్రభుత్వానికి అందించింది. వీటిలో అసైన్డ్‌కు సంబంధించి జరిగిన అవకతవకలతో పాటు, వాటి లావాదేవీలపై కూడా నివేదికలో పొందుపర్చారు. ఇప్పటికే ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ నిలిపేసిన కూటమి

యాజమాన్య హక్కుల ముసుగులో....

2003కు ముందు ప్రభుత్వం దగ్గర నుంచి భూమి పొందిన పేదలు దానిపై యాజమాన్య హక్కు పొందే విధంగా గత పాలకులు అసైన్డ్ చట్టానికి సవరణ చేసిన సంగతి తెలిసిందే. ఈ ముసుగులోనే వైసీపీ నేతాగణంతో పాటు అనుచరులు భారీగా అసైన్డ్ అక్రమాలకు తెరలేపినట్లు ప్రభుత్వానికి నివేది కలు చేరాయి. ఇదే కాక అసైన్డ్ భూములపై క్రయవి క్రయాలు నిషేదమని చట్టం చెబుతున్నప్పటికీ దానికి తూట్లు పొడిచే విధంగా ఇష్టారాజ్యంగా గత ప్రభుత్వంలో వ్యవహ రించారని ఆ వివరాలను కూడా సమగ్రంగా ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో పొందుపర్చారు. యాజమాన్యహక్కు పేరుతో జిల్లా వ్యాప్తంగా 3,804 ఎకరాలను ఫ్రీహోల్డ్‌చేసినట్లు అధికారులు గుర్తించారు.



పందిళ్లపల్లి సమీపంలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూమి

ఇష్టారీతిన క్రయవిక్రయాలు....

అసైన్డ్ భూముల ఫ్రీహోల్డ్ పేరిట అక్రమాలు ఓ ఎత్తయితే వాటి క్రయవిక్రయాలు కూడా యథేచ్ఛగా గత ప్రభుత్వంలో జరిగాయి. ఈ క్రమంలో అసైన్డ్ భూమినే ఓ దాత విరాళంగా ఇచ్చినట్లు ప్రకటించ డంతో పాటు ఆయనకు ఏకంగా అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డితో సన్మానం కూడా చేయించడం అసైన్డ్ అక్రమాలకు పరాకాష్టగా నిలిచింది. అసైన్డ్ భూములకు కంచెలాగా కాపలా కాయాల్సిన ప్రభుత్వ ఉద్యోగులే అసైన్డ్ భూములను సిండికేట్‌గా కొనుగోలు చేయడం, వీరి చర్యలకు అప్పటి పాలకులు వంత పాడడం చట్టాలంటే లెక్కలేని తనానికి నిదర్శనంగా నిలిచింది.

ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా జరిగిన అసైన్డ్ రిజిస్ట్రేషన్‌లపై కూడా కొరడా ఝుళిపించే అవకాశం ఉన్నట్లు సమాచారం. దీనితో అధికా రం అండగా గత ప్రభుత్వంలో రెచ్చిపోయిన భూబకాసురుల వెన్నులో వణుకు మొదలైంది. ప్రభుత్వం అన్ని వైపుల నుంచి విచారణ పూర్తి చేసిన తర్వాతనే చర్యలకు దిగనుంది

రెవెన్యూ యంత్రాంగం తీవ్ర కసరత్తు....

కూటమి ప్రభుత్వం కొలువుదీరిన దగ్గర నుంచి గత ప్రభుత్వంలో జరిగిన భూ అక్రమాలపై సీరియస్‌గా దృష్టి సారించి నివేదికలు అందించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించిన సంగతి తెలిసిందే. మధ్యలో తహసీల్దార్ల బదిలీలతో కొంతమేర ఈ ప్రక్రియకు జాప్యం జరిగినప్పటికీ తర్వాత వేగం అందుకోవడంతో దాదాపు రెండు నెలల కసరత్తు అనంతరం నివేదికను యంత్రాంగం ప్రభుత్వానికి అందించింది. వైసీపీ ప్రభుత్వం తెచ్చిన అసైన్డ్ చట్ట సవరణ ద్వారా 3,804 ఎకరాలకు యాజమాన్య హక్కులు కల్పించారు. వీటన్నింటిపై క్షేత్రస్థాయిలో రీవెరిఫికేషన్‌ను రెవెన్యూ సిబ్బంది చేపట్టారు. దీనితో పాటు ఫ్రీహోల్డ్ చేసిన అసైన్డ్ భూములలో ఎన్ని ఎకరాలు రిజిస్ట్రేషన్ జరిగాయనే అంశంపై కూడా దృష్టిసారించి విచారణ చేపట్టారు. ఫ్రీహోల్డ్ చేయించు కున్నవాటిలో దాదాపు 300 ఎకరాల వరకు ఒరిజినల్ అసైనీ కాకుండా వేరే వ్యక్తి సదరు భూమిమీద ఉన్నట్లు అధికారుల పరిశీలనలో తేలింది. 75 ఎకరాల వరకు అసైన్డ్ భూమి రిజిస్ట్రేషన్ జరిగినట్లు తేల్చారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గతంలోనే ఈ భూముల రిజిస్ట్రేషన్ నిలుపుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ వివరాలకు తోడు ప్రజాదర్బార్‌లో వచ్చిన 650 ఫిర్యాదులపై కూడా క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నివేదికను ప్రభుత్వానికి అందించారు

ప్రభుత్వానికి ల్యాండ్ బ్యాంకుగా....

పారిశ్రామికంగా జిల్లాలను పురోగమింప చేయడానికి కూటమి పాలకులు ల్యాండ్ బ్యాంకుపై దృష్టి పెట్టిన సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించి ఇప్పటికే జిల్లా అధికారులకు ప్రభుత్వ భూములను గుర్తించమని అదేశాలను కూడా జారీ చేసింది. బాపట్ల, చీరాల పరిధిలో దాదాపు 70,000 ఎకరాల వరకు ప్రభు త్వ భూమి ఉండగా, ఇందులో గడచిన మూడు దశా బ్దాల కాలంలో పేదలకు అసైన్డ్ చేసింది 45,000 ఎక రాల వరకు ఉంది. మిగిలిన దానిలో దాదాపు 20,000 ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైనట్లు రికా ర్డులు ధ్రువీకరిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అసైన్డ్ అక్రమాలపై ఉక్కుపాదం మోపాలనే కృత నిశ్చయానికి తోడు ల్యాండ్ గ్రాబింగ్ చట్టాన్ని పటిష్టం చేసే విధం గా కొన్ని సవరణలకు కూడా అసెంబ్లీ ఆమోద ముద్ర వేసిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాలన్నీ అసైన్డ్ అక్రమార్కుల్లో వణుకు పుట్టించే విధంగా ఉన్నాయి.

రీ సర్వేపై 4,115 ఫిర్యాదులు

- క్షేత్రస్థాయిలో విచారణ....
- నోటీసులు జారీ
- డిసెంబరు నెలాఖరుకు ప్రక్రియ పూర్తి

(బాపట్ల, ఆంధ్రజ్యోతి) గత ప్రభుత్వం చేపట్టిన రీసర్వే ప్రక్రియలో జరిగిన అవకతవకలను సరిదిద్దడానికి కూటమి ప్రభుత్వం ఆయా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించిన సంగతి తెలిసిందే. జిల్లా వ్యాప్తంగా రీసర్వే పూర్తయిన 71 గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది గ్రామసభలు నిర్వహించి ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించారు. ఈ ప్రక్రియ ముగిసి వారం కావడంతో వచ్చిన అర్జీల పరిష్కారంపై యంత్రాంగం దృష్టిసారించింది. రీసర్వేలో వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించేటప్పుడు మార్గదర్శకాలను పాటించే విషయంపై ఇప్పటికే పలుమార్లు సిబ్బందికి జిల్లా కలెక్టరేట్ వేదికగా శిక్షణ ఇచ్చారు. వచ్చిన అర్జీలకు సంబంధించి క్షేత్రస్థాయిలో నోటీసులు జారీ చేసే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభం కాగా డిసెంబరు చివరికల్లా ఈ అభ్యంతరాలను ఒక కొలిక్కి తెచ్చే విధంగా యంత్రాంగం గడువు విధించుకుని పనిచేస్తోంది

మొత్తం 4,115 అర్జీలు...

71 గ్రామాల పరిధిలో మొత్తం 4,115 అర్జీలు రాగా ఇందులో రీసర్వే ఘట్టానికి సంబంధించి 3,224 వినతులు రాగా, రెవెన్యూ సంబంధమైనవి 891గా యంత్రాంగం లెక్క తేల్చింది. వీటిల్లో తొలుత రీసర్వేకు వినతులపై అధికారులు దృష్టిసారించారు. ఫిర్యాదులో తెలిపిన ప్రకారం ఇద్దరికీ తొలుత నోటీసులు జారీ చేయడం, తర్వాత క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి ఆ అర్జీని ఇద్దరికి ఆమోదయోగ్యంగా ఉంటే పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టడం చేసే విధంగా కసరత్తు చేస్తున్నారు. ఇలా కాకుండా ఉద్దేశపూర్వకంగా ఉన్న కొన్ని వివాదాల విషయంలో కూడా చట్టపరంగా నిర్ణయం తీసుకుని ఆ సమస్యను ముగించే దిశగా యంత్రాంగం అడుగులేస్తోంది. ఇప్పటికీ మొత్తం 480 అర్జీలను పరిష్కరించినట్లు అధికారులు చెబుతున్నారు.

వివిధ అంశాలపై...

గ్రామ సభల్లో వచ్చిన అర్జీల్లో ఎక్కువ శాతం విస్తీర్ణంతో పాటు జాయింట్ ఎల్‌పీఎంలే ఉండడం గమనార్హం. రీసర్వేలో తన పొలం విస్తీర్ణం తక్కువ చేసి చూపెట్టారనే అర్జీలే 1611 వరకు రావడం గమనార్హం. ఇక జాయింట్ ఎల్‌పీఎంలకు సంబంధించి 1585మిగిలినవి ఇతర కేటగిరీల్లో ఉన్నాయి. క్షేత్రస్థాయి విచారణతో అవసరం లేకుండా ఆన్‌లైన్ వేదికగా పరిష్కరించే రెవెన్యూ పరమైన వినతులు కూడా భారీగానే వచ్చాయి. వీటిలో వెబ్‌ల్యాండ్‌కు సంబంధించి 476, పేర్లుమార్పుకు 270. ఆధార్ సంబంధమైన సమస్యలు 43, ఇతరత్రా అభ్యంతరాలు 113 వరకు గ్రామసభల్లో రెవెన్యూ సిబ్బందికి అందాయి

యంత్రాంగంపైనా... నేతల పాత్రపైనా...

రీసర్వే జరిగిన గ్రామాల్లో దాదాపు 150 వరకు ఫిర్యాదులు అప్పుడు విధులు నిర్వహించిన రెవెన్యూ సిబ్బందితో పాటు స్థానికంగా ఉన్న వైసీపీనేతలపైనా రావడం గమనార్హం. ఈ అర్జీలపై క్షేత్రస్థాయిలో విచారణ పూర్తయిన తర్వాత అప్పుడు విధుల్లో ఉన్న సిబ్బంది తప్పు ఉందని తేలితే అదే విషయాన్ని ప్రభుత్వానికి నివేదిస్తామని అధికారులు చెబుతున్నారు.



ఎమ్మెల్యే ఏలూరికి విజనరీ లీడర్ అవార్డు

- లండన్ బ్రిటీష్ పార్లమెంట్ వేదికగా ప్రదానం



పర్చూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు 2024 విజనరీ లీడర్ అవార్డ్ లభించింది. బ్రిటీష్ పార్లమెంట్ లండన్ వేదికగా ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ హానస్ ఇంగ్లాండ్ ఈ అవార్డు ప్రకటించింది. లండన్ పార్లమెంట్ వేదికగా అక్కడ అతిరథ మహారథుల సమక్షంలో అంతర్జాతీయ పురస్కారం ఇవ్వనున్నట్లు సోమవారం తెలిపింది. అసెంబ్లీ సమావేశాల దృష్ట్యా ఏలూరి లండన్ వెళ్లలేకపోయారు. ఆయన తరఫున యూకే ఎన్‌ఆర్‌ఐ, టీడీపీ వ్యవహారాల నేత గోపాల్ అవార్డును అందుకున్నారు. నిరంతరం ప్రజల కోసం కృషి చేస్తున్నందుకు ఈ పురస్కారాన్ని అందిస్తున్నట్లు ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ హానస్ ఇంగ్లాండ్ పేర్కొంది. సోమవారం ఆయనకు సీఎం చంద్రబాబు ఫోన్‌లో అభినందనలు తెలిపారు.



పర్చూరు బొమ్మల సెంటర్‌లో సంబరాలు చేస్తున్న ప్రజా కూటమి ప్రతినిధులు

- గతంలోనూ జాతీయ పురస్కారం

2020లో ఏమ్మెల్యే ఏలూరి దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన జాతీయ ఆదర్శ యువ ఎమ్మెల్యే అవార్డును అందుకున్నారు. మీట్ వరల్డ్ పీస్ యూనివర్సిటీ భారత స్టూడెంట్ పార్లమెంట్ సంస్థలు సంయుక్త ఆధ్వర్యంలో ఢిల్లీలో రాజపథ్ మౌలానా అజాద్ రోడ్డులోని విజ్ఞాన్ భవన్‌లో అందుకున్నారు. ఎమ్మెల్యే ఏలూరికి అంతర్జాతీయ పురస్కారం లభించడం పట్ల సోమవారం పర్చూరులో ప్రజా కూటమి నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. ఏలూరి చిత్రపటానికి పాలాభిషేకం చేసి తమ అభిమానం చాటుకున్నారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు.

ఆక్రమణ ఎంత

- సర్వే చేస్తే నిజాలు వెలుగులోకి
- కబ్జా చెర నుంచి రూ.కోట్లు విలువచేసే ప్రభుత్వ భూమికి విముక్తి
- క్రమబద్ధీకరిస్తారా.. కట్టడి చేస్తారా?

వేటపాలెం(చీరాల), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండలం వాడరేవు నుంచి వేటపాలెం మండలం పొట్టిసుబ్బయ్యపాలెం వరకు తీరప్రాంత రోడ్డుకు ఒక వైపు పలుచోట్ల ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురైంది. కొన్ని రిసార్టుల వద్ద, పలు లేఅవుట్ల వద్ద వారి సొంత స్థలాలతో పాటు కొంత ప్రభుత్వ భూమిని ఆక్రమించారు. మరికొంత అసైన్డ్ భూములను కలుపుకున్నారు. ఈ నేపథ్యంలో రెవెన్యూశాఖ పూర్తి స్థాయిలో సర్వే నిర్వహిస్తే ఏ మేరకు ప్రభుత్వ భూమి కబ్జాకు గురైనదీ.. ఏ మేరకు అసైన్డ్ భూములను కలుపుకున్నారన్నదీ వెలుగులోకి వస్తుంది. ఆక్రమంలో వాటిని క్రమబద్ధీకరిస్తారా లేదా కట్టడి చేస్తారా అనేది అటుచించితే ముందు ప్రభుత్వ భూమిని కాపాడినవారు అవుతారు. అసైన్డ్ భూములు కూడా వెలుగులోకి వస్తాయి. వాటిలో ఉన్న నిర్మాణాలు అక్రమమా, సక్రమమా అనే అంశాలు కూడా బహిర్గతం అవుతాయి.

ఇదే సరైన సమయం

ప్రస్తుతం చీరాల మండలం వాడరేవు నుంచి వేటపాలెం మండలం పొట్టిసుబ్బయ్యపాలెం వరకు రూ.8కోట్ల అంచనా వ్యయంతో తీర ప్రాంత రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించారు. ఇది శుభపరిణామం. పర్యాటకుల రాకపోకలకు మరింత సౌకర్యవంతంగా ఉంటుంది. అయితే రోడ్డుకు ఒక వైపు అటవీ భూములు, సముద్రం ఉంటాయి. మరో వైపు కొంతమేర ప్రభుత్వ భూమి కొంత, అసైన్డ్ భూమి, పట్టా భూమి ఇంకొంత ఉంటుంది. పలు చోట్ల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురయ్యింది. ఇది బహిరంగ రహస్యం. ప్రస్తుతం రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో రెవెన్యూశాఖ పరంగా వాడరేవు నుంచి పొట్టిసుబ్బయ్యపాలెం వరకు పక్కాగా భూమి సర్వే నిర్వహిస్తే పెద్ద మొత్తంలో ప్రభుత్వ భూమిని ఆక్రమణల చెర నుంచి విడిపించవచ్చని చెప్తున్నారు. అందుకు ఇదే సరైన సమయని ఆ ప్రాంత ప్రజలు సూచిస్తున్నారు. దీంతో పాటు అసైన్డ్ వివరాలు వెలుగులోకి వస్తాయి. ఆక్రమణలు, నిబంధనల అతిక్రమణలను కట్టడి చేయవచ్చు. లేదంటే క్రమబద్ధీకరించవచ్చు. తద్వారా ప్రభుత్వ ఖజానాకు భా రీగా ఆదాయం సమకూరుతుంది. అందుకు ముందుగా సర్వే చేయించి ఆక్రమణలను తొలగించేందుకు తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఆ దిశగా పాలకులు, అధికారులు స్పందిస్తారని ఆశిద్దాం.



తీరంలో రోడ్డు విస్తరణకు జరుపుతున్న పనులు

బాలుర కుటుంబాలకు న్యాయం చేయాలి

దళిత సంఘాల డిమాండ్

ప్రకాశం భవన్ వద్ద ఆందోళన

కన్నీటి వీడ్కోలు



ఆందోళన చేస్తున్న మృతుని కుటుంబసభ్యులు

ఒంగోలు(క్రైం), నవంబరు18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కొప్పోలు అంబేడ్కర్ నగర్‌కు చెందిన రేష్మంత్, వికాస్, విశాల్ అలియాస్ అశ్వనీకుమార్‌లకు సోమవారం కన్నీటి వీడ్కోలు పలికారు. రిమ్స్‌లో పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కొప్పోలులోని శ్మశానవాటికకు తరలించారు. అంతకుముందు మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని ప్రకాశం భవన్ వద్ద కుటుంబసభ్యులు, దళిత సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా డీఆర్వో ఓబులేష్ మృతుల కుటుంబాలు, దళిత నాయకులతో చర్చించారు. మృతుల కుటుంబాలకు పదిలక్షలు ఎక్స్‌గ్రేసియో ఇవ్వాలని, వికాస్, విశాల్ తల్లి బాలకోటేశ్వరికి ఉద్యోగం ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఆయా డిమాండ్‌లు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తానని డీఆర్వో వారికి హామీ ఇచ్చారు. దీంతో అక్కడ నుంచి కొప్పోలు శ్మశాన వాటికకు మృతదేహాలను తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గురు బాలుర ఫొటోలతో ఉయ్ మిస్ యూ అంటు ప్లకార్డులు చేబూని యువకులు వీడ్కోలు పలికారు. ఈ ర్యాలీలో పెద్దసంఖ్యలో మృతుల బంధువులు, స్నేహితులు కొప్పోలు వాసులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎస్పీ

రిమ్స్ వద్ద పోస్టుమార్టం నిర్వహిస్తుండగా బాధిత కుటుంబాలతో ఎస్పీ ఏఆర్ దామోదర్, ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు లు మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. అదే విధంగా ఎస్పీ మాట్లాడుతు తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని హితవు పలికారు. ఇటీవల మైనర్లు సరదా కోసం వాహనాలు నడుపుతు ప్రమాదాల బారిన పడుతున్నారని అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ ప్రమాదంపై సమగ్ర విచారణ చేసి న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. వారి వెంట ఎస్బీ డీఎస్పీ రాఘవేంద్రరావు, తాలుకా సీఐ అజయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

డ్వామా ఏవో బాపట్లకు డీఎల్‌డీవోగా బదిలీ

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లానీటి యాజమాన్య సంస్థ(డ్వామా) అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సీహెచ్ విజయలక్ష్మిని బాపట్లజిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ శశికాంత్ భూషణ్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. బాపట్ల జిల్లా డీఎల్‌డీవోగా విజయలక్ష్మిని నియమించారు. రాష్ట్రవ్యాప్తంగా 18మంది అధికారులను బదిలీలుచేయగా ఆ బదిలీల్లో విజయలక్ష్మి ఉన్నారు.

చెల్లని చెక్కు కేసులో జైలు

కనిగిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలుశిక్షతో పాటు రూ.3 లక్షలు జరిమానా విధిస్తూ కనిగిరి జూనియర్ సివిల్‌కోర్టు న్యాయాధికారి సోమవారం తీర్పు ఇచ్చారు. హనుమంతునిపాడు మండలం మహమ్మదాపురం హైస్కూల్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న షైలా కిషోర్‌కుమార్ వెంగనగుంట గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి నుంచి రూ.3 లక్షలు అప్పుగా తీసుకుని చెక్కు ఇచ్చారు. ఆతర్వాత సుబ్బారెడ్డి బ్యాంకులో వేయగా చెక్కు బౌన్స్ అయింది. మూడేళ్ళుగా విచారణ జరిగి నేరం రుజువైనందున షైలా కిషోర్‌కుమార్‌కు న్యాయాధికారి భరత్‌చంద్ర ఏడాదిపాటు జైలుశిక్ష, రూ3లక్షలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు

ముండ్లమూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో మద్యం బెల్టు షాపులు నిర్వహించినా, అందుకు ప్రోత్సహించినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ వై.రామారావు హెచ్చరించారు. సోమవారం సాయంత్రం స్థానిక పోలీసు స్టేషన్‌లో మద్యం షాపుల నిర్వాహకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బెల్టు షాపులు నిర్వహించవద్దన్నారు.

ఆఫీస్‌లో అంతర్యుద్ధం

అద్దంకి మండల అభివృద్ధి అధికారి ఆదేశాలను డోంట్ కేర్ అంటున్న అవుట్‌సోర్సింగ్ సిబ్బంది

- వారికి ఒత్తాసుగా నిలుస్తున్న పంచాయతీ కార్యదర్శులు
- అభివృద్ధి పనుల విషయంలో ఎంపీడీవో ముక్కుసూటితనమే కారణమా?



అద్దంకి ఎంపీడీవో కార్యాలయం



అద్దంకి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి ఎంపీడీవో కార్యాలయంలో వార్ నడుస్తోంది. మండల అధికారి ఆదేశాలను డోంట్ కేర్ అన్న విధంగా అవుట్ సోర్సింగ్ సిబ్బంది వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తుండగా, కార్యాలయ పని వేళలలోనే కాకుండా అదనపు సమయంలో కూడా విధులు నిర్వహించాలని ఎంపీడీవో ఒత్తిడి తెస్తున్నారని అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఆరోపిస్తూ అధికారపార్టీ నేతల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. అద్దంకి ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న సింగయ్యకు కార్యాలయంలో పనిచేసే అవుట్ సోర్సింగ్ సిబ్బంది(కంప్యూటర్ ఆపరేటర్లు)కి మధ్య పొసగడంలేదు. విధులకు సకాలంలో హాజరుకావాలని, అత్యవసరమైన పనులను వెంటనే పూర్తి చేయాలని ఆపరేటర్లను ఆదేశిస్తుంటే విధులు సక్రమంగా నిర్వహించకుండా జాగు చేస్తున్నారని ఎంపీడీవో వ్యాఖ్యానిస్తున్నారు. అధికారుల ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరించాల్సిన అవుట్ సోర్సింగ్ సిబ్బంది తమ కనుసన్నల్లోనే అధికారులు నడవాలి అన్న విధంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. తాము లోకల్ కాబట్టి తాము చెప్పిందే వేదమన్నట్లుగా సిబ్బంది వ్యవహార తీరు సాగుతోందని వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి.

రెండు వర్గాలుగా విడిపోయిన సిబ్బంది

ఎంపీడీవో సింగయ్య ముక్కుసూటితత్వంగా ఉండడం, పంచాయతీ నిధులు వినియోగానికి సంబంధించి బిల్లులు చూసేది అవుట్ సోర్సింగ్ సిబ్బందే కావడంతో పంచాయతీల కార్యదర్శులు పలువురు అవుట్ సోర్సింగ్ సిబ్బందికి ఒత్తాసుగా నిలుస్తుండడంతో వ్యవహారం ముదురుపాకాన పడినట్లు తెలుస్తోంది. దీంతో కార్యాలయ సిబ్బంది కూడా రెండు వర్గాలుగా విడిపోయి మరింత ఆజ్యం పోస్తున్నట్లు సమాచారం. ఈ విషయాలను ఎవరికి వారే టీడీపీ నేతల ద్వారా మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకుపోయేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితి కొనసాగితే మండలంలో జరిగే అభివృద్ధి పనులకు ఆటంకం కలగడంతో పాటు పరువు బజారున పడే అవకాశం లేకపోలేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చొరవతీసుకొని సమస్యకు ఫుల్‌స్టాప్ పెట్టాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో సింగయ్యను వివరణ కోరగా కంప్యూటర్ ఆపరేటర్లుగా ఉన్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది విధులకు సక్రమంగా రాకపోతుండడంతో ఇప్పటికే పలుమార్లు చెప్పానన్నారు.

కలగానే.. కనీస వేతనం

(తరువాయి....)

అంతా ఆగిపోయింది. బుట్టదాఖలు చేసిన ప్రస్తుత ప్రభుత్వం

2019 ఎన్నికల్లో నెగ్గిన వైసీపీ అధికారం చేపట్టడంతో కనీస వేతన సవరణకు ముసలం వచ్చింది. కనీస వేతన సలహాబోర్డు నివేదికను బుట్టదాఖలు చేసింది. ఆ తరువాత పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన బర్రె లీలను వేతన సవరణ బోర్డుకు చైర్మన్ చేసినప్పటికీ వేతన సవరణ ప్రక్రియ ఊసెత్తిన దాఖలాలు కూడా లేవు. మాటమాత్రంగానైనా వేతన సవరణ లేకుండా గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలాన్ని నెట్టేసింది. రాష్ట్రంలో కనీస వేతన సవరణ సలహా బోర్డు ఉనికిలో ఉందా లేదా అన్నంతగా ఈ బోర్డు సుప్త చేతనావస్థలోకి వెళ్లిపోయింది.

17 లక్షల మంది ఎదురు చూపులు

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో దాదాపు 17 లక్షల మంది అసంఘటితరంగ కార్మికులు ఉన్నారు. వీరంతా వ్యవసాయం, అనుబంధరంగాల్లో దిన కూలీలుగా, నిర్మాణ కార్మికులుగా, సున్నం, ఇటుక బట్టీల్లో, షాపింగ్ కాంప్లెక్సులు, దుకాణాలు, ప్రైవేటు కంపెనీల్లో, ఆసుపత్రుల్లో పనిచేస్తూ ఉన్నారు. ఎలాంటి చట్టపరమైన భద్రత, వేతన భరోసా లేని వీరికి అన్యాయం జరగకుండా, పెరుగుతున్న నిత్యావసర ధరలు, జీవన ప్రమాణాలు, జీవన వ్యయాల పెరుగుదలను అధ్యయనం చేసి, కార్మికులతో చర్చించి తదనుగుణంగా ప్రభుత్వానికి సిఫార్సులు చేసేందుకు వేతన సవరణ సలహా బోర్డును ఏర్పాటు చేశారు. వేతన సవరణ సలహా బోర్డు ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇస్తుంటుంది. కాగా ఏడున్నరేళ్లుగా ఈ ప్రక్రియ పూర్తిగా అటకెక్కింది.

నిద్రావస్థలో కార్మిక శాఖ

కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన కార్మిక శాఖ నిద్రావస్థలో మునిగిపోయింది. కార్మికులకు కనీస వేతనం దక్కక శ్రమదోపిడీకి గురవుతున్నా కార్మికశాఖ ఎంతమాత్రం పట్టించుకోవడం లేదు. కార్మికుల తరుపున వేతన సవరణ బోర్డుకు సమస్యను నివేదించడంగానీ, అధికారులపై ఒత్తిడి తేవడంగానీ చేయడం లేదు. కనీసం ప్రభుత్వాల ప్రకటనలను, చట్టాలను కూడా కార్మికుల దృష్టికి తీసుకువెళ్లడం లేదు. వేతన సవరణ బోర్డు నిర్లక్ష్యం, కార్మిక శాఖ నిస్తేజం జిల్లాలో 17 లక్షల మంది అసంఘటితరంగ కార్మికులకు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారు. ఇప్పటికీ గతంలో నిర్ణయించిన రూ. 14 వేలే అధికారిక కనీస వేతనంగా కొనసాగుతుండడంతో వారికి శ్రమ ఫలితం దక్కడం లేదు. కాగా కూటమి ప్రభుత్వం రాకతో మళ్లీ కార్మికుల్లో వేతన సవరణ ఆశలు ఊపిరిపోసుకున్నాయి. 2018లో కూటమి ప్రభుత్వంలో సిద్ధం చేసిన నివేదిక ఆధారంగా, ఏడేళ్లలో జరిగిన మార్పులను దృష్టిలోవుంచుకుని కనీస వేతన సవరణ చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

కేంద్ర ప్రభుత్వం సవరణ?

తాజాగా కేంద్ర ప్రభుత్వం కార్మికుల కనీస వేతనాన్ని సవరించినట్లు వార్తలు ప్రముఖంగా వచ్చాయి. తాజా సవరణ ప్రకారం నిర్మాణం, స్వీపింగ్, క్లీనింగ్, లోడింగ్, అన్‌లోడింగ్‌లో పనిచేసే నైపుణ్యంలేని కార్మికులకు కనీస వేతనం రోజుకు రూ. 783, నెలకు రూ. 20,358, సెమీ స్కిల్డ్ కార్మికులకు రోజుకు రూ. 868, నెలకు రూ. 22,568, నైపుణ్యం కలిగిన క్లరికల్, నిరాయుధ వాచ్‌మెన్‌కు రోజుకు రూ. 954, నెలకు రూ.24,804కు పెంచినట్లు కేంద్ర కార్మిక కమిషనర్ వెబ్‌సైట్లో సమాచారం ఉంచారు.

అయితే ఇది ఎక్కడా అమలు కావడం లేదు. దీనిపై కార్మికుల్లో కూడా అవగాహన లేదు. కనీస వేతన నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వాలు చేతుల్లో వుండడంతో వారంతా కనీస వేతన సవరణ చేయాలని పెద్దఎత్తున డిమాండ్ చేస్తున్నారు.

పైసలిస్తేనే.. పీఎఫ్ రుణం

(తరువాయి...)

పాఠశాలల ఉపాధ్యాయుల రుణాలు ఈ విభాగంలో, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయుల రుణాలు ఎఫ్ విభాగం పర్యవేక్షిస్తుంది. ఇందులో పనిచేసే సిబ్బంది రుణాలు కోసం వచ్చిన దరఖాస్తుల్ని నిబంధనల ప్రకారం క్లియర్ చేయాల్సి ఉండగా కొర్రిలు పెట్టి పక్కపడేస్తున్నారని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయులు రూ. 5లక్షలు మంచి రుణం కోసం దరఖాస్తు చేసే సివిల్ అసిసెంట్ సర్జన్ నుంచి మెడికల్ సర్టిఫికెట్ తీసుకురావాలని నిబంధన పెట్టారు. ఈసర్టిఫికెట్ రుణం కోసం చేసిన దరఖాస్తుకు జత చేయకపోవడం వల్ల మీ రుణం ప్రాసెస్ చేయడం లేదని కొంతమంది సిబ్బంది ఉపాధ్యాయులకు ఫొన్లు చేసి చెబుతున్నారు. ఉపాధ్యాయులు హడావుడిగా కార్యాలయానికి వెళ్తే అక్కడ పర్సంటేజీలు మాట్లాడుకుని బేరాలకు దిగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

- జడ్పీలో పనిచేసే ఓ ద్వితీయ శ్రేణి అధికారిపేరుతో పీఎఫ్ రుణాల పర్సంటేజీల దందా సాగుతున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. ఆయన పేరు చెప్పి సిబ్బంది ఉపాధ్యాయుల నుంచి పర్సంటేజీల వారీగా అందినకాడికి దండుకుంటున్నారు.
- ఉపాధ్యాయులు మరణిస్తే ఆయన తాలుక వచ్చే బెనిఫిట్స్ కోసం కుటుంబ సభ్యులతో జడ్పీ సిబ్బంది బేరాలు ఆడుతున్నారు. డెత్‌క్లయిమ్ క్లియర్ చేసి వచ్చే మొత్తాలు వారసులు తీసుకోవాలంటే రూ. 5వేల నుంచి రూ. 10వేల వరకు పర్సంటేజీలు ఇవ్వాల్సి వస్తోందనే ఆరోపణలు ఉపాధ్యాయ కుటుంబాల నుంచి వస్తున్నాయి.
- జడ్పీలో ఉపాధ్యాయులు పీఎఫ్ అకౌంట్లు అప్‌డేట్ చేయడం లేదు. ఫలితంగా తాము జీతం నుంచి చెల్లించిన డబ్బు పక్కదారి పడుతుందేమనని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనేక సాంకేతిక సమస్యలున్నా వెబ్‌సైట్‌ను అప్‌డేట్ చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.
- పీఎఫ్ సొమ్ము మంజూరులో సిబ్బంది చేస్తున్న తప్పిదాలను 11 పాయింట్స్‌గా గుర్తించి గతనెల 10న ఉపాధ్యాయ సంఘాలు జడ్పీ సీఈవోకు అందజేశారు. అయితే ఆయా తప్పిదాలకు సంబంధించి ఇంత వరకు పరిష్కారం చూపలేదు. ఇలా తాము దాచుకున్న సొమ్మును ఆర్థిక అవసరాల కోసం ఉపయోగించుకోవాలంటే పర్సంటేజీలు చెల్లించాల్సిన దుస్థితి వస్తోందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఇప్పటికైనా సమస్యలపై అధికారులు దృష్టిపెట్టాలని లేకుంటే సమస్యను సంఘాల ద్వారా విద్యామంత్రి దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేస్తున్నారు.

ధాన్యం ధర పతనం

(తరువాయి...)

కాలువల చివరి భూముల్లో గత నెలలో వరి నాట్లు పూర్తయ్యాయి. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 4.49 లక్షల ఎకరాల్లో వరి సాగైనట్టు వ్యవసాయ శాఖ ప్రకటించింది. గత ఏడాది కంటే వరి సాగు గణనీంగా పెరిగింది. పల్నాడు జిల్లాలో 87,740 ఎకరాల్లో వరి సాగు చేశారు. బాపట్ల జిల్లాలో 2,20,903 ఎకరాలు, గుంటూరు జిల్లాలో 1,40,935 ఎకరాల్లో వరి సాగయింది. సగటున ఎకరాకు 30 బస్తాలు అంటే 22.50 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. అన్ని ప్రాంతాల్లో ఈ నెలాఖరుకు ముమ్మరంగా వరి నూర్పిడిలు జరగనున్నాయి.



ధాన్యం రైతుల ఇంటికి చేరే సమయానికి వ్యాపారులు ధరలు తగ్గించివేస్తున్నారు. 10 రోజులు క్రితం వరకు సన్నాలు రకం ధాన్యం 75 కిలోల బస్తా ధర రూ 1,800 ఉంది. ప్రస్తుత ం ధరను రూ. 1,600లకు తగ్గించివేశారు. బీపీటీ రకం ధాన్యం ధర దారుణంగా ఉంది. ఈ రకం బస్తా ధాన్యం పల్నాడు జిల్లాలో రూ. 1,300 కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెనాలి ప్రాంతంలో బీపీటీ బస్తా ధాన్యం రూ. 1,440 వ్యాపారులు కొనుగోలు చేశారని రైతులు తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర మార్కెట్‌లో రైతులు దక్కడంలేదు. క్వింటా ధాన్యంకు రూ 2,320 మద్దతు ధర ఉంది. అంటే 75 కిలోల బస్తాకు మద్దతు ధర రూ 1,740. మార్కెట్‌లో మద్దతు ధర లభించపోతుండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నకరికల్లు మండలం నరసింగపాడు.., త్రిపురాపురం, రాజుపాలెం మండలం నెమలిపూరి, తెనాలి ప్రాంతాల్లో ముమ్మరంగా వరి నూర్పిడులు జరగుతున్నాయి. మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. నేటి వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో మార్కెట్‌లో ధాన్యం అమ్ముకొని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. బీపీటి ధాన్యం మద్దతు ధర కన్నా బస్తాకు రూ 440కు తక్కువగా వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. తెలంగాణకు ధాన్యం ఎగుమతులు లేని కారణంగా ధర తగ్గిందని వ్యాపారులు చెబుతున్నారు. ధర పతనం అయిన సమయంలో పౌర సరఫరా శాఖ రంగంలోకి దిగి రైతులను ఆదుకోవాల్సి ఉంది. ఈ ప్రయత్నాలు జరగుతున్న దాఖలాలు లేవు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఊసే ఎత్తడంలేదు. నేటి వరకు ఒక్క కేంద్రం కూడా ప్రారంభం కాలేదంటే రైతులు పట్ల నిర్లక్ష్య వైఖరిని తెలియజేస్తోంది. ఇంకా ధాన్యం రాలేదన్న వాదనను అధికారులు వినిపిస్తున్నారు. తెనాలి ప్రాంతంలో గత రెండు రోజుల్లో వ్యాపారులు దాదాపు 10 లారీల ధాన్యం కొనుగోలు చేశారు. పల్నాడు జిల్లాలో కూడా కొనుగోళ్లు జరగుతున్నాయి. ఇవేవి పౌర సరఫరాల శాఖకు కనిపించకపోవడం గమనార్హం. గిట్టు బాటు ధర మాట ఎలా ఉన్నా కనీసం మద్దతు ధర లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

పరిశుభ్రత లేకపోతే రెస్టారెంట్‌లను సీజ్ చేస్తాం

- శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్‌రసూల్



బిర్యాని పాయింట్‌లోని వంటగదిని పరిశీలిస్తున్న శానిటేషన్ అధికారి

కనిగిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రెస్టారెంట్‌ల్లో వంటగదులతో పాటు సిట్టింగ్ ఏరియాల్లో పరిశుభ్రత లేకపోతే కేసు నమోదు చేసి సీజ్ చేస్తామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్‌రసూల్ అన్నారు. కమిషనర్ ఆదేశాల మేరకు సోమవారం పట్టణంలో రెస్టారెంట్లు, హోటళ్లను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రెస్టారెంట్‌లలో మాంసాహారాన్ని ఫ్రిజ్‌లలో నిల్వ ఉంచి ఆహారాన్ని తయారు చేస్తున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయన్నారు. ఆహారాన్ని వడ్డించే సమయంలో వేడి చేసి ఇవ్వటంతో భుజించిన వారు అనారోగ్యాల పాలయ్యే అవకాశం ఉందన్నారు. రెస్టారెంట్‌లలో వంటగదులు, ఆహారాన్ని అందించే పాత్రలు, వంట సరుకులను ఆయన పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతివారం తనిఖీ చేస్తామని చెప్పారు. తీగెలగొంది, వైఎస్సార్ రోడ్డులలో ఉండే రెస్టారెంట్‌లలో శుభ్రత లేకపోవటంతోపాటు టేస్టింగ్‌సాల్ట్ వాడకంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

చేపల వేలం పాట వాయిదా

తాళ్లూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొద్దికూరపాడు మైనర్ ఇరిగేషన్ చెరువు వేలం పాట వాయిదా పడింది. గ్రామ సచివాలయం వద్ద సోమవారం వేలం పాట వేయగా, ఎవరూ రాకపోవటంతో వాయిదా పడింది. చేపలవేలం పాట ప్రభుత్వ మద్దతు ధర రూ.14లక్షల 80వేలు ఉండటంతో ఎవరూ రాకపోవటంతో వాయిదాపడింది. దీంతో శుక్రవారానికి పాటను వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో కె.సుందరరామయ్య తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మందా శ్యాంసన్, ఉపసర్పంచ్ ప్రసాద్‌రెడ్డిపాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఎంపీపీకి గాయాలు

దొనకొండ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో దొనకొండ ఎంపీపీకి స్వల్ప గాయాలయ్యాయి.ఈఘటన దొనకొండ బ్రహ్మరావుపేటలోని ఆంజనేయస్వామి గుడి వద్ద సోమవారం చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. ఎంపీపీ బొరిగొర్ల ఉష, ఆమె భర్త ఉపాధ్యాయుడు మురళీ కారులో త్రిపురాంతకం వెళ్లి వస్తున్నారు. బ్రహ్మరావుపేట సమీపంలోకి వచ్చేసరికి కారు అదుపుతప్పి ఆంజనేయస్వామి దేవాలయం ప్రహరీని ఢీకొట్టింది. కారు బెలూన్లు ఓపెన్ కావటంతో ఎంపీపీకి స్వల్ప గాయాలయ్యాయి.

అవీఇవీ

నిరుపేదలకు నివేశన స్థలాలు

కలెక్టర్ ఆదేశాలపై కదలిన యంత్రాంగం



మాట్లాడుతున్న అధికారులు

చీరాలటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలకు నివేశన స్థలాలు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు పేర్కొన్నారు. కలెక్టర్ వెంకటమురళి ఆదేశాల మేరకు సోమవారం చీరాల పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో రహదారులపై విక్రయాలతో జీవిస్తున్న వారితో తహసీల్దార్ గోపీకృష్ణ, కమిషనర్ అబ్దుల్ రషీద్‌తో కలిసి మాట్లాడారు. స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మించేందుకు సహకరిస్తామని వివరించారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. ఎన్ని కటుంబాలు స్థానికంగా ఉంటున్నాయో వివరాలు నమోదు చేసుకున్నారు. వారి వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల చాంపియన్ కడప

- రన్నరప్‌గా నిలిచిన తూర్పుగోదావరి జట్టు



రన్నరప్ నిలిచిన తూర్పు గోదావరి జిల్లా క్రీడాకారులు

కందుకూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బాలబాలికల తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలో కడప జిల్లా క్రీడాకారులు ప్రథమస్థానం, రన్నరప్‌గా తూర్పు గోదావరి జిల్లా క్రీడాకారులు దక్కించుకున్నారు. తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి షేక్ అబ్దుల్ సలాం ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలకు వివిధ జిల్లాల నుంచి 350మందికి పైగా వచ్చారు. పోటీలు ఆసక్తికరంగా జరిగాయి. పోటీల అనంతరం ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన బహుమతి ప్రదానోత్సవానికి కందుకూరు సీఐ వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం అబ్దుల్‌సలాం మాట్లాడుతూ ఈ పోటీలో గెలుపొందిన క్రీడాకారులు ఈ నెల 28 నుంచి డిసెంబరు 2వరకు హర్యానాలో జరుగనున్న జాతీయస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి యల్‌టీ చంద్రమౌళి, జిల్లా అధ్యక్షుడు ఉన్నం వీరాస్వామి, కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య, టెక్నికల్ డైరక్టర్ విజయ్‌శ్రీనివాస్, బీఆర్ ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల ఛైర్మన్ ఉన్నం భాస్కరరావు, గోనుగుంట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

26లోపు పది పరీక్ష ఫీజు చెల్లించాలి

ఒంగోలు విద్య, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వచ్చే ఏడాది మార్చి, ఏప్రిల్ నెలలో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫీజును ఈనెల 26వతేదీలోపు ఎలాటి అపరాధరుసుం లేకుండా చెల్లించవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 50 అపరాధ రుసుంతో వచ్చేనెల 2వతేదీ వరకు, రూ. 200 అపరాధ రుసుంతో వచ్చేనెల 9వతేదీ వరకు,రూ. 500 అపరాధరుసుంతో వచ్చేనెల 16వతేదీలోపుచెల్లించాలన్నారు. రెగ్యులర్ విద్యార్థులు రూ. 125, మూడు సబ్జెక్టులకు పైగా ఉంటే రూ. 125, మూడు సబ్జెక్టుల లోపు ఉంటే రూ.110, ఒకేషనల్ విద్యార్థులు అదనంగా రూ. 60, వయస్సు మినహాయింపు కోసం రూ. 300 చెల్లించాలన్నారు. మైగ్రేషన్ సర్టిఫికెట్ అవసరమైన విద్యార్థులు రూ. 80 సీఎఫ్‌ఎంఎస్ చలానా ద్వారా మాత్రమే చెల్లించాలని ఆయన కోరారు.

నేడు, రేపు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

ఒంగోలు విద్య, నవంబరు 18 : జిల్లాలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి నవంబరు నెల స్కూలు కాంప్లెక్స్ సమావేశాలు మంగళ, బుధవారాల్లో నిర్దేశించిన స్కూలు కాంప్లెక్స్ కేంద్రాల్లో జరుగుతాయని జిల్లా విద్యాశాఖాధికారి ఎ. కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపాఅరు. మంగళవారం కాంప్లెక్స్ పరిధిలోని 50 శాతం మంది ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, తెలుగు, మ్యాథ్స్, బయాలజీ టీచర్లు, నియోజకవర్గ స్థాయిలో పీఈటీ/పీడీలకు స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరుగుతుందన్నారు. బుధవారం మిగిలిన 50శాతం ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, హిందీ,ఇంగ్లీషు, పీఎస్, సోషల్ సబ్జెక్టు వారు హాజరు కావాలన్నారు. ఉదయం 9నుంచి సాయంత్రం 4.20 వరకు ఈ సమావేశాలు జరుగుతాయన్నారు. అజెండా ప్రకారం సమావేశాలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

విద్యార్థులను మలిచే బాధ్యత గురువులదే

ఒంగోలు విద్య నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థిలో కొంత ప్రతిభ దాగి ఉంటుందని, దానిని వెలికి తీసి సరైన మార్గంలో నడపాల్సిన బాధ్యత గురువులదని జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ అన్నారు. స్థానిక బండ్లమిట్టలోని బాలికోన్నత పాఠశాలలో ప్రారంభమైన కెరీర్ ఎడ్యుకేషన్ 8వ తరగతి శిక్షణలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థి ఒక శిలలాంటి వారని, వారిలో దాగి ఉన్న నైపుణ్యాన్ని బయటకు తీసి గొప్ప శిల్పంగా మార్చాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో రమేష్, కెరీర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం సీఈవో రాక్వెల్ షరాఫ్, పాఠశాల హెచ్ఎం కృష్ణకుమారి, అనూష తదితరులు ఉన్నారు.

కలగా మిగిలిన అలుగుపై వంతెన నిర్మాణం

ఇబ్బంది పడుతున్న కొండమూరు గ్రామస్థులు

పంగులూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండమూరు గ్రామ సాగు నీటి చెరువు అలుగుపై వంతెన నిర్మాణం కలగానే మిగిలింది. దీర్ఘకాలంగా చెరువు అలుగుపై వంతెన నిర్మించాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు. గ్రామానికి కూత వేటు దూరంలో ఉన్న ఇంకొల్లు, అద్దంకి ప్రధాన రహదారికి ఉత్తరం వైపున కొండమూరు వాసుల పంట పొలాలున్నాయి. రైతులు తమ పంట పొలాలకు వెళ్లేందుకు నిత్యం ఈ అలుగు దాటాల్సిన పరిస్థితి. రైతులు చెరువు నీటిని పంట సాగుకు వినియోగిస్తారు. వర్షాలు అధికంగా కురిసిన సందర్భంలో అలుగు నీటి ప్రవాహం అధికంగా ఉండి రాకపోకలు సాగించ లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీటి ప్రవాహం అధికంగా ఉన్న సమయంలో అలుగు దాటే ప్రయత్నంలో కొందరు ప్రాణాలు పోగొట్టుకున్నారు. నిత్యం పశువులు తోలుకుని పొలాలకు చేరుకునే పశు కాపరులు, పొలం పనుల నిమత్తం రాకపోకలు సాగించే రైతులు, వ్యవసాయ కూలీలు అలుగు నీటిని దాటి వెళ్లడం కష్టంగా ఉందని ఆందోళన చెందుతున్నారు. గ్రామస్థులు ఇతర ప్రాంతాలకు ప్రయాణం సాగించేందుకు ఆర్టీసీ బస్సు ఎక్కేందుకు కూతవేటు దూరంలో ఉన్న ఇంకొల్లు, అద్దంకి ఆర్‌అండ్‌బీ రహదారిని ఆశ్రయిస్తుంటారు. గ్రామ ప్రజలు తమ కార్యకలాపాల కోసం రాకపోకలు సాగించేందుకు వీలుగా అలుగుపై వంతెన నిర్మాణం చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.



వంతెనకు నోచుకోని కొండమూరు అలుగు


వాహనంలో పరిమితికి మించి వెళ్తున్న కూలీలు

కూలీల వలసబాట

» గ్రామాల్లో మొదలుకాని ఉపాధి పనులు » పొట్ట కూటి కోసం వేల సంఖ్యలో పొరుగు జిల్లాలకు
» పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణం » పొంచి ఉన్న ప్రమాదాలు » ఉపాధి పనులు ప్రారంభంతోనే అడ్డుకట్ట

బల్లికురవ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్వగ్రామాలలో పనులు దొరక్క రోజువారీ కూలీలు పొరుగు జిల్లాకు వలసబాట పడుతున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని స్థితిలో ఉన్న కొన్ని నిరుపేద కుటుంబాలకు పనులు లేకుంటే పస్తులే. రోజూ కూలి పనులు వెతుక్కొని ఎక్కడుంటే అక్కడకు వెళ్లాల్సిన పరిస్థితి. గ్రామాల్లో కూలీలు వలసపోకుండా ఉపాధి హామీ పథకం పనులు ప్రారంభించాల్సి ఉన్నా ఇంత వరకు చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. దీంతో కూలీలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ఒక్కో వాహనంలో పదుల సంఖ్యలో ఎక్కి గుంటూరు, పల్నాడు జిల్లాలోని పలు గ్రామాలకు పనుల వలస వెళ్తున్నారు.

బల్లికురవ మండలంలో 21 పంచాయతీలలో సుమారు 60వేలమంది జనాభా ఉన్నారు. ఇక్కడ గ్రామాలలో ప్రధానంగా వరి, మొక్కజొన్న పంటలు ఎక్కువగా సాగు అవుతుంది. మెట్ట పంట అయిన మొక్కజొన్న రైతులు చేపట్టిన సరిపడా పనులు పెద్దగా లేవు. కూలీలకు పనులు చాలీచాలని విధంగా ఉన్నాయి, ప్రతిఏటా ఉపాధి హామీ పథకం పనులు గ్రామాలలో మొదలయ్యేవి. దీంతో కూలీలకు అంత ఇబ్బంది ఉండేది కాదు ఈ ఏడాది పనులు లేకపోవడంతో పల్నాడు జిల్లాలోని పలు గ్రామాలకు మిర్చి కోతలకు, పత్తి తీతకు వెళ్తున్నారు. రోజువారీ సరాసరి సుమారు 30 వాహనాలలో 3వేల పైచిలుకు కూలీలు వలస పోతున్నారు, అంబడిపూడి, వల్లాపల్లి, గుంటుపల్లి, బల్లికురవ, వైదన, చెన్నుపల్లి, ముక్తేశ్వరం, కొప్పెరపాడు, కొణిదెన, మల్లాయపాలెం, కొత్తపాలెం, నక్కబొక్కలపాడు, ఎస్ఎల్ గుడిపాడు, వెలమవారిపాలెం, కొణిదెన, గంగపాలెం, ఉప్పుమాగులూరు, రాజుపాలెం తదితర గ్రామాల నుంచి కూలీలు ప్రతి రోజు లగేజి వాహనాల్లో పదుల సంఖ్యలో వెళ్తున్నారు. ఉదయం 7 గంటల నుంచి కూలీల వాహనాలతో రోడ్లు రద్దీగా కన్పిస్తున్నాయి. వీరు వెళ్లే వాహనాల్లో తగిన జాగ్రత్తలు లేవు. ఒక్కో ఆటోలో వేలాడుతూ కూలీలు పనులకు వెళతున్నారు. ప్రమాదం కదా అని అడిగితే పనులకు వెళ్లాలంటే ఇది తప్పదని చెప్తున్నారు. మిర్చి, పత్తి తీసేందుకు ఒక్కో కూలికి రవాణా చార్జీలు ఇచ్చి రూ.300 రైతులు చెల్లిస్తున్నారు. గ్రామాలలో పనులు దొరక్కపోతే ముున్ముందు కూలీల పరిస్థితి దయనీయంగా మారే అవకాశం కన్పిస్తుంది. ప్రభుత్వం, అధికారులు గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించి ఆదుకోవాలని కూలీలు కోరుతున్నారు.

మొదలుకాని ఉపాధి పనులు

బల్లికురవ మండలంలోని 21 గ్రామ పంచాయతీలలో ఉపాధి హామీ పథకం పనులు ఇంకా మొదలుకాలేదు. పనులు ప్రారంభిస్తే రోజుకు 5వేల మంది వరకు గ్రామాలలోనే పనులకు వస్తుంటారు. కొందరు కూలీలకు వంద రోజులు పనిదినాలు నిండిన వారు కూడా ఎక్కువ మంది ఉన్నారు. ప్రస్తుతం పనులు ప్రారంభించకపోవడంతో కూలీలు తీవ్ర అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడే పని కల్పిస్తే సుదూరప్రాంతాలు పనులకు వలస వెళ్లాల్సిన దుస్థితి తమకు ఉండదని వారు అంటున్నారు. మొక్కజొన్న పంట ఎక్కువ మెత్తంలో రైతులు సాగు చేస్తుండటంతో పనులు మందగించాయని కూలీలు తెలిపారు. క్షేత్రస్థాయిలో ఉపాధి సిబ్బంది సక్రమంగా పని చేయడం లేదని ఈ కారణంగానే ఎక్కువ మంది కూలీలు వలస పోతున్నారి పలువురు చెప్తున్నారు. గిట్టుబాటు కూలిని ఇచ్చి పనులు కల్పించాలని కోరుతున్నారు.

ఏపీవో పోస్టు ఖాళీ

గ్రామాలలో కూలీలకు పనులు కల్పించేలా మండల స్థాయిలో పర్యవేక్షించే ఏపీవో పోస్టు కొంతకాలంగా ఖాళీగా ఉంది. దీంతో గ్రామాలలో కూలీలకు పనులు అందించే చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. ఉన్న సిబ్బంది కూడా గ్రామాలలో తూతూ మంత్రంగా పనిచేస్తున్నారని కూలీలు ఆరోపిస్తున్నారు. రెగ్యులర్ ఏపీవో పోస్టును వెంటనే భర్తీ చేయాలని వారు కోరుతున్నారు.

వలస అంచున ప్రమాదం

రోజూ పనులకు వలస వెళ్తున్న కూలీలకు ప్రమాదాలు పొంచి ఉన్నాయి. వాహనాలలో పరిమితికి మించి కూలీలు ఎక్కుతున్నారు. ఒక్కో ఆటోలో అయితే పదుల సంఖ్యలో ప్రయాణం చేస్తున్నారు. గతంలో కూడా కూలీల ఆటోలకు ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. పొట్ట కూటి కోసం వలస వెళ్లే కూలీలకు ప్రమాదాలు పొంచి ఉన్నాయి అని తెలిసి కూడా వారు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని పనులకు వెళ్లి వస్తున్నారు. పోలీసు శాఖ కూలీలకు వారిని తీసుకెళ్లే ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించాల్సి ఉంది. ఉన్న ఊళ్లోనే పనులు కల్పిస్తే వలస తిప్పలు తప్పుతాయి.


పనుల కోసం పొరుగు జిల్లాలకు ఆటోలో వెళ్తున్న కూలీలు


ఇందిరాకాలనీలో రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి

అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శివప్రసాద్

పర్చూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను తప్పక పాటించాలని క్యూఆర్ క్యూసీ (క్వాలిటీ కంట్రోల్) అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శివప్రసాద్ అన్నారు. సోమవారం ఇందిరా కాలనీ, అంబేద్కర్ కాలనీలతో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మిస్తున్న రోడ్లను పర్చూరు డివిజన్ క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరిశీలించారు. రోడ్డుకు ఉపయోగించిన నమూనాలను సేకరించారు. పర్చూరులో రూ.86లక్షల నిధులతో నిర్మాణం చేసిన ఆరు రోడ్లను అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ అధికారులు సురేష్, ఉస్సేన్‌రావ పాల్గొన్నారు.

హౌస్ హోల్డ్ సర్వేని పూర్తి చేయండి

పంగులూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర సమాచారం కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హౌస్‌హోల్డ్ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో స్వరూపారాణి కోరారు. గ్రామ కార్యదర్శులతో మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాలలో పారిశుధ్య పనులను చేపట్టాలని, ట్యాంక్ క్లీనింగ్‌తో పాటు నీటిని క్లోరినేషన్ చేయాలన్నారు. ఇంటి పన్ను నూరు శాతం వసూలు చేయాలని సూచించారు. సమావేశంలో ఈవోఆర్డీ కె.సుమంత్, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేరస్థులు సత్ప్రవర్తనతో మెలగాలి

చీరాలటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పాత నేరస్థులు సత్ప్రవర్తనతో మెలగాలని చీరాల తహసీల్దార్ గోపీకృష్ణ, ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్టేషన్ పరిధిలోని ఏడుగురు పాత నేరస్థులను ఎక్సైజ్ సిబ్బంది తహసీల్దార్ వద్ద ప్రవేశ పెట్టారు. ఈక్రమంలో తహసీల్దార్ వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. మార్పు చెందాలని సూచించారు. అలాగే అంతకుముందు ఎక్సైజ్ అధికారులు పట్టణంలో దాడులు నిర్వహించి వ్యక్తి వద్ద 12 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. అక్రమ విక్రయాలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎస్టీపీ ప్లాంట్‌ను నిలిపివేయాలి

చీరాలటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : చీరాల మునిసిపల్ పరిధిలో దండుబాట రోడ్డులో ఏర్పాటు చేయనున్న ఎస్టీపీ ప్లాంట్‌ను నిలిపివేయాలని సీపీఎం ప్రతినిధులు డిమాండ్ చేశారు. మురుగు నీటి శుద్ధి కేంద్రం జనావాసాల్లో, మంచినీటి చెరువు దగ్గరలో నిర్మాణం చేసేందుకు అధికారులు ప్రణాళిక చేయడం సరికాదని తెలిపారు.

దోమల పొగ పీల్చి అస్వస్థత

చికిత్స పొందుతూ యువకుడు మృతి

అద్దంకి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : దోమల పొగను పీల్చిన యువకుడు గండి చినబాబు(18) అస్వస్థకు గురై చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు అద్దంకి పట్టణంలోని గరటయ్యకాలనీకి చెందిన చినబాబు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నెల 10వ తేదీన మున్సిపల్ సిబ్బంది గరటయ్య కాలనీలో ఫాగింగ్ చేయగా ఆ పొగను పీల్చుకున్న చినబాబు అనారోగ్యానికి గురయ్యాడు. అద్దంకి, ఒంగోలు వైద్యశాలలో చికిత్స చేయించి గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. అక్కడ నుంచి వచ్చిన సమాచారం మేరకు అద్దంకి పోలీసులు కేసు నమోదు చేశారు.

అందరూ కలసిమెలసి ఉండాలి

డీఎస్పీ మహ్మద్ మొయిన్

వేటపాలెం(చీరాల), నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : గ్రామస్థులంతా ప్రశాంత వాతావరణంలో కలసిమెలసి ఉండాలని డీఎస్పీ మహ్మద్ మొయిన్ రామాపురం ప్రజలకు చెప్పారు. మత్స్యకార గ్రామమైన రామాపురంలో గతంలో రెండు వర్గాలు విడిపోయి కొట్లాటతో కేసుల పెట్టుకుని ఇబ్బంది పడుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి రూరల్ సీఐ శేషగిరిరావు, ఈపురుపాలెం ఎస్సై చంద్రశేఖర్‌లతో కలసి డీఎస్పీ రామాపురం గ్రామంలో గ్రూపులుగా ఇరు వర్గాలతో మాట్లాడారు. కొట్లాటలు, కవ్వింపు చర్యలతో జరిగే నష్టాన్ని వివరించారు. అందరూ కలసి ఉంటే ఒనగూరే ప్రయోజనాలను తెలిపారు. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా ఉండాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

కిడ్నాప్‌నకు పాల్పడిన వ్యక్తులు అరెస్ట్

చినగంజాం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కిడ్నాప్‌నకు పాల్పడిన వ్యక్తులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు చీరాల డీఎస్పీ మహ్మద్ మొయిన్ తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని మున్నంవారిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని బేతాళవారిపాలెం గ్రామానికి పిల్లి వెంకట కృష్ణారావు, హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ రియాజ్ ఫేస్‌బుక్ ద్వారా పరిచయం ఏర్పడి ఇద్దరూ ఫారెక్స్ నందు ఆన్‌లైన్ ట్రేడింగ్ చేస్తుంటారని తెలిపారు. ఇద్దరు అకౌంట్‌లోని లావాదేవీలను ఒకరినొకరు చూసుకుంటూ మార్కెట్ ఒడిదొడుకులు గురించి మట్లాడుకుంటూ ఉంటారని తెలిపారు. రియాజ్ తన అకౌంట్‌లోని సుమారు రూ.30లక్షల విలువలగల డాలర్ల లావాదేవీలను వెంకటకృష్ణారావు అకౌంట్‌లోనికి మార్చుకున్నారని, ఈ విషయం గురించి రియాజ్ వెంకటకృష్ణారావుని పలుమార్లు అడిగినా ఎలాంటి సమాధానం ఇవ్వకపోవడంతో, తన స్నేహితుడు ఆనందకుమార్‌కు చెప్పగా అతను తన స్నేహితులతో కలిసి వెంకటకృష్ణారావు గ్రామానికి వెళ్లి మాట్లాడి వస్తానని చెప్పి ఈ నెల 16వ తేదీ రాత్రి 11గంటల సమయంలో రెండు కార్లలో హైదరాబాద్ నుంచి బయలుదేరినట్లు తెలిపారు. ఈ నెల 17న ఉదయం 6గంటలకు రెండు కార్లలో వారు బేతాళవారిపాలెం గ్రామంలోని వెంకటకృష్ణారావు ఇంటికి వచ్చి రియాజ్ పంపించాడని, అతనికి రావాలసిన డబ్బులు ఇవ్వమని భయపెట్టి, బలవంతంగా అతని లాప్‌టాప్, సెల్‌ఫోను తీసుకొని, వారి కారులో ఎక్కించుకొని జాతీయరహదారి వైపు వెళ్లినట్లు తెలిపారు. కృష్ణారావు వరసకు బావమరిది అయిన బెజ్జం హరికృష్ణ చినగంజాం పోలీసుస్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి చీరాల డీఎస్పీ పర్యవేక్షణలో ఇంకొల్లు సీఐ వైవీ రమణయ్య, ఎస్ఐ శీలం రమేష్, ఏఎస్ఐ జి.శ్రీనివాసరావు, కానిస్టేబుల్ డి.శ్రీనివాసరావు టీమ్‌గా ఏర్పడి చినగంజాం టోల్‌ప్లాజ్ వద్ద కార్ల వివరాలను తెలుసుకున్నట్లు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానంతో కేసు దర్యాప్తు ప్రారంభించిన కొద్ది గంటలకే నిందితులు తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా బోడుప్పల్‌కు చెందిన గుర్రంఆనందకుమార్, కరణ్కోటి కల్కి, నాగం నరేందర్, శ్రీపాద కిరణ్‌కుమార్, రంగారెడ్డి జిల్లా ఉప్పల్‌కు చెందిన బొల్లారం ఉమేష్‌రెడ్డి, జేడ్డోజీ సాయికుమార్‌ను చినగంజాం టోల్‌ప్లాజా వద్ద ఆదివారం అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారి నుంచి రెండు కార్లను సీజ్ చేసి లాప్‌టాప్, స్మార్ట్ ఫోనును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రియాజ్‌ను కూడా అదుపులోనికి తీసుకొని విచారించనున్నట్లు తెలిపారు. వెంకటకృష్ణారావు కార్యకలాపాలను పరిశీలిస్తామని, పెట్టుబడులు ఉద్దేశపూర్వకంగా పెట్టిస్తున్నాడా, ఎవరినైనా మోసం చేస్తున్నాడా తదితర విషయాలపై ఆరా తీస్తామని తెలిపారు. చీరాల డీఎస్పీ మహమ్మద్ మొయిన్, ఇంకొల్లు సీఐ రమణయ్య, చినగంజాం ఎస్ఐ రమేష్, ఏఎస్ఐ జి.శ్రీనివాసరావు కానిస్టేబుల్ శ్రీనివాసరావు, హోంగార్డు నాగరాజును ఎస్పీ తుషార్ డూడీ అభినందించారు.


వివరాలను వెల్లడిస్తున్న చీరాల డీఎస్పీ మహమ్మద్ మొయిన్


మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

బాలల హక్కుల పరిరక్షణపై పర్యవేక్షణ

సంతమాగులూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : బాలబాలికల హక్కులకు భంగం వాటిల్లకుండా నిరంతరం పర్యవేక్షిస్తామని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి తెలిపారు. మండల కేంద్రమైన సంతమాగులూరు గ్రామంలో జడ్పీ ఉన్నత పాటశాలలో ఐసీడీఎస్ సీడీపీవో డి.సుధా అధ్యక్షతన 'బాలల హక్కుల వారోత్సవాలలో భాగంగా స్కూల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేయించారు. బాలల హక్కులు, చట్టాలు, బాల్య వివాహాల నిషేదంపై అవగాహన సమావేశం సోమవారం పాఠశాలలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కమిషన్ సభ్యురాలు పద్మావతి మాట్లాడుతూ నవంబర్ 14 నుంచి 20వ తేదీ వరకు బాలల హక్కుల వారోత్సవాలు జరుపుకుంటున్నామన్నారు. బాలల భవిష్యత్‌పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. వారి విద్యాభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు చేపట్టిందని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జ్యోతిర్మయి, తహసీల్దార్ రవిబాబు, వైద్యాధికారి నిర్మల్ కుమార్, ఎంఈవో కోటేశ్వరరావు, సీఐ వెంకట్రావు పాల్గొన్నారు.

రైతుసేవా కేంద్రాలతో ప్రయోజనాలు

చీరాలటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : దళారులు, మిల్లర్‌ల చేతుల్లో నష్టపోకుండా రైతులు వారి పంటను రైతు సేవా కేంద్రాల్లో విక్రయించుకోవచ్చని ఏవో సుమతి అన్నారు. సోమవారం మండల పరిధిలోని కావూరివారిపాలెం, గవినివారిపాలెం, దేవినూతల ప్రాంతాల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ-పంట నమోదు చేసుకుని, ఈకేవైసీ పూర్తయిన రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. క్వింటాకు రూ.2320 (సాధారణ రకం)కు ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సహాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

అద్దంకి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రవీంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు అందజేసిన అర్జీలను స్వీకరించి వాటిని ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు.

తైక్వాండోలో సత్తా

రాష్ట్ర స్థాయిలో సిల్వర్ మెడల్ సాధించిన సత్యం హైస్కూల్ విద్యార్థిని


జననిని అభినందిస్తున్న హైస్కూల్ కరస్పాండెంట్ హరనాథ్‌బాబు, హెచ్ఎం

చినగంజాం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కందుకూరులోని ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలలో సత్యం హైస్కూల్ విద్యార్థిని ఎం.జనని సిల్వర్ మెడల్ సాధించింది. ప్రకాశం జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15, 16, 17 తేదీలలో జరిగిన 38వ సబ్ జూనియర్ క్యోరోగి, 13వ పూమ్సే బాల బాలికల తైక్వాండో రాష్ట్ర చాంపియన్‌షిప్-2024 పోటీలలో 24 కేజీల విభాగంలో జనని సిల్వర్ మెడల్ సాధించినట్లు కోచ్ వాటుపల్లి సుబ్రహ్మణ్యం తెలిపారు. హైస్కూల్‌లో సోమవారం జరిగిన అభినందన సభలో సిల్వర్ మెడల్ సాధించిన జననిని కరస్పాండెంట్ ఎన్.హరనాథ్‌బాబు, హెచ్ఎం ఆర్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, కోచ్‌లు సుబ్రహ్మణ్యం, షేక్ సుల్తాన్‌బాషా, విద్యార్థులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

చీరాలటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరాడు. పేరాల బాలాజీ థియేటర్ వెనుక ఉంటున్న గుద్దంటి వెంకట సుబ్బారావు ఈపూరుపాలెం మీ సేవా సమీపంలో విఘ్నేశ్వర గ్రాఫిక్స్ నడుపుతున్నారు. ఇతనికి భార్య ఇద్దరు పిల్లలు. సోమవారం రాత్రి దుకాణం ముగిశాక ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతుండగా స్ట్రయిట్ కట్ సమీపంలో ఎదురుగా వస్తున్న దంపతుల వహనం పరస్పరం ఢీకొన్నాయి. ప్రమాదంలో అందరూ గాయపడ్డారు. దంపతులను ప్రైవేటు వైద్యశాలకు స్థానికులు తరలించారు. సుబ్బారావును ప్రైవేటు వాహనంలో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రుడి పరిస్థితి విషమంగా ఉంది.

ట్రాఫిక్ చక్రబంధంలో పర్చూరు


పర్చూరు బొమ్మల సెంటర్‌లో ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనాలు


రోడ్లపైనే నిలిపి ఉన్న వాహనాలు

» **అవస్థలు పడుతున్న వాహనదారులు**
» **108 వాహనానికీ దారి దొరకని వైనం**
» **బొమ్మల సెంటర్‌లో పరిస్థితి దయనీయం**
» **పట్టించుకోని అధికారులు**

పర్చూరు, నవంబరు 18 (పర్చూరు) : ట్రాఫిక్ చక్రబంధంలో పర్చూరు కొట్టుమిట్టాడుతోంది. నెలకొంది. నిత్యం వందల సంఖ్యలో వాహనాలతో రద్దీగా ఉండే బొమ్మల సెంటర్ కూడలిలో రాకపోకలకు తీవ్ర అంతరాయం, అవస్థలు తప్పడం లేదు. ఆక్రమణలతో రోడ్లు కుంచించుకుపోవడంతోపాటు వాహనాలను యథేచ్ఛగా రోడ్లపైనే నిలపడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారుతుంది. పర్చూరు ఆయా ప్రధాన పట్టణాలకు కూడలి కావడంతో, రాజధానికి చేరుకేనేందుకు పర్చూరు నుంచి ప్రయాణం సులభమని అత్యధిక సంఖ్యలో వాహనాలు బొమ్మల సెంటర్ మీదుగానే రాకపోకలు సాగుతున్నాయి. దీనికి తోడు తెంగాణ రాష్ట్రం నుంచి వీకెండ్‌కు చీరాల వాడరేవుకు వందల సంఖ్యలో వాహనాలు పర్చూరు నుంచే సాగుతున్నాయి. దీంతో వాహనాలు కదలని పరిస్థితి నెలకొంటుంది.

రోడ్లపైనే వాహనాలు

వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేస్తుండడతో పాదచారులతోపాటు వచ్చి పోయే వాహనాలు కదలడం లేదు. సా యంత్రం సమయాల్లో ప్రయాణం నకరం కన్పిస్తోంది. గంటల తరబడి వాహనాలు పర్చూరు బొమ్మల సెంటర్ కూడలిలో నిలిచిపోతున్నా కనీసం పట్టించుకునే వారే కరువయ్యారు.

మంత్రి వాహమైనా ఆగాల్సిందే

దుకాణాల ముందు, రోడ్లపై కార్లు, ద్విచక్రవాహనాలు నిలుపుతుండడం తో ట్రాఫిక్ సమస్య నెలకొంది. బొమ్మల సెంటర్‌లో ఒక్కోసారి 108 అయినా, మంత్రి వాహనమైనా నిలిచిపోవల్సిందే. దీనినిబట్టి ట్రాఫిక్ సమస్య తీవ్రత అర్థం చేసుకోవచ్చు. కూటమి ప్రభుత్వం రాకతో రాజధాని అమరావతికి ప్రయాణికుల తాకిడి పెరిగింది. దీ నిని దృష్టిలో పెట్టుకొని ట్రాఫిక్ సమస్య లేకుండా పోలీసు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవారం పూజలు

పెద్ద సంఖ్యలో సముద్రస్నానాలు

చీరాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వాడరేవు, రామాపురం, పొట్టిసుబ్బయ్యపాలెం సముద్రతీరంలో కార్తీక సోమవారం సందర్భంగా భక్తులు పెద్దసంఖ్యలో సముద్ర స్నానాలు ఆచరించారు. ఆయా ప్రాంతాల్లో భక్తులకు, పర్యాటకులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తగిన ఏర్పాట్లు చేశారు.

అద్దంకి : కార్తీక 3వ సోమవారం సందర్భంగా శివాలయాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పూజలు నిర్వహించారు. మండలంలోని మణికేశ్వరంలో మల్లేశ్వరస్వామి దేవాలయంలో భక్తులు గుండ్లకమ్మ నదిలో కార్తీక స్నానాలు ఆచరించి కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకున్నారు. పట్టణంలోని పాతశివాలయం, వేయి స్తంభాల గుడి, కమఠేశ్వరాలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో పూజలు నిర్వహించారు.


వాడరేవు తీరంలో పర్యాటకులు, భక్తుల సందడి


మణికేశ్వరం మల్లేశ్వరస్వామి దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

గ్రంథాలయ వారోత్సవాలకు విశేష స్పందన

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు

చీరాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం విద్యార్థులకు చిత్రలేఖనంపై పోటీలు నిర్వహించారు. సుమారు 100 మందికి పైగా పోటీలో పాల్గొన్నారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను వారోత్సవాల ముగింపు సభలో అందజేస్తామని గ్రంథపాలకురాలు ధనమ్మ తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, ప్రముఖులు పాల్గొన్నారు.

చినగంజాం : గ్రంథాలయం ఆధ్వర్యంలో రాజుబంగారుపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు డ్రాయింగ్, కడవకుదురు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వక్తృత్వ పోటీలను సోమవారం నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందజేస్తారని గ్రంథపాలకుడు మోహనలక్ష్మీనరసింహాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో కడవకుదురు, రాజుబంగారుపాలెం జడ్పీ పాఠశాలల హెచ్ఎంలు కుర్రా రామారావు, షేక్ కాలేషావలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


చిత్రలేఖనం పోటీలో పాల్గొన్న విద్యార్థులు

సంతమాగులూరు : విద్యార్థినీ, విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, క్యారం, చెస్, ఖోఖో ఆటల పోటీలను నిర్వహించినట్లు గ్రంథపాలకుడు విజయభాస్కరరెడ్డి తెలిపారు. న్యాయనిర్ణేతగా విశ్రాంత లెక్చరర్ ఎండీ అల్తాఫ్ పాల్గొన్నారు. అనంతరం తన కీర్తనలతో అసమానతలు రూపుమాపేందుకు విశేష కృషి చేసిన గురుభక్త స్వర్గీయ కనకదాసు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.





నెల్లూరు : మూలపేట శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



సంగంలోని వృద్ధాశ్రమంలో త్రిదండి రామానుజ చిన్న జీయర్

దేవుడిపై భక్తిభావంతో మెలగండి

● త్రిదండి రామానుజ చిన్న జీయర్

6

దేవుడిపై ప్రతి ఒక్కరూ భక్తిభావంతో మెలిగినప్పుడే ఆయన మనపై అంతే ప్రేమ చూపిస్తారని త్రిదండి రామానుజ చిన్నజీయర్ అన్నారు. సోమవారం సంగం, కలువాయి మండలాల్లో పర్యటించిన చిన్నజీయర్ భక్తులతో మాట్లాడారు. చిన్న, పెద్ద, ధనిక, పేద, కులాలకు అతీతంగా ప్రజలందరినీ ఒకచోటకు చేర్చేదే ఆలయమని అన్నారు.

'సోమశిల'లో నీటినిల్వ 70 టీఎంసీలు

అనంతసాగరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నీటిమట్టం 70.277 టీఎంసీలకు చేరుకుంది. ఎగువ ప్రాంతం నుంచి 8,384 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. దిగువ డెల్టాకు 50, కండలేరుకు తెలుగుగంగ ద్వారా 3,000, ఉత్తరకాలువకు 550, దక్షిణ కాలువకు 400 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.



జడ్పీ సీఈవోగా విద్యారమ

నెల్లూరు (జడ్పీ), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సీఈవోగా శ్రీకాళహస్తి డీఎల్‌డీవోగా పనిచేస్తున్న ఎం.విద్యారమను నియమిస్తూ కూటమి ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడున్న ఖాదర్‌బాషా దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో సీఈవో పోస్టు ఖాళీగా ఉంది. ఈ నేపథ్యంలో జడ్పీ సీఈవోగా విద్యారమను పంచాయతీరాజ్ శాఖ నియమించింది. ఒకటీ రెండు రోజుల్లో ఆమె బాధ్యతలు చేపట్టనున్నారు.



ఓం నమో.. శివ రుద్రాయ

కార్తీక మాసం మూడవ సోమవారం సందర్భంగా భక్తజనంతో శైవక్షేత్రాలు శోభిల్లాయి. ఉదయం నుంచే స్వామివార్లకు పాలభిషేకాలు, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, రుద్రహోమాలు, విశేష పూజలు జరిగాయి. దీపాలు వెలిగించిన భక్తులు విశేష అలంకరణలో కొలువుదీరిన స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఇక సముద్ర, నదీతీర ప్రాంతాల్లోనూ భక్తులు స్నానమాచరించి, కార్తీక దీపాలు వెలగించారు.

అసలు, వడ్డీ చెల్లిస్తేనే కొత్త రుణం!

పంట రుణాల మంజూరుకు బ్యాంకర్ల మెలిక

వ్యవసాయ రుణాల పునరుద్ధరణకు బ్యాంకర్లు అమలు చేస్తున్న నిబంధనలు అన్నదాతలను కష్టాల్లోకి నెట్టేస్తున్నాయి. పాత రుణాలను వడ్డీతోసహా చెల్లిస్తేనే కొత్త రుణాలు ఇస్తామని తెగేసి చెబుతున్నారు. దీంతో రైతులు ఏం చేయాలో దిక్కుతోచక తలలు పట్టుకుంటున్నారు. సాధారణంగా సీజన్ ఆరంభంలో పంటల సాగు కోసం కర్షకులకు చేయూతగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వడ్డీ రాయితీ అమలు చేస్తున్నాయి. విపత్కర పరిస్థితుల తలెత్తినప్పుడు వడ్డీ కట్టి రుణాన్ని పునరుద్ధరించుకుంటారు. అయితే, మారిన నిబంధనలతో ఈ పరిస్థితి లేకుండా పోయింది. బ్యాంకర్లు కూడా పూర్తి రుణం చెల్లిస్తేనే కొత్త రుణాలు ఇస్తామని చెబుతుండటంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది.

- ఆత్మకూరు (ఆంధ్రజ్యోతి)



అసలు, వడ్డీ చెల్లించమన్నారు

నాకు కొరిమెర్లలో రెండున్నర ఎకరాల పొలం ఉంది. సంగం కెనరా బ్యాంకులో గత ఏడాది ఒక లక్ష రూపాయలు పంట రుణం తీసుకున్నాను. ఏడాది పూర్తి కావస్తుండటంతో పంట రుణం రెన్యూవల్ చేయడానికి వెళ్లాను. అసలు, వడ్డీ మొత్తం చెల్లిస్తేనే కొత్త క్రాప్‌లోన్ ఇస్తామన్నారు.

- అక్కలనేని దొరబాబు, రైతు, కొరిమెర్ల





సంవత్సరంలోపు కడుతున్నా రాయితీ అందలేదు!

తరుణవాయిలో నాకు రెండు ఎకరాల పొలం ఉంది. సంగం కెనరా బ్యాంకులో రూ.90 వేలు పంట రుణం తీసుకున్నా. మళ్లీ ఏడాదిలోపు వడ్డీతో కలిపి అసలు మొత్తం చెల్లించి కొత్తగా పంట రుణం తీసుకుంటున్నా. అలాగైతేనే ప్రభుత్వం ఇచ్చే వడ్డీ రాయితీ వస్తుందని అంటున్నారు. చేసేదిలేక ప్రతి సంవత్సరం మొత్తం చెల్లిస్తున్నా. కానీ ఒక్కసారి కూడా వడ్డీ రాయితీ వచ్చిన దాఖలాలు లేవు.

- దేగా కృష్ణయ్య, రైతు, తరుణవాయి

రాయితీ కోల్పోతున్న అన్నదాతలు

నెరవేరని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యం

జిల్లాలో 65 శాతం ప్రజలు గ్రామాల్లో నివసిస్తూ వ్యవసాయం, వ్యవసాయ ఆధారిత రంగాలపై ఆధారపడి ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి, రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. అందులో భాగంగా రైతులకు తక్కువ వడ్డీకి వ్యవసాయ రుణాలు అందించడమే ప్రభుత్వం లక్ష్యం. పంటల సాగుకు రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వడ్డీ రాయతీని అమలు చేస్తున్నాయి. ఏడాదిలోపు తిరిగి చెల్లిస్తే మూడు శాతం వడ్డీ రాయతీని కేంద్రం సదరు రైతు ఖాతాలో తిరిగి జమ చేస్తుంది. రూ. లక్షలోపు రుణం తీసుకున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం సున్నా వడ్డీ కింద మిగిలిన నాలుగు శాతాన్ని చెల్లిస్తోంది. అయితే వ్యవసాయ రుణాల రెన్యూవల్‌లో కొందరు బ్యాంకర్లు నిబంధనల పేరిట మోకాలడ్డుతున్నారు. అసలు, వడ్డీని పూర్తిగా చెల్లిస్తేనే రుణాలు రెన్యూవల్ చేస్తామని చెబుతున్నారు. చిన్న, సన్నకారు రైతులు పంట దిగుబడి చేతికి వచ్చిన తరువాత వడ్డీతో సహా చెల్లిస్తారు. కానీ పంట దిగుబడి సరిగా లేకపోవడం, గిట్టుబాటు ధర రాకపోవడం తదితర కొన్ని అనివార్య పరిస్థితులు ఎదురైనప్పుడు వడ్డీ చెల్లించి రుణాలను రెన్యూవల్ చేయించుకుంటారు. కానీ కొందరు బ్యాంకర్లు నిబంధనలు మేరకు పూర్తి మొత్తం చెల్లిస్తేనే కొత్త రుణం మంజూరు ఇస్తామని చెబుతున్నారు. దీంతో సకాలంలో రుణాల మొత్తం చెల్లించలేక కొందరు రైతులు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీని కోల్పోవలసి వస్తోంది.

రుణాలు చెల్లించిన రైతులకు వడ్డీ రాయితీ లభిస్తోంది. చిన్న, సన్నకారు రైతులు పంట దిగుబడి చేతికి వచ్చిన తరువాత వడ్డీతో సహా చెల్లిస్తారు. కానీ దిగుబడి సరిగా లేకపోవడం, గిట్టుబాటు ధర రాకపోవడం తదితర అనివార్య పరిస్థితులు ఎదురైనప్పుడు వడ్డీ చెల్లించి రుణాలను రెన్యూవల్ చేయించుకుంటారు. కొందరు బ్యాంకర్లు మాత్రమే వడ్డీ కట్టించుకుని పంట రుణాన్ని రెన్యూవల్ చేస్తున్నారు. ఇంకొందరు బ్యాంకర్లు నిబంధనల మేరకు పూర్తి మొత్తం చెల్లిస్తేనే కొత్త రుణం మంజూరు చేస్తామని తెగేసి చెబుతున్నారు. దీంతో సకాలంలో రుణాల మొత్తం చెల్లించలేక కొందరు రైతులు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీని కోల్పోవలసి వస్తోంది.



● **పంట రుణ లక్ష్యం రూ.8929 కోట్లు**

2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాలో 4.43 లక్షల మంది రైతులకు రూ.8929.02 కోట్ల పంట రుణాలు అందించాలనే లక్ష్యంగా బ్యాంకర్లకు నిర్దేశించారు. అయితే, సెప్టెంబరు నెల వరకు 2.83 లక్షల మంది రైతులకు రూ.5,666 కోట్లు మంజూరు చేశారు. ఈ క్రమంలో 63.46 శాతం రుణాల మంజూరు మాత్రమే పూర్తయింది. సకాలంలో పూర్తి మొత్తం చెల్లించనందున 20 శాతం పైబడి రైతులు వడ్డీ రాయితీని కోల్పోయే ప్రమాదం ఏర్పడింది.

● **పంట రుణాలకు మోకాలడ్డు**

జిల్లాలో ఎక్కువ మంది రైతులు ఎస్‌బీఐ, యూనియన్, కెనరా, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకుల నుంచి పంట రుణాలు తీసుకుంటారు. వెబ్‌ల్యాండ్‌లో ఉన్న సాగు విస్తీర్ణం ఆధారంగా ఒక్కో పంటకు ఒక్కో రకంగా (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్) రుణాలు మంజూరు చేస్తున్నారు. విస్తీర్ణాన్ని బట్టి ఒక్కో రైతుకు గరిష్ఠంగా 7 శాతం వార్షిక వడ్డీతో రూ.3 లక్షల వరకు రుణం ఇస్తున్నారు. సకాలంలో

కలుషిత ఆహారం తిని 35 మంది విద్యార్థులకు అస్వస్థత



హాస్టల్‌లోనే చికిత్స పొందుతున్న విద్యార్థులు

- ఏకలవ్య పాఠశాలలో ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి
- హుటాహుటిగా చేరుకున్న అధికారులు, ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి
- ప్రిన్సిపాల్, సిబ్బంది తీరుపై ఆగ్రహం

- వివరాలు 6లో..

సాగునీటి సంఘాల ఎన్నికలు వాయిదా

నెల్లూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి సంఘాల ఎన్నికలను తాత్కాలికంగా వాయిదా వేస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నందున ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించడం కష్టమని భావించిన ప్రభుత్వం ఆ మేరకు వాయిదా వేసింది. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 29వ తేదీ నాటికి ఎన్నికలు పూర్తి కావాల్సి ఉంది. ఇప్పటికే ఎన్నికల అధికారుల నియామకం, వారికి శిక్షణ కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఓటర్ల జాబితా కూడా దాదాపుగా పూర్తయింది. ఈ నెల 20వ తేదీన పోలింగ్ నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంది. రెండు వారాల్లో పూర్తి కావాల్సిన ఎన్నికల ప్రక్రియ వాయిదా పడింది. ఈ ప్రక్రియను తదుపరి ఎప్పుడు మొదలుపెట్టాలన్నది ప్రభుత్వం త్వరలోనే ప్రకటించనుంది.

ఆధునిక సాంకేతికతతో ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ

- అతిత్వరలో నెల్లూరులో ఏర్పాటు
- తొలిగా మూడు చోట్ల, ఆ తర్వాత మిగిలిన ప్రాంతాల్లో...
- కార్పొరేషన్ కమిషనర్, ఎస్పీ వెల్లడి

6



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కమిషనర్ సూర్యతేజ, పక్కన ఎస్పీ కృష్ణకాంత్



తిక్కన భవన్‌లో ఖాళీగా ఉన్న అధికారుల కుర్చీలు

మేమొచ్చినా.. మీరు రారేం!?

● అధికారుల తీరుపై జేసీ కార్తీక్ ఆగ్రహం ● ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కుర్చీలన్నీ ఖాళీ ● షోకాజ్ నోటీసు ఇవ్వాలని ఆదేశం

'ఈరోజు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఉందని తెలియదా?'. ఉన్నతాధికారులమైన మేమే పదిగంటలకల్లా వచ్చేశాం. మీరు రావడానికి ఇబ్బందేముంది. రానీ అధికారులందరికీ షోకాజ్ నోటీసులు ఇవ్వండి.' అంటూ జాయింట్ కలెక్టర్ కార్తీక్ డీఆర్వోను ఆదేశించారు. అయితే, నిమిషాల వ్యవధిలో అక్కడకు చేరుకున్న అధికారులు గుమికూడి రిజిస్టర్‌లో సంతకాలు చేస్తుండగా, మరోమారు జేసీ ఆగ్రహించి షోకాజు నోటీసులు జారీ చేయాలని గట్టిగా ఆదేశించారు.

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సమయపాలన పాటిస్తూ, కలెక్టరేట్‌లో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రావాల్సిన వివిధ శాఖల అధికారులు సోమవారం డుమ్మా కొట్టారు. ఉదయం 10 గంటలకే తిక్కన భవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రారంభమవగా, జాయింట్ కలెక్టర్ కార్తీక్, డీఆర్వో ఉదయభాస్కర్ పాల్గొన్నారు. అయితే, వీరికి ఎదురుగా వివిధ శాఖల అధికారులకు వేసిన కుర్చీలన్నీ ఖాళీగా కనిపించాయి. 10.30 గంటలైనా అధికారులు రాలేదు. ఒక అర్జీదారు ఫిర్యాదు మేరకు సంబంధిత అధికారిని జేసీ పిలిచారు. కానీ ఆ శాఖ నుంచి ఎవరూ పలకలేదు. దీంతో తన ఎదురుగా ఉన్న అధికారుల కుర్చీల వైపు జేసీ చూశారు. దాదాపు అన్నీ ఖాళీగా కనిపించాయి.

● **జేసీ ఆదేశాలతో పరుగులు**

ఉన్నతాధికారులు, అర్జీదారులు వచ్చినా పలు శాఖల అధికారులు హాజరు కాకపోవడంపై జేసీలో ఆగ్రహం తెప్పించింది. వెంటనే సదరు అధికారులందరికీ షోకాజు నోటీసులు జారీ చేయాలని డీఆర్వో ఉదయ భాస్కర్‌ను ఆదేశించారు. విషయం తెలుసుకున్న వెనువెంటనే

- మిగతా 6లో..

దేవుడిపై భక్తిభావంతో మెలగాలి

● త్రిదండి రామానుజ చిన్నజీయర్‌స్వామి

సంగం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ దేవుడిపై భక్తిభావంతో మెలిగితే దేవుడు కూడా మనపై అంతే ప్రేమ చూపిస్తారని త్రిదండి రామానుజ చిన్నజీయర్ స్వామి పేర్కొన్నారు. సోమవారం ఆయన మండలంలోని అమరపునాయుడు కండ్రికలో ల్యాంకో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. ఈసందర్భంగా స్వామీజీకి వృద్ధాశ్రమ నిర్వాహకురాలు లగడపాటి రామలక్ష్మమ్మ స్వాగతం పలికారు. వృద్ధాశ్రమం ఏర్పాటు లక్ష్యం, చేపట్టే సేవా కార్యక్రమాలను స్వామీజీకి వివరించారు. అనంతరం ఆశ్రమం ప్రవేశం వద్ద ఉన్న అభయాంజనేయస్వామి, కృష్ణాలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం ఆయన భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ కార్తీకమాసంలో ఇంట్లో, దేవాలయంలో దీపాలు వెలిగిస్తే మేలు జరుగుతుందన్నారు. ప్రజలందరూ ఆలయానికి వెళ్లి దీపాలు వెలిగించాలని, వన భోజనాలు చేయాలన్నారు. చిన్న, పెద్ద, ధనిక, పేద, కులాలకు అతీతంగా ప్రజలందరినీ ఒకచోటకు చేర్చేది ఆలయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాణా శ్రీనివాసులురెడ్డి, భక్తులు పాల్గొన్నారు.



పరమానంద ఆశ్రమంలో....

కలువాయి : మండలం రాజుపాళెం సమీపంలోని పరమానంద ఆశ్రమంలో జరుగు పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు చిన్నజీయర్‌స్వామి సోమవారం రాత్రి ఆశ్రమానికి చేరుకున్నారు. మంగళవారం ఉదయం గోపూజ, కార్తీక వనభోజనాలు, సాయంత్రం పెన్నానది హారతి కార్యక్రమంలో పాల్గొంటారని ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. అలాగే 20వ తేదీన ఆశ్రమంలో నూతనంగా నిర్మించిన వసతిగృహాలను చిన్నజీయర్‌స్వామి ప్రారంభిస్తారని వివరించారు.

ఆధునిక సాంకేతికతతో ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ

● అతిత్వరలో నెల్లూరులో ఏర్పాటు : కమిషనర్, ఎస్పీ

నెల్లూరు(సిటీ), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా రూపొందించబడిన అధునాత సాంకేతిక పరిజ్ఞానంతో తయారైన ఇంటెలిజెంట్ ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను నెల్లూరులో అతి త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు ఎన్ఎంసీ కమిషనర్ సూర్యతేజ, ఎస్పీ కృష్ణకాంత్ వెల్లడించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో ట్రాఫిక్ పోలీసులు, ఇంజనీరింగ్ అధికారులు మాట్రిక్స్ ఎస్‌పీటీ నెట్‌వర్క్స్ కంపెనీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిగ్నలింగ్ వ్యవస్థలో పాత పద్ధతులకు స్వస్తి చెబుతూ నూతన టెక్నాలజీని అందుపుచ్చుకుని సాంకేతిక వ్యవస్థను పూర్తిగా వాడనున్నట్లు తెలిపారు. తొలిగా నగరంలోని ఏసీకూరగాయల మార్కెట్, కేవీఆర్ కూడలి, కనకమహల్ సెంటర్ వద్ద ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మలి విడుతలో జిల్లా పోలీసు కార్యాలయం, హరనాథపురం, రామలింగాపురం, వీఆర్సీ కూడళ్ల వద్ద ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. ఇందుకోసం రూ.1.39 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నూతన విధానంలో పొల్యూషన్ మానటరింగ్, గ్రీన్‌చానల్, సెంట్రలైజడ్ సిస్టమ్, కేబుల్ ఫ్రీ, సెల్ఫ్ అడాప్టింగ్ కంట్రోల్, మల్టీ పిరియడ్ కంట్రోల్ వంటి అడ్వాన్స్ ప్రయోజనాలెన్నో ఉంటాయని తెలిపారు.

డీఆర్‌డీఏ ఏపీఎం సస్పెన్షన్

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : డీఆర్‌డీఏ జాబ్స్ విభాగంలో ఏపీఎంగా పనిచేస్తున్న శేషారెడ్డిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉదయగిరి ఏరియా కోఆర్డినేటర్ (ఇన్‌చార్జి)గా శేషారెడ్డి గతంలో పనిచేస్తున్న సందర్భంలో సార్వత్రిక ఎన్నికలు వచ్చాయి. ఈ ఎన్నికలలో వైసీపీ తరఫున శేషారెడ్డి ప్రచారం చేశారని పలువురు కలెక్టర్, ఎన్నికల సంఘం దృష్టికి తీసుకుని వచ్చారు. దీనిపై అప్పటి జడ్పీ సీఈఓ కన్నమ నాయుడును విచారణాధికారిగా నియోమించారు. విచారణలో వాస్తవమని తేలింది. అయితే, ఈ నివేదిక అంది చాలా కాలమైనా ఫైల్‌ను తొక్కిపెట్టారనే ఆరోపణలు ఉన్నాయి. ఎప్పుడో ఐదు నెలల క్రితం జరిగిన ఘటనపై ఇంకా చర్యలు తీసుకోలేదనే విషయమై ఫిర్యాదుదారులు ప్రశ్నించడంతో కలెక్టర్ ఈ మేరకు చర్యలు తీసుకున్నారు.

తప్పించుకోవడం ఎలా?



ప్రకృతి వైపరీత్యాల్లో ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం

ప్రకృతి వైపరీత్యాల నుంచి సురక్షితంగా బయట పడడం ఎలా? అనే అంశంపై ఎన్డీఆర్ఎఫ్ బృందం అధికారులు కలెక్టరేట్ తిక్కన భవన్‌లో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వరదలు, అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఎలా కాపాడుకోవాలనే అంశాలపై ప్రదర్శన నిర్వహించారు. గుండె నొప్పి వచ్చినప్పుడు సీపీఆర్ చికిత్స ఎలా చేయాలనేదానిపై డెమో ద్వారా వివరించారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించిన జేసీ కార్తీక్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రకృతి వైపరీత్యాల స్పందనశాఖ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వీరశేఖర్, డీపీవో శ్రీధర్‌రెడ్డి, డీఆర్వో ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

- నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి)



నెల్లూరు : ఉమామహేశ్వర ఆలయంలో ఆకట్టుకున్న పూలాలంకరణలు



నెల్లూరు : మూలస్థానేశ్వరాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



ఆరనీకుమా ఈ దీపం..

భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవారం

కార్తీక మాసం మూడవ సోమవారం వేడుకలు జిల్లాలో వైభవంగా జరిగాయి. రామాయపట్నం, తుమ్మలపెంట, ఇస్కపల్లి, రామతీర్థం, మైపాడు, కోడూరుపాడు, కాటేపల్లి, తదితర తీర ప్రాంతాల్లో సూర్యోదయానికి ముందే భక్తులు సముద్ర స్నానాలకు విచ్చేశారు. దీంతో ఆయా ప్రాంతాలు శివనామస్మరణలతో మారుమోగాయి. అలాగే శైవక్షేత్రాలల్లోనూ తెల్లవారు జాము నుంచే స్వామివార్లకు పాలభిషేకాలు, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు జరిగాయి. రుద్రహోమాలు, విశేష పూజలు, పుష్పాలంకారాలతో మూలవర్లు కళకళలాడాయి. సాయంత్రం ఆలయాలకు తరలివచ్చిన భక్తులు దీపాలు వెలిగించి, శివారాధన చేశారు.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)



సీతారామపురం : భైరవకోనలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



పొదలకూరులో పార్వతీపరమేశ్వరుల కల్యాణం



సైదాపురం : సిద్ధులకోనలో సిద్ధులకు పూజలు చేస్తున్న దేవరులు

వేదగిరిలో హుండీల లెక్కింపు

నెల్లూరు రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వేదగిరి క్షేత్రానికి గడిచిన 65 రో జుల్లో భక్తులు సమర్పించిన కానులక ద్వారా రూ.5.99 లక్షలు ఆదాయం సమకూరినట్లు ఈవో గోపి తెలిపారు. ఆలయంలో ప్రధాన హుండీతో పాటు కొండికానులు, అన్నదానం హుండీలను సోమవారం లెక్కించారు. అన్నీ హుండీలలో కలిపి పైమొత్తం ఆదాయం సమకూరిందని, ఈ మొత్తాన్ని బ్యాంకులో జమ చేయనున్నట్లు పేర్కొన్నారు.

మీరు రారేం!?

(5వ పేజీ తరువాయి)

10.45 సమయంలో కొందరు అధికారులు, అటెండెన్సు చూసే గుమాస్తా వద్దకు వెళ్లి లాలూచీ పడి సంతకాలు చేయడం మొదలు పెట్టారు. ఏమాత్రం భయం లేకుండా జేసీ, డీఆర్వోల పక్కనే గుమికూడి అటెండెన్సు రిజిస్టర్‌లో సంతకాలు చేశారు. దీనిని గమనించిన జేసీ రిజిస్టర్‌లో సంతకాలు చేయడం ఆపించి, షోకాజు నోటీసులు జారీ చేయాలని గట్టిగా ఆదేశించారు. అప్పటికీ తిక్కన భవన్‌కు హాజరుకాని 15 మంది అధికారులకు షోకాజు నోటీసులను జారీ చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు నిర్దేశించిన సమయం కన్నా ముందే రావాల్సిన అధికారులు ప్రతి సోమవారం ఆలస్యంగానే వస్తున్నారు. ఇప్పటివరకు ఎవరూ వీరిని గమనించలేదు. సోమవారం అధికారుల సీట్లన్నీ ఖాళీగా కనిపించటంతో అధికారుల డుమ్మా విషయం బయట పడింది. ఉన్నతాధికారులు వచ్చినా, సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు సకాలంలో రాకపోవడాన్ని చూస్తే తమ పట్ల అధికారులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థమవుతుందని అర్జీదారులు ఆవేదన వ్యక్తం చేశారు.

నెల్లూరు జైలుకు మేకా వెంకటరామిరెడ్డి

నెల్లూరు(క్రైం), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు సోషల్ మీడియాలో ప్రతిపక్ష నాయకులు, వారి కుటుంబ సభ్యులపై విపరీతంగా రెచ్చిపోతూ సోషల్ మీడియాలో ఇష్టానుసారంగా పోస్టులు పెట్టిన గుంటూరు జిల్లా తాడేపల్లి ప్రాంతానికి చెందిన మేకల వెంకటరామిరెడ్డిని నెల్లూరు దర్గామిట్ట పోలీసులు పీటీ వారెంట్ కింద సోమవారం అరెస్టు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై మేకా వెంకట రామిరెడ్డి సోషల్ మీడియాలో అసభ్యకరంగా మాట్లాడుతున్నారని నెల్లూరు దర్గామిట్ట పోలీసుస్టేషన్‌లో జనసేన పార్టీకి చెందిన నాయకులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే అప్పటికే ఆయన గుంటూరులో నమోదైన ఓ కేసుకు సంబంధించి కావలి సబ్‌జైలులో రిమాండ్‌లో ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న పీటీ వారెంట్ కింద కావలి సబ్ జైలు నుంచి అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్ విధించడంతో నెల్లూరు జైలుకు తరలించారు.

కలుషిత ఆహారం తిని

35 మంది విద్యార్థులకు అస్వస్థత

● చంద్రశేఖరపురం ఏకలవ్య గురుకులంలో ఘటన ● ఆలస్యంగా వెలుగులోకి..

కొడవలూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కలుషిత ఆహారం తిని సుమారు 35 మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఈ సంఘటన కొడవలూరు మండలం చంద్రశేఖరపురంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో ఆదివారం రాత్రి జరగ్గా, సోమవారం రాత్రి ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ పాఠశాలలో ఆదివారం రాత్రి విద్యార్థులకు ఎప్పటిలాగానే మెనూ ప్రకారం భోజనం వడ్డించారు. భోజనం చేశాక కొద్ది సేపటికి సుమారు 35 మంది విద్యార్థులకు వాంతులు, విరోచనాలు అయ్యాయి. వెంటనే పాఠశాల సిబ్బంది ఏవో కొన్ని మాత్రలు ఇచ్చి మింగించారు. సోమవారం ఉదయం ఈ విషయమై పాఠశాల సిబ్బంది విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేయకుండా తగ్గిపోతుందనే నిర్లక్ష్యంతో ఉండిపోయారు. అయితే సోమవారం రాత్రికల్లా విద్యార్థుల ఆరోగ్యం మరింత ఆరోగ్యం క్షీణించింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు వెంటనే పాఠశాలకు చేరుకోవడంతో సమాచారం బయటకు పొక్కింది. సమాచారం అందుకున్న కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి జిల్లా వైద్యాధికారులకు అప్రమత్తం చేసి వైద్య బృందాన్ని హుటాహుటిన పాఠశాలకు పంపారు. అక్కడికి చేరుకున్న వైద్యులు విద్యార్థులకు సెలైన్‌లు పెట్టి, రక్త పరీక్షలు చేసి చికిత్స అందిస్తున్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య పర్యవేక్షణలో ఆరుగురు వైద్యబృందం విద్యార్థులకు వైద్యసేవలు అందిస్తున్నారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కూడా రాత్రి 9 సమయంలో పాఠశాలకు చేరుకుని విద్యార్థులను పరామర్శించారు. వారిని ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వైద్య సేవలు అందించాలని వైద్యులను ఆదేశించారు. విద్యార్థులు అస్వస్థతకు గురికావడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఏకలవ్య పాఠశాల సిబ్బంది, ప్రిన్సిపాల్‌పై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే చర్యలు చేపడతామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆమె వెంట డీఎంహెచ్‌వో డాక్టరు పెంచలయ్య, పలువురు టీడీపీ నాయకులు, తదితరులు ఉన్నారు. సోమవారం అర్ధరాత్రి వరకు కూడా చికిత్సలు కొనసాగుతున్నాయి. అవసరమైతే విద్యార్థులను నెల్లూరుకి తరలించి, మెరుగైన చికిత్స అందిస్తామని డీఎంహెచ్‌వో తెలిపారు. వైద్యసేవలను తాను పర్యవేక్షిస్తున్నానని ఆయన పేర్కొన్నారు.



పాఠశాలలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

ఆదర్శం

చదువుకున్న

బడికి చేయూత

● ఎన్నారై కిశోర్‌బాబు దాతృత్వం

● డిజిటల్ తరగతులకు ప్రొజెక్టర్, కంప్యూటర్ వితరణ

● రూ.2లక్షలతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు

సంగం, (ఆంధ్రజ్యోతి) : ఉన్నత చదువులు చదివి ఉద్యోగ రీత్యా దుబాయ్ వెళ్లి వ్యాపారవేత్తగా, ఆర్థికంగా స్థిరపడేందుకు బీజం వేసిన ప్రభుత్వ బడిని ఆయన మరువలేదు. తనకు ఓనమాలు నేర్పించిన సరస్వతీనిలయానికి ఏదో ఒకటి చేయాలని తలిచారు. అంతే గ్రామస్థుల సహాయంతో బడి అభివృద్ధికి చేయూత అందిస్తున్నారు సంగం మండలం దువ్వూరులోని కిశోర్‌బాబు. దువ్వూరుకు చెందిన మోహన్‌రావు, లీలావతమ్మల కుమారుడు కిశోర్‌బాబు పదవ తరగతి వరకు గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివారు. మోహన్‌రావుది మధ్య తరగతి కుటుంబం కావడంతో చదువు ప్రాముఖ్యతను గుర్తించి కిశోర్ కష్టపడి చదివారు. కష్టపడి ఇంజనీరింగ్ పూర్తి చేసి చిన్నతనంలోనే ఉద్యోగరీత్యా దుబాయి వెళ్లారు. తన ప్రతిభతో సొంతంగా వ్యాపారం ప్రారంభించి అనతికాలంలోనే పెద్ద వ్యాపారవేత్తగా ఎదిగారు. తల్లిదండ్రులు నెల్లూరులో ఉండటంతో కిషోర్‌బాబు వీరి వద్దకు వచ్చినప్పుడల్లా స్వగ్రామం దువ్వూరుకు వచ్చేవారు. ఈ నేపథ్యంలో తన అభివృద్ధికి కారణమైన ఉన్నత పాఠశాల రుణం తీర్చుకోవాలని భావించారు. దీంతో ఓ ప్రణాళిక ప్రకారం అభివృద్ధికి శ్రీకారం చుట్టారు.

● విద్యార్థుల తాగునీటి అవసరాల కోసం రూ.2 లక్షలతో మినీ మినరల్ వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేశారు.

● రూ.1.5 లక్షలతో డిజిటల్ తరగతుల బోధనకు కంప్యూటర్, ప్రొజెక్టర్‌ను అందజేశారు. అలాగే మైకొసెట్‌నూ సమకూర్చారు.

● విద్యార్థుల కోసం క్రీడా పరికరాలు పంపిణీ చేశారు.

● ఏటా టెన్త్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్నారు. ఇంకా అభివృద్ధికి నిధులు అందజేస్తానని కిశోర్‌బాబు గ్రామస్థులతో అంటుంటారు.



దువ్వూరు ఉన్నత పాఠశాలలో కిశోర్‌బాబు ఏర్పాటు చేసిన మినరల్ వాటర్‌ప్లాంట్

పాఠశాలల పనివేళల

మార్పుతో ఇబ్బందులు : ఫ్యాప్టో



డీఈవోకు వినతిపత్రం అందచేస్తున్న ఫ్యాప్టో నాయకులు

నెల్లూరు(విద్య), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పనివేళల్లో మార్పులతో ఇబ్బందులు ఎదురవుతాయని, దీన్ని ఉప సంహరించుకోవాలని ఫ్యాప్టో నేతలు సోమవారం డీఈవో ఆర్.బాలాజీరావును కోరారు. ఈ మేరకు నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం పాప్టో నేతలు ఆయనకు వినతిపత్రం అందచేసి మాట్లాడారు. జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్‌గా పాఠశాలల పని దినాలను ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మార్పు చేశారన్నారు. అయితే గతంలో కొనసాగుతున్న 9 నుంచి 4 గంటల వరకు అందరికీ సౌకర్యవంతంగా ఉందని, విద్యార్థుల మానసిక స్థితికి కూడా ఇది సరిపోతుందన్నారు. విద్యా సంవత్సరం మధ్యలో సమయాలు మారుస్తూ నిర్ణయాలు తీసుకోవడం విద్యార్థులను ఇబ్బందులకు గురిచేసే ప్రమాదముందన్నారు. పని గంటల మార్పుల వలన సుదూర ప్రాంతాలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడతారన్నారు. దీనిపై అధికారులు పునరాలోచించి పాత సమయాన్నే కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో చైర్మన్ సురేంద్రరెడ్డి, ప్రధాన కార్యదర్శి మాస ప్రసాద్, నేతలు హజరత్, చలపతి, దశరథరాములు, పిచ్చిబాబు, చలపతిశర్మ తదితరులు పాల్గొన్నారు.

డీకేడబ్ల్యూ కళాశాలలో స్కిల్ హబ్

● కస్టమర్ కేర్, డొమెస్టిక్ నాన్ వాయిస్ కోర్సులు

నెల్లూరు(విద్య), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు శిక్షణ అందించేందుకు నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో స్కిల్ హబ్‌ను ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీగిరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ హబ్‌లో కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్-డొమెస్టిక్ నాన్ వాయిస్ కోర్సులు నిర్వహిస్తున్నామని, ఇందుకు 18-30 ఏళ్ల లోపు యువతులు ఇంటర్, ఆపైన చదివిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. 30 సీట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయని, ఈనెల 20వ తేదీ నుంచి నూతన బ్యాచ్‌కు శిక్షణ ప్రారంభం అవుతుందని, యువతులు, మహిళలకు ఉచితంగా అందించే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. శిక్షణ పూర్తయిన అనంతరం సర్టిఫికెట్ అందించడంతోపాటు వందశాతం ఉద్యోగ అవకాశం కల్పిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు ఫోన్ 8639867407, 9949063284ను సంప్రదించాలని తెలిపారు.

● ఉద్యోగ మేళా

డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం ఉద్యోగమేళా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సంస్థల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించి 41 మంది వివిధ రకాల ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ గిరి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కిల్ హబ్ ఇన్‌చార్జి డాక్టర్ శ్రీరంజని, సిబ్బంది ఉమా సుమాలిని, లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

టెన్త్ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

నెల్లూరు(విద్య), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పదో తరగతి 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన పరీక్ష ఫీజు గడువు పొడిగించినట్లు డీఈవో ఆర్.బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఈనెల 26వ తేదీ లోగా ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. రూ.50 అపరాధ రుసుముతో 27 నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు, రూ.200 అపరాధ రుసుముతో డిసెంబరు 3 నుంచి 9వతేదీ వరకు, రూ.500 అపరాధ రుసుముతో డిసెంబరు 10 నుంచి 16వ తేదీ వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు చెల్లించే పరీక్ష ఫీజులను జిల్లాలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈనెల 26 నుంచి బీబీబీ.ఙ్చ్పుఇజొరి.జీ వెబ్‌సైట్‌లో పాఠశాల లాగిన్ ద్వారా మాత్రమే ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. పరీక్ష ఫీజుతో పాటు ఒకేషనల్, మైగ్రేషన్ సర్టిఫికెట్ కోసం కూడా ఆన్‌లైన్‌లోనే ఫీజు చెల్లించాలని తెలిపారు. పూర్తి వివరాలకు వెబ్‌సైట్‌లో లేదా నెల్లూరు నగరంలోని దర్గామిట్ట ప్రభుత్వ పరీక్షల విభాగంలో సంప్రదించాలని తెలిపారు.

న్యూస్ బాక్స్

సత్ప్రవర్తనతో మెలగాలి

లింగసముద్రం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి):విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలిగి ఇతరులకు మార్గదర్శకంగా ఉండాలని ఎస్సీ బాలుర వసతిగృహం వార్డెన్ రామకృష్ణ తెలిపారు. అసమానతలు రూపుమాపునకు కృషి చేసిన ఆధ్యాత్మిక గురువు కనకదాసు జయంతి సందర్భంగా వసతిగృహంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఎస్టీలకు ఆధార్ శిబిరాలు

కందుకూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణ ఎస్టీలకు స్పెషల్ ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ అనూష సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 19 నుంచి 22 వరకు, తిరిగి ఈ నెల 26నుంచి 29వరకు క్యాంపులు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

ఓటరు జాబితాను సరిచేయండి

బిట్రగుంట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బోగోలు చెరువు ఎన్నికల ఓటరు జాబితాలోని తప్పులను రెవెన్యూ అధికారులు సరిచేయాలని సోమవారం వైసీపీ మండల కన్వీనర్ వీరరఘు కోరారు. సర్వే నంబరు 20-1లోని అనుభవదారులు ఎవరూ ఓటరు జాబితాలో లేరన్నారు. సర్వే నంబరు 175కు సంబంధించి నీటిపారుదలశాఖ కేవలం 40 సెంట్లు చెరువు ఆయకట్టు ఉన్నట్లు జాబితా ఇస్తే రెవెన్యూ అధికారులు 7ఎకరాలకు సంబంధించి ఆయకట్టుదారులను జాబితాలో చేర్చి ఉన్నారని వాపోయారు.

గోల్డ్ మెడల్ విద్యార్థినికి నగదు

ఆత్మకూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 రాష్ట్రస్థాయి 69 కేజీ కుస్తీ పోటీల్లో క్యాటగిరి విభాగంలోబట్టేపాడు ఉన్నత పాఠశాల విద్యార్థిని బంగారు పతకం సాధించింది. ఈమెకు సోమవారం డిప్యూటీ డీఈవో గోపాల్ రూ.5వేలు, రికార్డు అసిస్టెంట్ తోడేందల సురేష్ రూ.2వేలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో చలపతి, ప్రధానోపాధ్యాయుడు పెంచలయ్య, వ్యాయామ ఉపాధ్యాయుడు కృష్ణయ్య పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించండి

కలిగిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కావలి నుండి కలిగిరి, కొండాపురం మండలాలకు వెళ్లే ప్రజలకు రాత్రివేళల్లో బస్సు సౌకర్యం కల్పించాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నందనవనం ప్రభాకరరావు సోమవారం ఎంపీడీఓ ప్రత్యూషకు వినతిపత్రం అందజేశారు. వివిధ పనుల నిమిత్తం ఇతర పట్టణాలకు వెళ్లి ఈ గ్రామాల తిరిగి వెళ్లేందుకు రాత్రి 7:30సమయంలో కావలికి వస్తే బస్సులు ఉండవన్నారు. చేసేదిలేక కావలిలో రాత్రి పడుకోవాల్సి వస్తుందని వినతిలో పేర్కొన్నారు.

పశువులకు సుస్తీ చేస్తే మందుల్లేవ్!

- వైద్యులు, సిబ్బంది మందులు మార్కెట్‌కు తరలింపు
- వలేటివరిపాలెం. పోకూరు, వీఆర్ కోట పశువైద్యశాలల్లో ఇదీ పరిస్థితి

వలేటివారిపాలెం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలతో పాటు పోకూరు, వీఆర్‌కోట గ్రామీణ పశువైద్యశాలలు ఉన్నాయి. ఈ వైద్యశాలలకు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్న పశువుల మందులను కొందరు వైద్యులు, సిబ్బంది నల్లబజార్లో అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ పశు వైద్య కేంద్రాల్లో రోగనిర్ధారణ పరీక్షలు చేయడం ఎప్పుడో మానేశారు. అడపాదడపా పశుపోషకులు ఆసుపత్రులకు వచ్చినా మందులు లేవంటూ బయటకు రాసి కమిషన్లు దండుకుంటున్నారని ప్రజలు చెబుతున్నారు. పాడి పశువులకు ఎద సమయంలో ఇచ్చే సెమెన్ ఇంజక్షన్ కూడా ఉండటం లేదంటే పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థం అవుతుంది. కొందరు తెలసిన వ్యక్తులు ఈ విషయాలపై ప్రశ్నిస్తే ప్రభుత్వం నుండి మందులు సరఫరా కాలేందంటూ వైద్యులు మాటలతో బురిడి కొట్టిస్తున్నారు. పాడిరైతులు చేసేదిలేక బయట మార్కెట్‌లో సెమెన్ ఇంజక్షన్ ఒక్కోటి రూ.200 కొనుగోలు చేసి ప్రయివేట్ వైద్య సిబ్బందితో ఎదకు వచ్చిన గేదెలకు ఇంజక్షన్ వేయించుకొంటున్నారు. తెలసిన కొందరు రైతులకు మాత్రం పశువుల వీర్యాన్ని ఇచ్చి వారిని అక్కడ నుంచి సా గనంపుతున్నారు.

పశువులను ఏ అనారోగ్యంతో తీసుకెళ్లినా..

పశువులకు, సన్నజీవాలకు రోగం వచ్చి వైద్యశాలకు తీసుకెళ్లినా డీవార్మింగ్ యాంటిబయోటిక్, నొప్పులు, గాలికుంటు వ్యాక్సిన్ తదితర వ్యాధులకు మందులు లేవంటూ ఒకరికో ఇద్దరికో ఇచ్చి స్టాక్ లేదంటున్నారని పాడి రైతులు ఆదోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరు చేసేదిలేక కనిగిరి వెళ్లి మందులు తెచ్చుకుని ప్రయివేట్ సిబ్బందితో వైద్యం చేయించుకుంటున్నారు. లెక్కల్లో మాత్రం రైతులకు రాయి తీపై ఇచ్చినట్లు చూపిస్తున్నారు. రోగాల వచ్చిన సమయంలో చేయాల్సిన పేడ, రక్తం మూత్రం, పాలు నమూనాలు తీసుకొని పరీక్షించి దాని బట్టే వైద్యం చేయాలి. కానీ వలేటివారిపాలెం, పోకూరు పశువై ద్యశాలల్లో పరీక్షలే చేయడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ విషయంలో విచారణ చేపట్టి సకాలంలో మందులు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



పోకూరు పశు వైద్యశాల

ఒకరిపై ఒకరు చెప్పకుంటూ దాటవేత

ఈ విషయంపై వలేటివారిపాలెం ఏడీ బ్రహ్మయ్య, పోకూరు పశువైద్యులు వంశీని ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా ఒకరిపై ఒకరు చెప్పకుంటూ దాటవేస్తున్నారు.

నారుమడిలో జాగ్రత్తలు వహించాలి

అల్లూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నారుమడి దశలో జాగ్రత్తలు తీసుకుంటే వరి సాగులో సులభంగా సస్యరక్షణ చేపట్టవచ్చని కావలి ఏడీఏ నాగరాజు తెలిపారు. సోమవారం ఆయన అల్లూరులోని పలు నారుమడులను సందర్శించారు. నాట్లు సమయంలో నారును తీసేందుకు ఐదురోజులు ముందు కార్బోఫ్యూరాజ్ -3జి గుళికలను వినియోగిస్తే ఆకుచుట్టు పురుగును అరికట్టవచ్చన్నారు. పైరు సమయంలో అత్యధికంగా యూరియా వినియోగిస్తే తెగుళ్లు వస్తాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఆర్.వెంకటేశ్వర్లు, వీఏఏ వెంకట ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

ఆత్మకూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మున్సిపాల్టీ పరిధిలో ఇటీవల మృతి చెందిన ఐదు కుటుంబ సభ్యులకు సోమవారం శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు రాంపల్లి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరిస్తాం

- మస్తానయ్య ఇన్‌చార్జి తహసీల్దారు, చేజర్ల



చేజర్ల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): భూ సమస్యలు పరిష్కరిస్తామని ఇన్‌చార్జి తహసీల్దారు మస్తానయ్య తెలిపారు.

ఈ ముఖాముఖి

? రీసర్వే గ్రామ సభలు ఎలా జరుగుతు న్నాయి.

! ఇప్పటివరకు ఆరు గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించాం. గతంలో జరిగిన రీసర్వేపై అభ్యంతరాలుపై రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నాం.

? ఇప్పటివరకు ఎన్ని అర్జీలు స్వీకరించారు.

! రైతుల నుంచి 326 అర్జీలు వచ్చాయి. వాటిని త్వరలోనే పరిష్కరిస్తాం.

? సాగునీటి సంఘాల ఎన్నికలకు రైతుల జాబితా సిద్ధం చేశారా.

! రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి సంఘాల ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. రెవెన్యూ పరిధిలో ఉన్న జాబితాను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదించాము.

? ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు.

! ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు తప్పవు. చట్టపర చర్యలు తీసుకుంటాము.

సమస్యలు పరిష్కరిచాలని వినతులు

కావలి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి):గ్రామాల ప్రజలు సోమవారం ఆర్డీవో కార్యాలయ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చి తమ సమస్యలను పరిష్కరించాలని ఆర్డీవో వంశీక్రిష్ణకు విన తిపత్రం అందజేశారు. మండలంలోని పూల దొరువు నువ్వుశెట్టి వెంకటరమణయ్య ప్రభుత్వ భూములు ఆక్రమణలను గురించి వివరించారు. సమస్యను పరిష్కరించాలని అటవీశాఖ అధికారి శేషకు సూచించారు. అలాగే కలిగిరి మండలం తూర్పుగుడ్లదొనయర్ల పోలయ్య తన పొలం రీసర్వేలో వేరొకరి పేరు మీద ఎక్కించారని, అయ్యపురెడ్డిపాలెంకు చెందిన ఓ రైతు తన భూమిని వేరొకరు రిజిష్టర్‌లో ఎక్కించుకున్నారని తెలిపారు. వసతిగృహాలలో కనీస వసతులు కల్పించాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి విన్నవించారు. జలదంకి మండలంలోని రోడ్లు అధ్వానంగా ఉన్నాయనిఇ వాటికి మరమ్మతులు చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు తాళ్లూరు మాల్యాద్రి తెలిపారు. అలాగే కావలి పట్టణంలో ఎన్ని లేఅవు ట్‌లు వేశారు ఎన్నిటికి ల్యాండ్ కన్వర్షన్ తీసుకు న్నారో వాటివిరాలు తెలపాలని సమాచారహక్కు చట్టం కింద కోరారు.



వృద్ధుడి సమస్య వింటున్న ఆర్డీవో వంశీక్రిష్ణ

నివాస స్థలం 3 సెంట్లు ఇవ్వండి

- వ్యవసాయ కార్మికసంఘం నాయకుల ర్యాలీ

కందుకూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల నివాస స్థలాల కోసం గ్రామాల్లో 3సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు స్థలం ఇచ్చి గృహ నిర్మాణానికి ఒక్కో కుటుంబానికి రూ.5లక్షలు అందజేయాలని సీపీఐ. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ బాలకోటయ్య, మురళి,ఆనంద్‌మోహన్ చేశారు. ఈ మేరకు సోమవారం కందుకూరు సీపీఐ కార్యాలయం నుంచి సబ్ కలెక్టరు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నెల్లూరు జిల్లా కార్యదర్శి పోకూరి మాలకొండయ్య, కందుకూరు ఏరియా కార్యదర్శి బూసి సురేష్‌బాబులు మాట్లాడారు. గతప్రభుత్వం ఇచ్చిన ఒక సెంటు స్థలం పేదలకు ఏమాత్రం సరిపోడం లేదన్నారు. కార్యక్రమంలో నత్తా రామారావు, బాలబ్రహ్మచారి, సీహెచ్ దుర్గాప్రసాద్, కాకుమాని రమణమ్మ, పులి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ర్యాలీలో సీపీఐ, వ్యవసాయ కార్మికసంఘం నేతలు

ప్రజల ఫిర్యాదులు స్వీకరించేవారేరి..!

- అధికారుల డుమ్మా

ఉదయగిరి రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి సోమవారం తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాల్లో నిర్వహిస్తున్న ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి మండలస్థాయి అధికారులు డుమ్మా కొట్టడంతో తమ సమస్యలపై అర్జీలు ఇచ్చేందుకు వచ్చిన ప్రజలు ఊసూరుమంటూ వెనుతిరగాల్సి వస్తోంది. సోమవారం స్థానిక, ఎంపీడీవో కార్యాలయాల్లో నిర్వహించిన కార్యక్రమానికి 17 శాఖల అధికారులు పాల్గొనాల్సి ఉండగా 11గంటలకు కేవలం రెండు, మూడు శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. సమయపాలన పాటిం చకుండా కొందరు అధికారులు వచ్చామా.. వెళ్లమా.. అంటూ, మరికొందరు తమ సిబ్బందిని పంపి రిజిస్టర్‌లో సంతకాలు చేయిస్తూ మమ అనిపిస్తున్నారు. సంబంధిత జిల్లా అధికారులు స్పందించి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



అధికారులు హాజరుకాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

రాళ్లపాడుకు 1.50టీఎంసీల నీటిని విడుదల చేయాలి

- రాళ్లపాడు పరిరక్షణ కమిటీ నేతల డిమాండ్

లింగసముద్రం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సోమశిల నుండి రాళ్ల పాడు ప్రాజెక్టుకు 1.50 టీఎంసీల నీటిని విడుదల చేయాలని సీపీఎం గుడ్లూరు ఏరియా కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద పార్టీ నాయకులు, రాళ్లపాడు పరిరక్షణ సమితి నేతలతో కలిసి ఆయన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 25వేల ఎకరాలు సాగుభూమి, వందకు పైగా గ్రామాలకు సాగు, తాగునీటిని అందించే ప్రాజెక్టుపై ప్రభుత్వాలు అశ్రద్ధ చూపుతున్నాయని వాపోయారు. ప్రాజెక్టు మరమ్మతులకు రూ.25కోట్లు కేటాయించాలన్నారు. ప్రాజెక్టు ఎడమ కాలువ పొడిగింపు పనులు 12ఏళ్లగా ఒక్క అడుగు ముందుకు సాగడం లేదన్నారు. ప్రాజెక్టుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించాలన్నారు. అధికారుల, సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసరావు, ప్రాజెక్టు ఏఈ చంద్రమౌళికి వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నేతలు వెంకటయ్య, కృష్ణయ్య, నాగేశ్వరరావు, నారాయణ, విజయలక్ష్మి, మాల్యాద్రి, సుభాని, సుధాకర్, జిలాని, ప్రవీణ్‌కుమార్, జయరాంరెడ్డి, రామయ్య, మల్లికార్జున ఉన్నారు.



లింగసముద్రం: తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న నేతలు

చట్టాలపై అవగాహన

అల్లూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ తెగలకు సంబంధించిన చట్టాలు, హక్కులపై అవగాహన కలిగి ఉండాలని నెల్లూరు సీఐడీ డీఎస్పీ ఎన్. కోటారెడ్డి గిరిజనులకు తెలిపారు. అల్లూరులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సోమవారం వారితో సమావేశమై మాట్లాడారు. గతంలో మాది రిగా వెట్టిచాకిరి చేయాల్సిన అవసరం లేద ని ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో షెడ్యూల్డ్ ట్రైబ్ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కోఆపరేషన్ సభ్యురాలు తిరువీధి అనూరాధ, కావలి రూరల్ సీఐ రాజేశ్వరరా వు, ఎస్ఐ కిషోర్‌బాబు, ఎంపీడీఓ రజనీకాంత్, కమిషనర్ ఉమామహేశ్వరరావు, వి ద్యాశాఖాధికారి రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం

అనంతసాగరం, నవంబరు 18 (ఆంధ్ర జ్యోతి):సోమేశ్వరుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెం దిన ముత్యం కృష్ణ అన్న దానం ఏర్పాటు చేశారు. ధర్మకర్తలు ఉప్పల విజయ్ కుమార్, సోమసుందరమూర్తి పాల్గొన్నారు.

అధ్యక్షా.. ఫ్లోరైడ్ సమస్యను పరిష్కరించరూ !

- ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల విన్నపం

జలదంకి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ప్రాంతం ఫ్లోరైడ్ పీడిత ప్రాంతమని ఎంతోమంది పేదలు కిడ్నీవ్యాధి బారి నపడి అసువులు బాసారని, మరికొందరు సుదూర ప్రాంతాలకు వెళ్లి డయాలసిస్ చేయించుకుంటున్నారని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సోమవారం శాసనసభ దృష్టికి తీసుకెళ్లారు. ఉదయగిరి ప్రాంతంలో వైద్యఆ రోగ్యమంత్రి సత్యకుమార్ ఓ డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయించారని, మరిన్ని డయాలసిస్ సెంటర్లు మా ప్రాంతంలో అవసరమని ఈ విషయంపై మంత్రి స్పందించాలని చర్యలు తీసుకోవాలని కోరారు. ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలను 100పడకల స్థాయికి పెంచాలని కోరారు.



భూసమస్య పరిష్కరించాలని ఆందోళన

సీతారామపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): భూ సమస్య పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం సీతారామ పురం ఆదోని శేషయ్య గ్రామస్థులతో కలిసి ఆందోళన చేశారు. ఈసందర్భంగా రైతు మాట్లాడుతూ తన పేరు మీద ఉన్న మెట్ట భూమి గత నెల 17వ తేదీన ఆన్‌లైన్‌లో చూసుకోగా ఆదోని నాగరాజ పేరుతో మార్పు జరిగిందని అర్జీ ఇచ్చారు. ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. త్వరగా విచారణచేసి న్యాయం చేయాలని కోరాడు. కార్యక్రమంలో పిడుగు రమేష్, కాశీరత్తయ్య, రాజశేఖర్, నాగేశ్వరావు, బండి రవి, నారాయణ పాల్గొన్నారు.

భూ అక్రమణపై ఫిర్యాదు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): భైరవరంలో తమ భూమిని ఓ వ్యక్తి ఆక్రమించి సాగు చేస్తున్నాడని సోమవారం తహ సీల్దారు నాగరాజుకు బాధితులు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వేనెంబర్ 69/2లో 5.03 ఎకరాల సీజేఎఫ్ఎస్ భూమిని గత కొన్నేళ్ల క్రితం తాళ్లూరి నరసయ్య పేరు మీద ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఆయన మరణానంతరం కుటుంబ సభ్యులకు చెందాల్సిన భూమిని మరో వ్యక్తి ఆక్రమించి సాగు చేసు కుంటున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గుజ్జుల మల్లికార్జునపాల్గొన్నారు.

పట్టుబడినవి రేషన్ బియ్యమా ? నూకలా ?

లింగసముద్రం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టుపై తెల్లవారుజామున ఎన్‌ఫోర్స్ మెంటు అధికారులకు 40 బస్తాలలో పట్టుబడినవి రేషన్ బియ్యమా? లేక నూకల బియ్యమా అని అని ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పామూరు నుండి కావలికి అక్రమంగా తరలుతున్నాయని కందుకూరు ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులకు సమాచారం అందడంతో వారు సోమవారం తెల్లవారుజామున 3గంటలకు రాళ్లపాడు ప్రాజెక్టుపై మాటు వేశారు. అదే సమయంలో వచ్చిన మినీవ్యానును వారు తనిఖీ చేయగా అందులో 40బస్తాలలో బియ్యం ఉన్నట్టుగా గుర్తించి లింగసముద్రం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అయితే పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న రోడ్డుపై మినీవ్యానును ఆపి లైటు వెలుతురులో తనిఖీ చేయగా బస్తాలలో ఉన్నవి బియ్యం కాదని నూకలని వదిలేసినట్టు తెలిసింది. ఈ విషయమై కందుకూరు ఎన్‌ఫోర్స్‌మెంటు డీటీ చెంచురామయ్యను వివరణ కోరగా పట్టుకున్నవి నూకలని తేలడంతో వదిలేసినట్టు చెప్పారు.

శివాలయ నిర్మాణానికి భూమిపూజ



జలదంకి: పాల్గొన్న సర్పంచి దంపతులు



సంగం: భూమి పూజ చేస్తున్న సర్పంచి నాజున్ని

జలదంకి, నవంబర్ 18 (ఆంధ్ర జ్యోతి): సోమవరప్పాడులో శివాలయం నిర్మాణానికి సోమవారం సర్పంచ్ దంపతులు చేవూరి జనార్దన్‌రెడ్డి, సులోచ నమ్మలు భూమిపూజ చేశారు. పండి తుల వేద మంత్రోచ్చరణల మధ్య ఉద యం శివుడు, పార్వతీదేవి గర్భగుడుల నిర్మాణానికి అంకురార్పణ చేశారు. ఇప్పటికే గ్రామంలో సర్పంచ్ దంపతులు సాయిబాబా మందిరాన్ని నిర్మించారు. పూజల్లో స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అయ్యప్పమాలధారులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు పనులకు భూమిపూజ

సంగం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తలుపూరుపాడులో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం సర్పంచ్ నాజున్ని భూమిపూజ చేశారు. నిర్మాణ పనులకు రూ. 7 లక్షలు మంజూరవడంతో ఎస్సీ కాలనీలో సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభించారు.

- వరికుంటపాడు: గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రస్తుత ప్రభుత్వం అధిక నిధులు వెచ్చించి శ్రీకారం చుట్టిందని పంచాయతీరాజ్ ఏఈఈ రవీంద్రనాథ్ అన్నారు. సోమవారం గణేశ్వరాపురంలో సిమెంట్‌రోడ్ల నిర్మాణ పనులను ఆయన భూమి పూజ చేసి ప్రారంభించారు. నాణ్యతాప్రమాణాలతో పనులు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ సుధీర్‌బాబు, గుత్తేదారు పేరం సుధాకర్‌రెడ్డి, సిబ్బంది రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ లక్కీడిప్ బహుమతుల అందజేత

కావలి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సురక్షితం, సౌకర్యవంతమైన ఆర్టీసీ బస్సుల్లో వెళ్లే ప్రయాణికులను ప్రోత్సహించేందుకు కావలి ఆర్టీసీ డిపో మేనేజరు రాపూరు శ్రీనివాసులు లక్కీడిప్ బహుమతులను అందజేశారు. స్థానిక ఆర్టీసీ డిపో ఆ వరణలో సోమవారం జరిగిన కార్యక్రమంలో కొండా పురం, లింగసముద్రం, అల్లూరు రూట్లలో ప్రయా ణించిన వారి టిక్కెట్లను లక్కీ డిప్ తీసి రామస్వామి ఆసుపత్రి వారి సౌజన్యంతో ఒక్కో రూట్‌లో ఒకరికి చీరలు ఇచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజరు (ట్రాఫిక్) ఎం.కల్పన, ట్రాఫిక్ సూపరింటిండెంట్ రామకృష్ణ, బస్సుస్టేషన్ ఇన్‌చార్జి రమేష్ బాబు, రవిప్రకాష్ ఉన్నారు.



బహుమతులు ఇస్తున్న అధికారులు

సభ్యత్వ నమోదును వేగవంతం చేయండి

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయా లని మండల బీజేపీ అధ్యక్షుడు చుండి హరిగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నర్రవాడ బీజేపీ కార్యాలయంలో కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులిచర్ల నారాయణరెడ్డి, కిసాన్‌మోర్చా మాజీ అధ్యక్షుడు మేకపాటి మాల్యాద్రినాయుడు, బూత్ కమిటీ అధ్యక్షులు ఉన్నారు.

- వింజమూరు: బీజేపీని బలోపేతం చేయాలని బీజేపీ జిల్లా ప్రతినిధి పెంచలయ్య అన్నారు. పట్టణ పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు దేగ మధుయాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటనారాయణరెడ్డి, నాయకులు రాజశేఖర్, బాలకృష్ణ, రమేష్ పాల్గొన్నారు.
- బిట్రగుంట: బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్డీ విల్సన్ సోమవారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయంలో మండలాధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులుయాదవ్ ఆధ్వర్యంలో జరిగిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం అయ్యారు. కార్యక్రమంలో పార్టీ పటణాధ్యక్షుడు కుట్టుబో యిన బ్రహ్మానందం, స్థానిక నేతలు ఉన్నారు.

గ్రంథాలయాలపై అవగాహన

కావలి రూరల్ (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల విశిష్టతపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని లోక్ అదాలత్ సభ్యులు మాలకొండారెడ్డి తెలిపారు. మాతినవారిపాలెం ప్రాథ మికోన్నత పాఠశాలలో సోమవారం ని ర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొన్నారు. కార్యక్ర మంలో హెచ్ఎం రాధాక్రిష్ణ పాల్గొన్నారు.

ఇంద్రాక్షి అమ్మవారి ఆలయంలో చోరీ

మర్రిపాడు, నవంబరు (ఆంధ్రజ్యోతి) 18: చుంచులూరులోని ఇం ద్రాక్షి అమ్మవారి ఆలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. హుండీతో పాటు అమ్మవారి మంగళ సూత్రాలను గుర్తుతెలియని వ్యక్తులు దొంగి లించారు. గేటు తాళాలు పగలకొట్టి ఉండటాన్ని సోమవారం తెల్లవారు జామున స్థానికులు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. సం ఘటనా స్థలాన్ని పరిశీలించి ఎస్ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేశారు.

మాతమ్మ ఆలయంలో...

- అనంతసాగరం: పడమటికంబంపాడు గ్రామదేవత మాతమ్మ ఆలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. దుండగులు గుడి తాళాలు పగులగొట్టి మూడు సవర్ల మంగళసూత్రాన్ని దోచుకెళ్లినట్లు స్థానికులు గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

కొత్తపల్లి వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాకురువారిపల్లికి చెందిన పిచ్చిరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. మోటారుబైక్ అదుపుతప్పడంతో గాయపడిన పిచ్చిరెడ్డిని 108 వాహనంలో ఆత్మకూరు ప్రయివేటు వైద్యశాలకు తరలించారు.

అదుపుతప్పి కల్వర్టు గోడను ఢీకొన్న లారీ

- మర్రిపాడు: చుంచులూరు సమీపంలో 565వ నెంబరు జాతీయ రహదారిపై లారీ అదుపుతప్పి కల్వర్టు గోడను ఢీకొన్న సంఘటన సో మవారం తెల్లవారుజామున జరిగింది. డ్రైవర్ నిద్రమత్తులోకి వెళ్ల డం తో ఈప్రమాదం జరిగింది. డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. అలా గే శింగనపల్లిలో బెల్టుషాపు నిర్వహిస్తున్న శ్రీనివాసులుపై పోలీ సులు కేసు నమోదు చేసి అతనివద్ద 15మద్యం సీసాలను స్వాధీనం చేసుకు న్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరించారు.

పథకాలను చిరువ్యాపారులు సద్వినియోగం చేసుకోండి

కందుకూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): చిరువ్యాపారులు, వీధి వ్యాపారులు ఆర్థిక స్వావ లంభన సాధించటమే లక్ష్యంగా కేంద్రం అనేక పథకాలతో ప్రోత్సాహకాలు, హామీలేని రుణాలు అందజేస్తుందని వీటిని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమీషనర్ కె.అనూష కోరారు. ఈ పథకాలపై స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇండియన్ బ్యాంక్ మేనేజరు సుందరరావు, మెప్మా సీఎంఎం సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

అర్హులందరికీ కేంద్ర పథకాలు అందాలి

కావలి టౌన్, నవంబరు 18: అర్హులైన ప్రతిఒక్కరికీ కేంద్ర ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేయాలని మెప్మా సిటీ మిషన్ మేనేజర్ భారతి తెలిపారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం సమావేశ మందిరంలో వీధి విక్రయదారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. స్వనిధి, స్వాభిమానం, పక్వాడ తదితర పథకాలు వీధివిక్రయదారులకు అందేలా వారి వివరాలు డిజిటలైజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. వీరి అకౌంట్‌లు డిజిటలైజ్ చేసి (ఫోన్‌పే, గుగూల్ పే, భారత్ పే) వారికి రుణాలు అందేలా చూడాలన్నారు. కేంద్ర 8పథకాలను ప్రయోజనాలు వారికి అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో సౌజన్య, లేబర్ డిపార్ట్‌మెంట్‌నుంచి రమేష్‌నాయుడు అధికారులు సిబ్బంది వీధి విక్రయదారులు పాల్గొన్నారు.

భక్తులతో పోటెత్తిన శైవ క్షేత్రాలు

సీతారామపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రాచీన శైవక్షేత్రాలు ఘటిక సిద్దేశ్వరం, భైరవకోన, సీతారామపురంలోని శివాలయాలు కార్తీక సోమవారం సందర్భంగా భక్తులతో పోటెత్తాయి. తెల్లవా రుజామునుంచే భక్తులు కార్తీక దీపాలు వెలిగించి పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు.

- ఉదయగిరి రూరల్: కార్తీక మాసం సందర్భంగా మండలంలోని పలు శివాలయాల్లో సోమవారం భక్తులు కార్తీక దీపాలు వెలగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల పరిధిలోని గండిపాళెం, గుడినరవ, అప్పసముద్రం, లింగాలదొన, యర్రబల్లిగడ్డ, ఆర్లపడియ గ్రామాలతోపాటు పట్టణంలోని పార్వతీ పరమేశ్వరాలయాల్లో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. అలాగే దుత్తలూరు కొండపై ఉన్న రామలింగేశ్వరస్వామిని భక్తులు అధికసంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. అర్చకులు స్వామివారికి అభిషేకాలు, పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.